

పురాతనమైన సమస్తరోగాలకు

ఆయుర్వేద చికిత్స

మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల నొప్పులకు వనమూలికలతో వైద్యంచేయబడును.

శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము

నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం

మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :35 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు శనివారం 13 జూన్ 2026 పేజీలు :12 వెల రూ5 /-




## ‘ఉత్తమ వైద్యం అందిస్తాం’..

### చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ

**హైదరాబాద్, జూన్ 12:** స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్-2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే స్పందించారు. ‘చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆర్ఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా’ అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.

## అతి త్వరలో యథావిధిగా సింగరేణి

# మెడికల్ బోర్డు...

### మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలి

### అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు చేపట్టాలి

### సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశం



**హైదరాబాద్, జూన్ 12:** సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రేపు(శనివారం) మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు.కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## రాజ్యసభకు ఖర్గే సహా 24 మంది ఎంపీలు ఏకగ్రీవంగా ఎన్నిక



**న్యూఢిల్లీ:** రాజ్యసభకు ఈనెల 18న ఎన్నికలు జరగాల్సి ఉండగా దీనికి ముందే పోటీ లేకుండా 24 మంది పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ కార్యదర్శి తరుణ్ చుగ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. మొత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా వీటిలో 24 స్థానాలకు ఫలితాలు ప్రకటించారు. గెలుపొందిన అభ్యర్థులకు విన్నింగ్ సర్టిఫికేట్లను రిటర్నింగ్ అధికారులు అందజేశారు. రాజ్యసభలో ఎన్డీయే సంఖ్యాబలం 16 కాగా, తాజాగా మరో ముగ్గురు గెలవడంతో ఆ బలం 19కి చేరింది. కాంగ్రెస్ 5 సీట్లు గెలుచుకోగా, నాలుగు సీట్లు ఇంతకు ముందే ఆ పార్టీకి ఉన్నాయి. దీంతో రాజ్యసభలో కాంగ్రెస్‌కు ఒక సీటు మాత్రమే పెరిగింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో 3 సీట్లు కోల్పోయింది. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ సైతం తన సీట్లు బీజేపీకి కోల్పోయింది. బీజేపీ అభ్యర్థి దేబాశిష్ సమంతరాయ్ ఏకగ్రీవంగా - మిగతా3లో

## 824 నియోజకవర్గాల పెంపునకు

# ఈసీ ప్రతిపాదనలు




**న్యూఢిల్లీ, జూన్ 12:**దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాని ఆర్థిక సలహా మండలి కీలక ప్రతిపాదనలు చేసింది. జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా పట్టణీకరణ, ఎస్సీ-ఎస్టీ జనాభా, భాషాపరమైన వైవిధ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని కొత్త నియోజకవర్గాల ఏర్పాటు చేపట్టాలని సూచించింది. ముఖ్యంగా చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రాతినిధ్యం పెంచే లక్ష్యంతో అక్కడి లోక్‌సభ స్థానాలను రెట్టింపు చేయాలని సిఫార్సు చేసింది.ప్రస్తుతం దేశంలో 543 లోక్‌సభ స్థానాలు ఉండగా, తాజా ప్రతిపాదనలు అమలైతే వాటి సంఖ్య 824కు చేరే అవకాశం ఉంది. పెద్ద రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న సీట్లను సుమారు 50 శాతం వరకు పెంచే విధంగా మోడల్‌ను రూపొందించింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా 170 నియోజకవర్గాలను పునర్విభజించాలని నివేదిక పేర్కొంది. వీటిలో 59 నియోజకవర్గాలను రెండు భాగాలుగా, 111 నియోజకవర్గాలను మూడు భాగాలుగా విభజించే అవకాశం ఉందని వెల్లడించింది.కొత్త ప్రతిపాదనల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల్లో కూడా ఎంపీ స్థానాల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అయితే మొత్తం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య శాతం ప్రస్తుతం ఉన్న 23.7 శాతం స్థాయిలోనే కొనసాగించేలా - మిగతా3లో

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ..

### మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, జూన్ 12:** తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం నాడు హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026’ సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల - మిగతా3లో

## అటు కేసీఆర్...

# ఇటు కేటీఆర్...



**మెదక్, జూన్ 12:**తెలంగాణ రాజకీయాలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమి తర్వాత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు మైండ్ బ్లోయింగ్ ప్లాన్‌తో పొలిటికల్ గ్రౌండ్‌లోకి దూకేందుకు సిద్ధమైంది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ ఒకేసారి క్షేత్రస్థాయిలోకి రాబోతుండటం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. తండ్రీకొడుకులు ఇద్దరూ ఒకే వ్యూహంతో, కానీ భిన్న రూపాల్లో ప్రజల ముందుకు రావడం ఇప్పుడు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ వర్గాల్లో - మిగతా3లో

## చట్టం అనే ముసుగులో కేంద్రం తీసుకొచ్చిన

# దొంగ దారి ఎస్ఐఆర్..


### మంత్రి పొంగులేటి



**ఖమ్మం, జూన్ 12:** ఎస్ఐఆర్ అనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ (ూ×=) అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ధి పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెల్పిపారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

## నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

### హరీశ్ రావు



**కరీంనగర్, జూన్12:** రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్‌లోని హుజురాబాద్‌లో హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని ఆరోపించారు. కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు.

వార్తాతరంగాలు

శనివారం 13 జూన్ 2026


## సంపాదకీయం

# టాలీవుడ్ కు ఏమైంది...

తెలుగు సినీ పరిశ్రమ సంక్షోభంలో ఉంది. ఏడాదిగా నిర్మాతకు నికరంగా లాభాలు మిగిల్చిన సినిమా లేదంటే అతిశయోక్తి కాదు. వందల కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న సినిమాలు.. రిలీజ్ ఎప్పుడో తెలియని దుస్థితిలో ఉన్నాయి. దీంతో నిర్మాతకు రిలీజ్‌కు ముందే చుక్కలు కనిపిస్తున్నాయి. సినిమా షూటింగ్ ఏడాది జరిగితే.. సీజీ వర్క్‌కు రెండుమూడేళ్లు తీసుకుంటూ.. ఏళ్ల తరబడి సాగదీస్తున్నారు. అంత టైమ్ తీసుకున్న సినిమాలు కూడా రిలీజయ్యాక.. సీజీ వర్క్ బాగాలేదనే టాక్ తొలిరోజే బయటికొస్తోంది. ఇలా వందల కోట్ల బడ్జెట్లు.. ఏళ్ల తరబడి షూటింగులతో సినిమా రిలీజ్ కు ముందే నిర్మాతలు మునిగిపోతున్న దుస్థితి టాలీవుడ్‌లో కనిపిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో పడింది. గడిచిన ఏడాదిలో అసలు హిట్ మాటే వినలేదంటున్నారు. ఇంకా మాట్లాడితే పుష్ప 2 తర్వాత నిర్మాతలకు నికరంగా డబ్బులు మిగిల్చిన సినిమా లేదని టాలీవుడ్ నిట్టూరుస్తోంది. సినీ పరిశ్రమలో చిన్న నిర్మాతలు ఎప్పుడో మునిగారు. పెద్ద నిర్మాతల స్థితి కూడా పైన పటారం. లోన లొటారంలా ఉంది. చివరకు అమెరికాలో సంపాదించిన డబ్బులతో సినిమాలు తీసే నిర్మాతలు కూడా మునిగిపోతున్నారు.తెలుగు సినీ పరిశ్రమలో మొదట్నుంచీ విజయాల శాతం తక్కువే. ఎన్నో లెక్కలు వేసుకుని.. ఎంతో జాగ్రత్తగా తీసే సినిమాలే ఆడతాయని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. అలాంటిది అసలు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా.. గాల్లో లెక్కలు వేసుకుని తీసే సినిమాల గురించి చెప్పాల్సిన పనే లేదు. మొదట్లో కథల ఎంపిక కోసం ఏళ్ల తరబడి చర్చలు జరిగేవి. ఒకసారి కథ తయారయ్యాక కూడా 24 విభాగాల వారి సలహాలు తీసుకునేవారు. అలా బాగా నలిగిన, మార్పులు చేర్పులు చేసిన కథనే తెరకెక్కించేవారు. అలాగే కథకు తగ్గట్టుగా నటీనటుల ఎంపిక ఉండేది. కాంబినేషన్ల కోసం ఆరాటం, క్రేజ్ ఉన్న నటులే ఉండాలనే జంఝాటం ఏమీ ఉండేవి కాదు. పెద్ద హీరోలు అడిగినా కూడా.. ఈ కథ మీకు సరిపడదని నిర్మాతలు, దర్శకులు నిర్మొహమాటంగా చెప్పేసేవారు. ఎందుకంటే అప్పుడు కథే హీరో. సినిమాకే సింహాసనం. నటీనటులు, మిగతా వారికి ఎక్కువ ప్రాధాన్యత లేదు. ఆ రోజుల్లో ఓ సినిమాకు ప్రేక్షకుల ఆదరణ దక్కితే.. దాన్ని మిగతా భాషల్లోనూ డబ్ చేసేవారు. అప్పుడు డబ్బింగ్ రైట్స్ రూపంలోనూ డబ్బులొచ్చేవి. కొన్ని సినిమాలు నేరుగా పెట్టుబడి తేలేకపోయినా.. డబ్బింగ్ రైట్స్ తో నిర్మాతలు గట్టెక్కిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితే లేదు. కాంబినేషన్ల కోసం విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు.తెలుగు సినిమాకు హంగులు, ఆర్భాటాలు చాలా ఎక్కువయ్యాయి. మార్కెట్ కూడా పెరిగిందని కొన్ని హిట్ సినిమాల కలెక్షన్లు చూపించి గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ ఏం మారినా.. విజయాల శాతం మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంది. ఏటా వందల సినిమాలు రిలీజ్ కావడమే కానీ.. డబ్బులు తెచ్చే సినిమాలు మాత్రం కనిపించడం లేదు. అడపాదడపా హిట్టయ్యే సినిమాల గురించి చెప్పుకోవడమే కానీ.. రెగ్యులర్‌గా లాభాలు మాత్రం రావడం లేదు. ఇప్పటికే సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల ప్రభావం చూచాయగా కనిపిస్తూనే ఉంది. కాకపోతే నిర్మాతలు మాత్రం కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది కాబట్టి.. పైన పటారం.. లోన లొటారం స్థితిని మెయింటైన్ చేస్తున్నారు. అమెరికాలో 10-20 ఏళ్ల పాటు డబ్బులు సంపాదించుకుని.. ఆ డబ్బులు పెట్టి సినిమాలు తీస్తున్న ఎన్నారై నిర్మాతలు కూడా నిండా మునుగుతున్నారు. వీరు మొదట పరిమిత స్థాయిలో సినిమాలు తీసి.. కాస్త లాభం కనిపించగానే.. నలుగురైదురు హీరోలు, డైరక్టర్లకు అడ్వాన్సులిచ్చి అడ్డంగా బుక్కైపోతున్నారు.ఒకప్పుడు స్క్రిప్ట్ పూర్తయ్యాక, నటీనటుల డేట్స్ అన్నీ కుదిరితేనే దర్శక-నిర్మాతలు సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేవారు. రానురానూ మార్పులు వచ్చాయి. షూటింగ్ మొదలయ్యే ముందు కూడా సన్నివేశాలు రాసుకుంటూ కూర్చోవడం వల్ల సినిమా వ్యయపెరిగిపోవడమే కాకుండా, నాణ్యతా దెబ్బతింటోందని సీనియర్ నటులు, రచయితలు వివిధ ఇంటర్వ్యూల్లో చెప్పారు. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత మరింత మెరుగు కోసం చిన్న చిన్న మార్పులు చేసుకోవచ్చు కానీ, అప్పటికప్పుడు కొత్త సన్నివేశాలు రాయడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కొన్నిసార్లు కారణమవుతోంది. ఇక సృజనాత్మకత పేరుతో దర్శకులు వేయించే సెట్లు, అనవసర హంగులు, విదేశీ ప్రయాణాలు.. ఇవన్నీ నిర్మాణ వ్యయాన్ని తడిసి మోపెడు చేస్తున్నాయి. ఇవన్నీ నిర్మాతలపై మోయలేని భారం మోపి.. అంతిమంగా టాలీవుడ్‌కి తీరని నష్టం చేస్తున్నాయి. సినీ పరిశ్రమకు ఎవరో పని గట్టుకుని నష్టాలు తేవడం లేదు. స్వయంగా చిత్ర పరిశ్రమే చేజేతులా సంక్షోభాన్ని కొనితెచ్చుకుంటోంది. ఇప్పటికే సగం మునిగింది. కనీసం ఇప్పటికైనా మేలుకోకపోతే.. నిండా మునిగే ప్రమాదం లేకపోలేదు. అనారోగ్యకర పోకడల్ని మొదట్లోనే తగ్గించుకునే ప్రయత్నం చేస్తే.. పరిస్థితి ఇక్కడదాకా వచ్చేది కాదు. కానీ పెడ ధోరణుల్ని ట్రెండ్ గా, కొత్త తరహా మార్కెటింగ్ సూత్రాలుగా చెప్పుకుని అదే ఒరవడిలో కొట్టుకుపోతున్నారు. ఎవరైనా సీనియర్లు సలహాలివ్వబోయినా.. వినిపించుకోవడం లేదు. అదేమంటే కాలం మారిందని చెబుతూ.. తెలుగు సినిమాని చేజేతులా చంపేయటానికి కంకణం కట్టుకున్నారు. కనీసం తెలుగు సినిమాల్ని ఓటీటీలు కూడా ఎందుకు కొనడం లేదని ఎవరూ ఆలోచించడం లేదు. ఇప్పటికైనా టాలీవుడ్ ఆత్మావలోకనం చేసుకోకపోతే.. రాబోయే రోజుల్లో తెలుగు సినీ పరిశ్రమ ఒకటుండేది అని చెప్పుకోవాల్సి వస్తుందేమో. అందుక ఇకనైనా ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకునే ప్రయాస మానేసి.. అందరూ కలిసి సమష్టి బాధ్యత తీసుకుంటే కానీ.. తెలుగు సినిమా పరిశ్రమ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు.

# మళ్లీ కవ్విస్తున్న పాకిస్తాన్

**న్యూఢిల్లీ, జూన్ 12:**గత ఏడాది సరిగ్గా ఇదే సమయానికి పాకిస్థాన్ నెత్తినోరూ మొత్తుకుంది. బ్బాబ్బాబూ మమ్మల్ని వదిలేయండి మీకు దండం పెడతాం అంటూ కాళ్లు పట్టుకుంది. చచ్చిన పామును ఏం చంపుతామని భారత్ బతుకుపో అంటూ వదిలిపెట్టింది. లేకుంటేనా పాకిస్థాన్ ప్రపంచ పటంలో ఉండేదే కాదు.భారత్ దయాదాక్షిణ్యాల మీద బతికిన పాకిస్థాన్ మళ్లీ పిచ్చి లేసిన కుక్క లాగా అరవడం మొదలుపెట్టింది. సరిహద్దుల్లో మళ్లీ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. నిబంధనలు అతిక్రమించి జమ్మూలో భారత సైన్యం ఏర్పాటు చేసుకున్న చెక్ పోస్టుల ప్రాంతాలలో పాకిస్థాన్ సైన్యం ఈనెల 9న తెల్లవారుజామున డ్రోన్లను పంపించింది.ఆ డ్రోన్లను కూల్చివేయడానికి భారత సైన్యం 15 రౌండ్ల పాటు కాల్పులు జరపాల్సి వచ్చింది. అయితే ఆ డ్రోన్లు మళ్లీ పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లిపోయాయి. ప్రతిసారీ నిబంధనలు అతిక్రమించడం పాకిస్థాన్ కు అలవాటే. కాకపోతే పహల్గాం ఘటన తర్వాత



భారత్ కట్టుదిట్టంగా భద్రతను ఏర్పాటు చేస్తోంది. సరిహద్దుల్లో చీమచిటుక్కుమన్నా తెలిసేలా సెక్యూరిటీ ఏర్పాటు చేసింది. అందువల్లే పాకిస్థాన్ డ్రోన్లపై భారత్ కాల్పులు జరిపింది.ఇలాంటి పనులు పాకిస్థాన్ ఎందుకు చేస్తోందంటే..ప్రస్తుతం పాకిస్థాన్ లో అంతర్గత సంక్షోభాలు ఏర్పడ్డాయి. భారత్ జీలం, చినాబ్ నది ప్రవాహాలకు అడ్డుకట్ట వేసింది. దీంతో పాకిస్థాన్ లో వ్యవసాయం సాగే పరిస్థితి లేదు. పీవోకే లో పాకిస్థాన్ కు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి. బలూచిస్థాన్ ఆర్మీ పాకిస్థాన్ కు చుక్కలుచూపిస్తోంది. ఆర్థిక సంక్షోభం కూడా పాకిస్థాన్ పాలకులను కలవరపాటుకు గురి చేస్తోంది.ఇవన్నీతగ్గిపోవాలంటే ఏదోఒకటి చేయాలి. భారత్ మీద దాడులు చేసినట్టు కలరింగ్ ఇస్తే అంతర్గత సంక్షోభాలను డైవర్ట్ చేయవచ్చని పాకిస్థాన్ భావిస్తోంది. అయితే ఆపరేషన్ సిందూరు జస్ట్ శాంపిల్ మాత్రమేనని..ఈసారి పాకిస్థాన్ కయ్యానికి కాలు దువ్వితే.. లేపడానికి కాలు..దువ్వాడానికి చేయి ఉండవని భారతసైన్యం స్పష్టం చేస్తోంది. అంటే ఈలెక్కన పాకిస్థాన్ దేశాన్నిప్రపంచ పటం నుంచి తీసివేయడానికి భారత్ గట్టిగా ఫిక్స్ అయిందన్నమాట.

# 14న కాక్ రోచ్ పార్టీ నిరసన

**హైదరాబాద్, జూన్ 12:**దేశ రాజకీయాల్లో ' కాక్రోచ్ జనతా పార్టీ ' ఓ సంచలనం. ఓ కేసులో నిరుద్యోగ యువతను 'బొద్దింకలు', 'పరాన్న జీవులు'తో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పోల్చడంతో సీజేపీ ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రకటన వెలువడిన గంటల వ్యవధిలోనే ప్రధాన రాజకీయ పార్టీలకు మించి ఫోలోవర్లు వచ్చారు. ఐదు రోజుల వ్యవధిలోనే రెండు కోట్ల మంది ఫాలోవర్లకు చేరుకున్నారు. దేశం ఎదుర్కొంటున్న సంక్షోభానికి యువతలో అసంతృప్తి ఎలా ఎగిసిపడుతుందనడానికి ఇదే ఓ మచ్చు తునక. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై రాజధానిలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నాయకత్వంలో మొదటిసారి ప్రత్యక్ష నిరసన చేపట్టారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు కోరుతూ దేశవ్యాప్త ఆందోళన చేపడతామని ఆ ధర్నాలోనే దీప్కే ప్రకటించారు. దక్షిణ భారతదేశంలో సీజేపీ తొలి నిరసన జూన్ 14న హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో చేపట్టనుంది. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, పరీక్షా విధానాలలో సంస్కరణలు కోరుతూ చేపట్టిన 'గోయింగ్ నేషనల్' ఉద్యమంలో ఈ ఆందోళనలు ఒక భాగమని సీజేపీ చెబుతోంది. సీజేపీ విడుదల చేసిన అధికారిక షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్‌లో నిరసన జూన్ 14న ఉదయం 10 గంటలకు ధర్నా చౌక్‌లో జరగనుంది. విద్యార్థి సంఘాలు, పౌర సమాజ సభ్యులు ఇందులో పాల్గొంటారని అంచనాతో శాంతియుత ప్రదర్శనకు పిలుపునిచ్చారు.అదే రోజున సాయంత్రం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో భారీ నిరసన జరుగుతుందని తెలిపింది. దక్షిణాదిన విస్తరణలో భాగంగా ఈ రెండు నిరసనలు చేపట్టినట్టు సీజేపీ పేర్కొంది. జూన్ 11న మహారాష్ట్రలోని పుణేలో నిరసన చేపట్టింది. జూన్ 12న ఉత్తర్ ప్రదేశ్ లక్నో (ఇకో గార్డెన్)లో, పంజాబ్‌లో జూన్ 13న అమృత్‌సర్‌లో, జూన్ 14 హైదరాబాద్, బెంగళూరు, జూన్ 15న రాజస్థాన్ రాజధాని జైపూర్, జూన్ 20 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహిస్తామని వెల్లడించింది.ప్రశ్నపత్రాల లీకేజీ, ఫలితాల జాప్యం, నియామకాలు, ప్రవేశ పరీక్షలలో పారదర్శకత లోపించడం వంటి సమస్యలను పరిష్కరించడమే ఈ నిరసనల లక్ష్యమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. ఈ వ్యవస్థ దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తోందని, అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించడం లేదని ఆయన ఆరోపించారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరగనున్న నిరసన ఈ ఉద్యమంలో చివరి, అత్యంత ముఖ్యమైన ఘట్టంగా భావిస్తున్నారు. విద్యా రంగంలోని వ్యవస్థాగత వైఫల్యాలకు బాధ్యుడిగా భావిస్తున్న విద్యాశాఖ మంత్రి రాజీనామాతో సహా తమ డిమాండ్లు



నెరవేరే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని దీప్కే పేర్కొన్నారు.ఇటీవలి నిరసనలలో విద్యార్థులు, యంగ్ ప్రొఫెషనల్స్, పౌర సమాజ కార్యకర్తలు పాల్గొన్నారు. స్కూల్, కాలేజీ విద్యార్థులు కూడా హాజరైనట్లు నివేదికలు సూచిస్తున్నాయి. వీరిలో చాలామంది మాస్కులు ధరించి, ప్లకార్డులతో నిరసనలలో పాల్గొనడం సీజేపీకి పెరుగుతున్న ఆదరణను ప్రతిబింబిస్తోంది. ఇప్పుడు నిరసనలు దక్షిణాదికి కూడా విస్తరిస్తున్నందున జూన్ 20న ఢిల్లీలో జరిగే ముగింపు ర్యాలీకి ముందు దేశవ్యాప్తంగా ఊపును తీసుకొచ్చేందుకు సీజేపీ కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారు.

# 19న హైదరాబాద్ కు పవన్...

**హైదరాబాద్, జూన్ 12:**ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయంగా ఎంత యాక్టీవ్ గా ఉన్నాడో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఒకపక్క పాలన పరంగా తనదైన మార్కు తో ముందుకు వెళ్తూ , మరోపక్క జనసేన పార్టీ ని బలోపేతం చెయ్యడానికి అన్ని విధాలుగా ప్లానింగ్ చేస్తున్నాడు. జనసేన పార్టీ ని కేవలం ఆంధ్ర ప్రదేశ్ కి మాత్రమే పరిమితం చేయకుండా, తెలంగాణ ప్రాంతానికి కూడా విస్తరింపజేసే ప్రయత్నం చేస్తున్నాడు. రీసెంట్ గా పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సృష్టించిన అలజడి ఎలాంటిదో కళ్లారా చూసాము. కావాలని ఆయన్ని టార్గెట్ చేస్తూ , కాంగ్రెస్ పార్టీ జనసేన క్యాడర్ ని ,జనసేన నాయకులను తెలంగాణ వ్యాప్తంగా యాక్టీవ్ అయ్యేలా చేసింది. ఒకపక్క తెలంగాణ పై తన ఫోకస్ ప్రస్తుతానికి లేదని పవన్ కళ్యాణ్ చెప్తూనే , మరోపక్క అక్కడ ఆ పార్టీని బలోపేతం చేయడానికి అన్ని విధాలుగా సిద్ధం



అవుతున్నాడు.అందులో భాగంగా ఈ నెల 19 న ఆయన తెలంగాణ లో జనసేన పార్టీ పీకార్యాలయాన్ని గ్రాండ్ గా ప్రారంభించబోతున్నట్టు సమాచారం. ఏ ప్రాంతం లో ఆయన ఈ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నాడు అనేది ప్రస్తుతానికి తెలియదు. మరో రెండు రోజుల్లో దీనికి సంబంధించిన పూర్తి వివరాలు బయటకు రానున్నాయి. పవన్ కళ్యాణ్ కి ప్రస్తుతం తెలంగాణ మీద ఆసక్తి లేకపోయినప్పటికీ,జనసేన పార్టీ క్యాడర్ మాత్రం ఒప్పుకోవడం లేదు , ఎట్టి పరిస్థితిలోనూ తెలంగాణ లో జనసేన పార్టీ ని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయాల్సిందే అని పవన్ పై ఒత్తిడి తెస్తున్నారు. అందుకే వాళ్ళ కోసం ఆయన ఇకపై తెలంగాణ పై పూర్తి స్థాయిలో ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాదు ఆయన రీసెంట్ గా జరిగిన ఒక ఇంటర్వ్యూ లో కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడడం చూస్తుంటే , రాబోయే రోజుల్లో ఆయన అధికార కాంగ్రెస్ ని చాలా గట్టిగానే టార్గెట్ చేయబోతున్నట్టు తెలుస్తోంది. మరి ఇందులో ఎంత మాత్రం నిజముందో చూడాలి.

# ప్రమాదకరంగా మారుతున్న ఫెర్టిలిటీ రేటు

ఇటీవల ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ భారత్‌పై మరోసారి దృష్టి సారించారు. భారత్‌లో జనన రేటు రీప్లేస్‌మెంట్ లెవల్ కంటే తగ్గిపోయింది. చదువుకున్న, అత్యంత విద్యావంతులైన వర్గాల్లో ఇది చాలా సంవత్సరాలుగా జరుగుతోంది అని హెచ్చరించారు. 2024లో విడుదలైన లేటెస్ట్ సాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) నివేదిక ప్రకారం భారతదేశ టోటల్ ఫర్టిలిటీ రేటు (టీఎఫ్ఆర్) 1.9కి పడిపోయింది. ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే స్పష్టంగా తక్కువ.నాలుగైదు దశాబ్దాల క్రితం జనాభా గణనీయంగా పెరిగింది. "జనాభా బాంబు" అని ప్రపంచం భయపడిన భారత్ ఇప్పుడు జనాభా తగ్గుదల వైపు వేగంగా పయనిస్తోంది. ఇది మన సమాజం, ఆర్థిక వ్యవస్థ, భవిష్యత్ రూపురేఖలను పూర్తిగా మార్చగల ఒక మహత్తరమైన మలుపు. 1950--60లలో భారత్ ఫర్టిలిటీ రేటు 5.5 నుంచి 6 వరకు ఉండేది. అధిక మరణాల రేటు, వైద్య సదుపాయాల కొరత, వ్యవసాయ ఆధారిత జీవనం, ఉమ్మడి కుటుంబాలు, కుమారుడు సంతానం కోసం అనవసరమైన గర్భాలు ఇవన్నీ పెద్ద కుటుంబాలకు దోహదపడ్డాయి. పిల్లలు కుటుంబానికి శ్రమ బలం మాత్రమే కాకుండా, వృద్ధాప్యంలో భరోసా అని భావించారు. కానీ 1990ల నుంచి సమాజం వేగంగా మారింది. మహిళల విద్య, ఉద్యోగ అవకాశాలు, నగరీకరణ, పిల్లల పెంపకం ఖర్చులు (చదువు, ఆరోగ్యం, హౌసింగ్) ఇవన్నీ చిన్న కుటుంబాల వైపు మనస్తత్వాన్ని మార్చాయి. "ఒక్కడు/ఒక్కతే చాలు" అన్న భావన సామాన్యమైంది. ఫలితంగా 2024లో టీఎఫ్ఆర్ 1.9కు పడిపోయింది.ఇక్కడే మనకు అసలు సవాలు కనిపిస్తుంది. దక్షిణాది మరియు పశ్చిమ రాష్ట్రాల్లో ఫర్టిలిటీ రేటు ఇప్పటికే చాలా తక్కువగా ఉంది (తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లు 1.4--1.7 మధ్య ఉండగా, ఢిల్లీ వంటి నగరాలు 1.2 వరకు పడిపోయాయి. అయితే బీహార్ (2.9), ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ వంటి ఆరు రాష్ట్రాలు మాత్రమే ఇంకా రీప్లేస్‌మెంట్ లెవల్‌పై ఉన్నాయి. ఈ ప్రాంతీయ అసమానత భవిష్యత్తులో రాజకీయ, ఆర్థిక, సామాజిక ఉద్రిక్తతలకు దారితీయవచ్చు.చైనా తన "ఒక్క పిల్లవాడు" విధానంతో యువ జనాభాను తగ్గించుకుంది. ఇప్పుడు అక్కడ వృద్ధుల సంఖ్య భారీగా పెరిగి, శ్రమ శక్తి తగ్గి, ఆర్థిక వ్యవస్థపై భారం పడుతోంది. జపాన్, దక్షిణ కొరియా, రష్యా వంటి దేశాలు ఇప్పటికే ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. భారత్ కూడా అదే మార్గంలో నడుస్తుందని మస్క్ హెచ్చరిక. మన దేశంలో డెమోగ్రాఫిక్ డివిడెండ్ అన్న ఆశలు ఇక త్వరలో ముగియవచ్చు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం, ఉద్యోగుల కొరత, పెన్షన్, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరగడం, ఒక తరం మరొక తరానికి సహాయం చేసే సామాజిక చక్రం దెబ్బతినడం ఇవన్నీ రాబోయే దశాబ్దాల్లో మన ముందు నిలబడతాయి. అయినా ఇది పూర్తి విపత్తు కాదు. ఈ తగ్గుదలను పూర్తిగా ప్రమాదంగా చూడకూడదు. ఇది మహిళల సాధికారత, విద్య, ఆర్థిక అభివృద్ధి, కుటుంబ నియంత్రణ అవగాహన వంటి సానుకూల మార్పుల ఫలితం. పిల్లల సంఖ్య తగ్గడం వల్ల ప్రతి పిల్లవాడికి మంచి పోషణ, విద్య, ఆరోగ్యం ఇవ్వడం సాధ్యపడుతోంది. గుణాత్మక జనాభా అన్న లక్ష్యం సాధ్యమవుతోంది.భారత్ ఇప్పుడు ఒక చారిత్రక మలుపు వద్ద నిలబడి ఉంది. జనాభా పెరుగుదల సమస్య నుంచి జనాభా తగ్గుదల సవాలు వైపు మారుతోంది. ఇది భయపడాల్సిన విషయం కాదు, కానీ నిర్లక్ష్యం చేయాల్సిన విషయం కూడా కాదు. సమయం ఉంది.ఫెర్టిలిటీ క్లినిక్‌ల సమాచారం ప్రకారం, ఎగ్ ఫ్రీజింగ్‌లో కీలకమైన 'ఎగ్ రిట్రీవల్ సైకిల్' ప్రక్రియకు క్లినిక్‌ను బట్టి రూ.1.2 లక్షల నుంచి రూ.3.2 లక్షల వరకు ఖర్చవుతోంది. అనంతరం అండాలను భద్రపరచడానికి ప్రతి ఏడాది రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఖర్చు ఎక్కువైనా భవిష్యత్తులో తల్లితనాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతో మహిళలు ఈ ప్రక్రియను ఎంచుకుంటున్నారు.వైద్యుల సూచనల ప్రకారం, 25 నుంచి 32 ఏళ్ల మధ్యలో ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోవడం ఉత్తమమని చెబుతున్నారు. 35 ఏళ్లు దాటిన తర్వాత అండాల నాణ్యత, సంఖ్య రెండూ తగ్గే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. హార్మోన్ ఇంజెక్షన్ల వల్ల కొందరిలో ఉబ్బరం, భావోద్వేగ మార్పులు, అరుదుగా అండాశయ హైపర్ స్టిమ్యులేషన్ సిండ్రోమ్ వంటి సమస్యలు రావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే శస్త్రచికిత్స సమయంలో రక్తస్రావం, ఇన్ఫెక్షన్ల ముప్పు కూడా ఉంటుందని వెల్లడించారు.అయితే ఆధునిక విట్రిఫికేషన్ సాంకేతికత వల్ల అండాలను ఎక్కువకాలం నాణ్యత తగ్గకుండా భద్రపరచడం సాధ్యమవుతోందని వైద్యులు తెలిపారు. 25-32 ఏళ్ల మధ్య వయసులో నిల్వ చేసిన అండాలతో భవిష్యత్తులో గర్భధారణ విజయశాతం 60 నుంచి 80 శాతం వరకు ఉండొచ్చని పేర్కొన్నారు. మహిళల వయసు, అండాల నాణ్యత, శీతలీకరణ పద్ధతులు వంటి అంశాలపై ఈ విజయశాతం ఆధారపడి ఉంటుందని వివరించారు.క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడే మహిళలు చికిత్స ప్రారంభానికి ముందే తమ అండాలను ఫ్రీజ్ చేయించుకుంటున్నారని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కీమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సల వల్ల సంతానోత్పత్తి సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. మరోవైపు ఉద్యోగాలు చేసే యువతులు పెళ్లికి ముందే ఫెర్టిలిటీ నిపుణులను సంప్రదించి అండాల నిల్వపై అవగాహన పెంచుకుంటుండటం ప్రస్తుతం నగరాల్లో కొత్త ధోరణిగా మారుతో సరైన విధానాలు, సమగ్ర ఆలోచన, సమతుల్య దృక్పథంతో ఈ మార్పును అవకాశంగా మలచుకోగలిగితే మన భవిష్యత్ తరాలు మన్నించే దేశంగా మారవచ్చు. లేకపోతే, చైనా, జపాన్ మాదిరిగా ఆలస్యంగా బాధపడే దేశంగా మిగిలిపోవచ్చు. సమయం మన చేతిలో ఉంది. ఆలోచనలు మార్చుకునే సమయం ఇదే.

# సిటీలో డేంజర్ బిల్డింగ్స్ 377

**హైదరాబాద్, జూన్ 12:**మహానగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎప్పుడు ఏ పాత భవనం లేదా ప్రహరీ గోడ కూలిపోతుందోనని నగరవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిర్మాణంలో ఉన్న సెల్లార్ల వద్ద మట్టి దిబ్బలు కూలి కార్మికులు చిక్కుకుపోయే ప్రమాదాలు పొంచి ఉండటంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తమైంది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు నగర ప్రధాన ప్రణాళికాధికారి కె. శ్రీనివాస్ జోన్ల వారీగా ప్రత్యేక సర్వే నిర్వహించారు. క్షేత్రస్థాయి అధికారుల నుండి సేకరించిన వివరాల ప్రకారం, జూన్ 5 నాటికి నగరవ్యాప్తంగా మొత్తం 377 శిథిల భవనాలు ఉన్నట్లు లెక్క తేలింది. ఈ సర్వే ఇంకా కొనసాగుతోందని, మరిన్ని భవనాలను గుర్తిస్తామని గ్రేటర్ టౌన్ ప్లానింగ్ విభాగం వెల్లడించింది.రాజేంద్రనగర్ జోన్‌లోనే అత్యధికం బల్దియా సర్వే గణాంకాల ప్రకారం.. శిథిల భవనాలు అత్యధికంగా రాజేంద్రనగర్ జోన్ పరిధిలోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది. జోన్ల వారీగా గుర్తించిన శిథిల భవనాల వివరాలు ఇలా ఉన్నాయి:

రాజేంద్రనగర్: 117 భవనాలు
శేరిలింగంపేట: 75 భవనాలు



సికింద్రాబాద్: 70 భవనాలు
చార్మినార్: 56 భవనాలు
గోల్కొండ: 47 భవనాలు
ఖైరతాబాద్: 12 భవనాలు

**కమిషనర్ కఠిన ఆదేశాలు.. సెల్లార్ల అనుమతులు రద్దు!**

ప్రమాదాల నివారణకు బల్దియా కమిషనర్ సర్కిళ్ల ఉపకమిషనర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పాత కట్టడాలు, బలహీనమైన గోడలను గుర్తించి, అవసరమైన వాటికి ఇంజనీరింగ్ నిపుణులతో సామర్థ్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఏదైనా భవనం నివాసయోగ్యం కాదని తేలితే ఆ ఇంటిని వెంటనే సీజ్ చేయాలని, ముందుగా యజమానులకు నోటీసులు ఇచ్చి, అత్యవసరమైతే తక్షణమే ఖాళీ చేయించాలని స్పష్టం చేశారు. ప్రమాదకర భవనాల చుట్టూ బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఒకవేళ ప్రభుత్వ పాఠశాలలు ఏవైనా శిథిలావస్థలో ఉంటే, వెంటనే విద్యాశాఖకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, వర్ష కాలం పూర్తయ్యే వరకు కొత్త సెల్లార్ల తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇచ్చేది లేదని, పాత అనుమతులను కూడా రద్దు చేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు.నగరంలోని కొండలు, గుట్టలపై ఏర్పడిన అనేక కాలనీలలో ఏటా ప్రహరీ గోడలు కూలిపోయే సంఘటనలు ఎన్నో చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బోరబండ ప్రాంతాల్లోని ఏటవాలు నేలపై కట్టే ప్రహరీ నిర్మాణాలను వెంటనే ఆపేయాలని జీహెచ్ఎంసీ కోరింది. అక్కడ పనిచేసే కార్మికుల రక్షణ కోసం ఎత్తయిన ప్రాంతాలలో కాకుండా సురక్షితమైన ఖాళీ స్థలాలలో మాత్రమే షెడ్లు నిర్మించాలని కమిషనర్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

# పోలీసులకు రికవర్రీ....

**కరీంనగర్, జూన్ 12:**కరీంనగర్ జ్యోతినగర్‌లోని ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌పై జరిగిన భారీ దోపిడీ కేసు పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఘటన జరిగి దాదాపు 40 రోజులు అయినా చోరీ అయిన వజ్రాలు, బంగారు ఆభరణాల ఆచూకీ ఇప్పటికీ పూర్తిగా లభ్యం కాలేదు. సాధారణ దోపిడీ కేసుల్లో కొద్ది రోజుల్లోనే సొత్తు రికవరీ అయ్యేవి, కానీ ఈ కేసు పూర్తి వ్యతిరేక దిశలో సాగుతోంది.ఈ దోపిడీ కేసులో కీలక నిందితుడిగా పోలీసులు గ్యాంగ్‌స్టర్ సుబ్యోద్‌సింగ్ అని గుర్తించారు. ఇటీవలే అతడిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకొచ్చారు. అతనితోపాటు ఇతర నిందితులు కూడా విచారణలో పరస్పరం విరుద్ధమైన వాదనలు చెబుతున్నారు. ఒకరు ఒక విషయం చెప్పగా, మరొకరు దానికి పూర్తి వ్యతిరేకంగా సమాధానాలు ఇవ్వడం పోలీసులను తీవ్ర గందరగోళంలో పడేస్తోంది. ఈ విరుద్ధ సమాధానాలు సహజమైనవా లేదా నిందితులు కావాలని పోలీసులను తప్పుదారి పట్టించడానికి చేస్తున్న వ్యూహాత్మక ప్రయత్నమా అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. గ్యాంగ్‌స్టర్ నేతృత్వంలోని ఈ బృందం ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందుగానే సిద్ధమై ఉండవచ్చని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి.పీఎంజే కేసు దర్యాప్తు సాధారణ దొంగతనం కంటే చాలా క్లిష్టంగా మారింది. దోపిడీ జరిగిన వెంటనే సొత్తును వేర్వేరు చోట్లకు తరలించినట్లు పోలీసులు భావిస్తున్నారు. తర్వాత ఆభరణాలను కరిగించి వేరే రూపంలో మార్చడం లేదా ఇతర రాష్ట్రాలు, దేశాలకు పంపించడం జరిగి ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నిందితుల మధ్య ఉన్న విరుద్ధ వాదనలు నిజమైన సమాచారాన్ని బయట పెట్టడం లేదు. సైంటిఫిక్ ఫొరెన్సిక్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ లోతైన విశ్లేషణ, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్, సాంకేతిక పర్యవేక్షణ వంటి అధునాతన పద్ధతులు తప్పనిసరి అవుతున్నాయి.ఈ కేసు పోలీసులకు తలనొప్పిగా మారింది. సుబోధ్ సింగ్ ఇప్పటికే అనేక ఇతర కేసుల్లో ప్రమేయం ఉన్న గ్యాంగ్‌స్టర్ కావడంతో దోపిడీ వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఇప్పుడు కేవలం నిందితుల వాదనలపైనే ఆధారపడకుండా మరింత లోతైన విచారణ జరపాల్సి ఉంది. సొత్తు రికవరీలో ఆలస్యం జరిగితే నేరస్తులకు ధైర్యం పెరిగి, ఇలాంటి భారీ దోపిడీలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.పోలీసులు ఈ విరుద్ధ సమాచారాలను అధిగమించి, నిజమైన సొత్తు ఆచూకీని త్వరగా గుర్తించి రికవరీ చేయగలరా అనేదే ఈ కేసులో అత్యంత కీలకమైన అంశం. దర్యాప్తు ఎంత సమర్థవంతంగా, ఎంత త్వరగా ముగుస్తుందో అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

## మీనాక్షి రాజ్యసభ నామినేషన్ వివాదంపై

# సిట్ విచారణ జరిపించండి: కేటీఆర్ ఎద్దేవా

**ప్రతి అంశానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందన్న కేటీఆర్**

**మీనాక్షికి వ్యతిరేకంగా కొందరు కాంగ్రెస్ నేతలు వ్యవహరించి ఉండొచ్చని వ్యాఖ్య**

**పార్టీ ద్రోహులను రాహుల్ గాంధీ గుర్తించాలని సూచన**

కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశానికీ సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందని, అదే విధంగా ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిత్వానికి సంబంధించిన వివాదంపైనా సిట్ విచారణ జరపాలని వ్యంగ్యం ప్రదర్శించారు మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోనే కొందరు నాయకులు వ్యవహరించి ఉండవచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది కూడా కాంగ్రెస్ వర్గాలేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు, వర్గపోరాటాలే ఈ పరిస్థితులకు కారణమని పేర్కొన్నారు. పార్టీ ద్రోహులు ఎవరో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న హైదరాబాద్ నగర సమస్యలను పరిష్కరించకుండా భవిష్యత్ నగరాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తాజాగా కురిసిన వర్షాలతో నగరంలో ఏర్పడిన పరిస్థితులు ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టాయని వ్యాఖ్యానించారు. అలాగే, కేంద్రం తీసుకురానున్న డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గేలా నిర్ణయాలు తీసుకుంటే బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న



రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ లో ఇంటిదొంగలు

**హైదరాబాద్, జూన్ 12:**తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన, వ్యూహాత్మక మార్పు కనిపిస్తోంది. ప్రధాన ప్రతిపక్షం భారత్ రాష్ట్ర సమితి విమర్శల బాణాలు ఎటువైపు వెళ్తున్నాయో గమనిస్తే ఒక స్పష్టమైన సంకేతం కనిపిస్తుంది. బీఆర్ఎస్ పార్టీ జాతీయ స్థాయిలో గానీ, రాష్ట్ర స్థాయిలో గానీ కాంగ్రెస్ పార్టీని ఒక వ్యవస్థగా పెద్దగా టార్గెట్ చేయడం లేదు. వారి ఏకైక లక్ష్యం, నిరంతర దాడి కేవలం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిపైనే కేంద్రీకృతమై ఉంది. తాజాగా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన వివాదంలో కూడా బీఆర్ఎస్ నేతలు, రేవంత్ రెడ్డి వ్యతిరేక వర్గాలు దీనిని రేవంత్ కుట్రే అన్నట్లుగా ప్రాజెక్ట్ చేస్తుండటం ఈ వ్యూహానికి బలమైన నిదర్శనంగా నిలుస్తోంది.బీఆర్ఎస్ అధినాయకత్వానికి కాంగ్రెస్ భావజాలంపై కంటే రేవంత్ రెడ్డి శైలిపైనే ఎక్కువ అభ్యంతరాలు, భయాలు ఉన్నాయనేది బహిరంగ రహస్యం. రేవంత్ రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి, ముఖ్యమంత్రి అయ్యాక కూడా బీఆర్ఎస్‌ను రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తీయాలనే ఏకైక అజెండాతో దూకుడుగా ముందుకు వెళ్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు, కేసీఆర్ కుటుంబంపై విచారణలు, ఫోన్ ట్యాపింగ్ కేసు వంటి అంశాలతో గులాబీ దళాన్ని రేవంత్ రక్షణలో పడేశారు. అందుకే బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే కేడర్‌లో పెద్దగా మైలేజ్ రాదని, రేవంత్ రెడ్డిని పర్సనల్‌గా బలహీనపరిస్తేనే తమకు మళ్లీ పూర్వవైభవం వస్తుందని బలంగా నమ్ముతోంది.తమకు రాజకీయంగా అడ్డుగా నిలిచిన ఏకైక పిల్లర్‌ను కూల్చడమే వారి ప్రధాన లక్ష్యంరాహుల్ గాంధీ కోటరీలో అత్యంత కీలకమైన, నిజాయితీ గల నాయకురాలిగా పేరున్న తెలంగాణ



కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ సాంకేతిక కారణాల వల్ల తిరస్కరణకు గురవడం కాంగ్రెస్‌లో పెద్ద కలకలం రేపింది. సీఎం రేవంత్ దీనిని 'బీజేపీ కుట్ర, సీట్ల చోరీ' అని ఢిల్లీ వేదికగా కొట్లాడుతుంటే,ప్రతిపక్షాలు , రేవంత్ అంతర్గత శత్రువులు మాత్రం దీని వెనుక రేవంత్ రెడ్డి హస్తం ఉందనే కోణాన్ని తెరపైకి తెస్తున్నారు. రాష్ట్రంలో తన పట్టుకు అడ్డుగా మారే అవకాశం ఉన్న ఢిల్లీ పెద్దలను, హైకమాండ్ ప్రతినిధులను రేవంత్ రెడ్డి కావాలనే ఇబ్బందుల్లో నెడుతున్నారనే ప్రచారాన్ని బీఆర్ఎస్ గట్టిగా సమాజంలోకి పంపుతోంది. ఈ స్నాగ్ ఇష్యూ ద్వారా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద నమ్మకద్రోహిగా నిలబెట్టాలనేది బీఆర్ఎస్ అసలు ప్లాన్.బీఆర్ఎస్ ఆలోచనల వెనుక ఒక లోతైన రాజకీయ లెక్క ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ, ఆ పార్టీని నడిపించే 'ఇంజిన్' రేవంత్ రెడ్డే. ఆయన ఢిల్లీ హైకమాండ్ వద్ద బలహీనపడితే లేదా అధిష్ఠానం ఆయనపై నమ్మకం కోల్పోతే, తెలంగాణ కాంగ్రెస్‌లో ఉన్న పాత అసమ్మతి నేతలు మళ్లీ తలలేపుతారు. తద్వారా కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలతో దానంతట అదే బలహీనపడుతుందని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది. రేవంత్ రెడ్డిని దెబ్బతీస్తే.. తెలంగాణలో కాంగ్రెస్ కోట కూలిపోతుంది అనే థియరీతోనే బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. అందుకే వారు జాతీయ కాంగ్రెస్‌ను కాకుండా, కేవలం రేవంత్ చుట్టూనే రాజకీయ చక్రవ్యూహాన్ని రచిస్తున్నారు.రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద బలం రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీల వద్ద ఉన్న నమ్మకం. ఈ నమ్మకాన్ని చెడగొట్టడానికి బీఆర్ఎస్ నిరంతరం ప్రయత్నిస్తోంది. 'రేవంత్ రెడ్డి ఎప్పటికైనా కాంగ్రెస్‌కు ముప్పు', 'ఆయన తన సొంత ఎజెండాను అమలు చేస్తున్నారు', 'ఢిల్లీ పెద్దల నామినేషన్లు రద్దు కావడానికి ఆయనే కారణం' అనే నరేటివ్‌ను ఢిల్లీ స్థాయికి చేర్చడం ద్వారా రేవంత్ రెడ్డి పీఠాన్ని కదిలించవచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది. సీఎంను ఒంటరిని చేయడం ద్వారా, రాష్ట్రంలో కాంగ్రెస్ దూకుడుకు బ్రేకులు వేయవచ్చని విపక్షం గట్టి వ్యూహాత్మక దాడి చేస్తోంది. ఎంత సక్సెస్ అవుతుందన్నది వేచి చూడాల్సిందే.

## 824 నియోజకవర్గాల పెంపునకు ఈసీ ప్రతిపాదనలు

- మొదటి పేజీ తరువాయి

ప్రతిపాదనలు రూపొందించారు. కేరళలో ప్రస్తుతం ఉన్న 20 స్థానాలు 30కు, తమిళనాడులో 39 స్థానాలు 59కు పెరిగే అవకాశం ఉంది. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కూడా అదనపు లోక్‌సభ స్థానాలు లభించే అవకాశముంది.దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 80 స్థానాలు 120కు పెరిగే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. చిన్న నియోజకవర్గాల ఏర్పాటు వల్ల ప్రజాప్రాతినిధ్యం మరింత మెరుగుపడటంతో పాటు దేశవ్యాప్తంగా ఓటింగ్ శాతం సుమారు 2.3 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక సలహా మండలి అంచనా వేసింది.ఇక పట్టణ ప్రాంతాల్లో మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా 'మహిళా పోలింగ్ బూత్‌లు' ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసింది. అలాగే 2027 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టాలని కమిటీ స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదనలు అమలైతే దేశ రాజకీయ పటంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## అటు కేసీఆర్... ఇటు కేటీఆర్...

- మొదటి పేజీ తరువాయి

తీవ్ర చర్చనీయాంశమవుతోంది.ఎన్నికల ఫలితాల తర్వాత కేసీఆర్ ఎక్కువగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారంటూ ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చేందుకు గులాబీ బాస్ రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. తెలంగాణవ్యాప్తంగా భారీ బస్సు యాత్రకు కేసీఆర్ శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ యాత్ర ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కవర్ చేస్తూ, నేరుగా ప్రజలతో మమేకం కావాలని ఆయన భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కేడర్‌లో మళ్లీ మునుపటి జోష్ నింపడం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగనుంది. ప్రస్తుతం పార్టీ ముఖ్య నేతలు ఈ బస్సు యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను ఫైనలైజ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు.మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరికొత్త పంథాను ఎంచుకున్నారు. తండ్రి బస్సు యాత్ర చేస్తుంటే, కొడుకు సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. యువతను, సామాన్య ప్రజలను ఆకట్టుకునేలా సుదీర్ఘ కాలం పాటు ఈ పాదయాత్ర సాగనుంది. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, జనాన్ని పలకరిస్తూ సాగనున్న ఈ యాత్ర పార్టీకి కొత్త ఊపిరి పోస్తుందని బీఆర్ఎస్ శ్రేణులు గట్టి నమ్మకంతో ఉన్నాయి. తండ్రి బస్సుపై ఉంటూ.. కొడుకు నడుస్తూ జనాన్ని పలకరించే ఈ డ్యూయల్ స్ట్రాటజీ తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.ప్రస్తుతం తెలంగాణలో పొలిటికల్ సినారియో పూర్తిగా మారిపోయింది. ఓ వైపు అధికార కాంగ్రెస్, మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రెండు పార్టీలు బీఆర్ఎస్‌ను తీవ్రంగా కార్నర్ చేశాయి. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా, మున్ముందు ఆ పార్టీని మూడో స్థానంలోకి నెట్టేయాలని ఉమ్మడిగా గట్టి వ్యూహాలు రచిస్తున్నాయి.ఇలాంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో తామేంటో, తమ సత్తా ఏంటో చాటాల్సిన అగ్నిపరీక్ష బీఆర్ఎస్‌కు ఎదురైంది. పార్టీని మళ్లీ పూర్వ వైభవానికి తీసుకురావాలంటే జనంలోకి వెళ్లడం మినహా మరో మార్గం లేదని గులాబీ అధిష్ఠానం భావించింది. అందుకే ఇంతకాలం లో-ప్రొఫైల్ మెయింటైన్ చేసిన కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ ఒకేసారి రోడ్లపైకి వస్తున్నారు.బీఆర్ఎస్ శ్రేణుల్లో ఈ వార్త కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ రెండు యాత్రల పూర్తి షెడ్యూల్, అధికారిక రూట్ మ్యాప్స్ త్వరలోనే విడుదల కానున్నాయి. మరి తండ్రీ కుమారుల స్ట్రాటజీ బీఆర్ఎస్‌ను మళ్లీ రేసులోకి తెస్తుందా? కాంగ్రెస్, బీజేపీల ముకుమ్మడి దాడిని తట్టుకుని గులాబీ పార్టీ పూర్వ వైభవాన్ని సాధిస్తుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ..

- మొదటి పేజీ తరువాయి

అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

## రాజ్యసభకు ఖర్గే సహా 24 మంది ఎంపీలు ఏకగ్రీవంగా ఎన్నిక

- మొదటి పేజీ తరువాయి

ఎన్నికయ్యారు. సమంతరాయ్ మే 26న బీజేడీ రాజ్యసభ పదవి వదిలి బీజేపీలో చేరారు. తిరిగి బీజేపీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే నాలుగు సీట్లు గెలుచుకోగా, గుజరాత్‌లోని నాలుగు సీట్లను కూడా ఎన్డీయే ఎగరేసుకుపోయింది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ 3 సీట్లు గెలుచుకోగా, బీజేపీ ఒక సీటు దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 3 సీట్లు, రాజస్థాన్‌లోని 3 సీట్లలో రెండు సీట్లు బీజేపీ గెలుచుకుంది. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లోని ఒక్కో స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. మేఘాలయలో ఎన్డీయే భాగస్వామి అయిన ఎన్‌పీపీ అక్కడి ఏకైక స్థానాన్ని గెలుచుకుంది. మహారాష్ట్ర, ఒడిశాలోనూ ఒక్కోసీటును ఎన్డీయే దక్కించుకోగా, తమిళనాడులోని ఏకైక స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది.

## హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

**ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ ఇంచార్జి సెక్రటరీ సచిన్ సావంత్,మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్:** ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ ఇన్సూరెన్స్ విభాగం చైర్మన్ పవన్ మల్లాది,మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్,7 మండలాల అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, ఇతర ముఖ్య నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 2002 లో ఓటర్ల సవరణ కార్యక్రమం జరిగినపుడు అర్హత ఉండి ఏ ఒక్క ఓటు మిస్ కావద్దు అని ఎన్నికల కమిషన్ అప్పటి ప్రభుత్వాలు భావించాయి. ఓటరు సవరణ ఉదేశ్యం బీజేపీ కి వ్యతిరేకంగా ఉన్న ఓటు హక్కు తొలగించాలని ఆలోచన తో ఉంది దాని ద్వారా రాజాకి లబ్ధి పొందాలని భావిస్తుంది ఏ ఒక్క అర్హత ఉన్న ఓటు తొలగించకుండా మనం జాగ్రత్తగా ఉండాలి. మీ బూత్ లలో ఏ ఒక్క ఓటు పోకుండా చూసుకునే బాధ్యత మన బిఎల్ ఎ లది. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభం. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం అత్యంత కీలకం.బూత్ లెవల్ ఏజెంట్లు బిఎ ఏలు ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో కీలక పాత్ర పోషించాలి వారి పని పారదర్శకంగా బాధ్యతాయుతంగా ఉండాలి.ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలి.ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించాలి.ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమైనది. ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా ప్రతి బిఎల్ ఏ బాధ్యతతో పనిచేసి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలి.

## రామచంద్రపూర్ లో ప్రత్యేక ప్రజా దర్బార్

### పాల్గోన్న మంత్రి సీతక్కల



**ములుగు:**99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామంలోని రైతువేదిక ప్రాంగణం లో ఏర్పాటు చేసినప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గోన్నారు. ఈ సందర్భంగా మల్లంపల్లి మండలం లోని గుర్తుర్ తండా, కొడిశలకుంట, ముద్దనూరు తండా, రామచంద్రపూర్, భూపాల్ నగర్, శివ తండ గ్రామ పంచాయతీల పరిధి గ్రామాల ప్రజల నుంచి మంత్రి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో, జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు, డీఎఫ్ఓ వికాస్ మినా, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి.,సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్చ, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి , ఆర్డీవో కృష్ణవేణి , పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి , సంబంధిత గ్రామాల సర్పంచ్ లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, తహసిల్దార్, యంపిడిఓ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీబీనగర్ ఎయిమ్స్ సిబ్బందికి ఆయుధాల ఆవగాహనా కార్యక్రమం



**యాదాద్రి:**భువనగిరి ఏఆర్ పోలీస్ సిబ్బంది బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రిలో సిబ్బందికి ఆయుధాల పనితీరు, వినియోగ విధానం మరియు భద్రతా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయుధాలు ఎలా పనిచేస్తాయి, వాటి నిర్మాణం, భద్రతా ప్రమాణాలు మరియు నిర్వహణ విధానాల గురించి సిబ్బందికి వివరించారు. ఆయుధాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన భద్రతా నియమాలను తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఆసుపత్రి సిబ్బందిలో ఆయుధాలపై సరైన అవగాహన పెంపొందించి, భద్రతా చైతన్యాన్ని కల్పించారు ప్రజా భద్రత మరియు అవగాహన పెంపొందించడంలో యాదాద్రి భువనగిరి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆర్ఐ లతీఫ్ఉద్దీన్ , ఆర్ఎస్ఐ వెంకటేశ్ మరియు పోలీస్ అధికారులు , హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

## ఖమ్మంలో మున్నేరు నదిపై ఈ కేబుల్ బ్రిడ్జి..



**ఖమ్మం జూన్ 12:**హైదరాబాద్‌లో దుర్గం చెరువుపై నిర్మించిన కేబుల్ బ్రిడ్జి.. నగరంలో ట్రాఫిక్ తగ్గించడం, మెరుగైన రవాణాతోపాటు.. పర్యాటక పరంగా కూడా చాలా ఉపయోగపడుతోంది. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి కేబుల్ బ్రిడ్జిలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. హైదరాబాద్‌లోనే మీర్ ఆలం కేబుల్ బ్రిడ్జిని కూడా నిర్మిస్తున్నారు. మరోవైపు.. కరీంనగర్‌లో కూడా మానేరు నదిపైనా తీగల వంతెనను నిర్మించారు. వీటితోపాటు ఖమ్మం నగరంలోనూ మున్నేరు నదిపై రూ.180 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఫైనల్ దశకు చేరుకున్నాయి.కాల్వొడ్డు–జలగంనగర్ మధ్య మున్నేరు నదిపై 1.25 కిలోమీటర్ల పొడవున ఈ తీగల వంతెనను నిర్మిస్తున్నారు. 2 ఏళ్లుగా సాగుతున్న ఈ కేబుల్ బ్రిడ్జి.. పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ వంతెనలో రెండు బాహుబలి పిల్లర్లను ఏర్పాటు చేసి.. వాటి ఆధారంగా స్టీల్ తీగలపై ఈ బ్రిడ్జిని నిర్మించారు. ఇక నది ప్రాంతంలో 300 మీటర్ల పొడవున వంతెన భాగం తీగలపై వేలాడుతూ ఉంటుంది. దీనికి ఇరువైపులా వయాడెక్ట్, అప్రోచ్ రోడ్లు కలిపి 1.25 కి.మీ.ల పొడవు ఉంటుంది.ఇక ఈ కేబుల్ బ్రిడ్జికి రెండువైపులా అప్రోచ్ రోడ్ల నిర్మాణం కూడా పూర్తి కావొచ్చింది. 4 వరుసల్లో ఈ కేబుల్ బ్రిడ్జిని నిర్మించగా.. సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్, బ్రిడ్జి పక్కన ఇరు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించాల్సి ఉంది. ఇక ఈ కేబుల్ బ్రిడ్జిని నాలుగు వరుసల్లోనూ తారు వేయనున్నారు. ఈ ఖమ్మం తీగల వంతెన నిర్మాణ పనులు 85 శాతం పూర్తి అయినట్లు ఆర్ అండ్ బీ డీఈ భగవాన్ వెల్లడించారు.రివర్ బెడ్‌లో పనులు మొత్తం పూర్తి చేశామని తెలిపారు. వంతెన పైభాగంలో పనులు 3 నెలల్లో పూర్తి అవుతాయని స్పష్టం చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో ఖమ్మం తీగల వంతెన వాహనదారులకు అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఈ కేబుల్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే.. వాహనదారులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రావడమే కాకుండా..నగరవాసులకు ఒక టూరిస్ట్ స్పాట్‌గా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

## రికార్డు స్థాయిలో మోదీ పాలన.. దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చడమే లక్ష్యం

### ఎంపీ డీకే అరుణ



**మహబూబ్‌నగర్, జూన్ 12:** 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్'గా నిలపాలనే సుదూర లక్ష్యంతో ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం చారిత్రాత్మక మైలురాళ్లను అధిగమిస్తూ, రికార్డు స్థాయి పాలనతో ముందుకు సాగుతోందని డీకే అరుణ కొనియాడారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే రెండు కళ్లుగా భావించి ప్రధాని మోదీ నిరంతరం శ్రమిస్తున్నారని, ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాల వల్లే నేడు భారతదేశం ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ఆమె స్పష్టం చేశారు. కేవలం ఆర్థిక రంగాన్నే కాకుండా, దేశ రక్షణకు పెద్దపీట వేస్తూ ఉగ్రవాదుల పట్ల కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని డీకే అరుణ పేర్కొన్నారు.ప్రధాని మోదీ హయాంలో అమలువుతున్న విప్లవాత్మక సంక్షేమ పథకాలు, చారిత్రాత్మక నిర్ణయాలను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. స్వచ్ఛ భారత్, జన్ ధన్ యోజన, జీఎస్టీ అమలు, ట్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్ 370 రద్దు వంటి సాహసోపేత నిర్ణయాలతో దేశ ముఖచిత్రమే మారిపోయిందన్నారు. మహిళా సాధికారతకు కేంద్రం కట్టుబడి ఉందన్న ఆమె.. 2030 నాటికి దేశంలో 3 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి, కరోడ్‌పతి దీదీలు'గా మార్చడమే లక్ష్యంగా ప్రధాని విజన్‌తో పనిచేస్తున్నారని తెలిపారు. పీఎం కిసాన్, సుకన్య సమృద్ధి వంటి పథకాలు ప్రజల్లో ఎంతో భరోసానిచ్చాయని, ముఖ్యంగా రైతులకు ఎరువుల రూపంలో ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.24 వేల వరకు భారీ రాయితీ అందుతోందని ఆమె వివరించారు.

# తెలంగాణ ఫ్యూచర్ సిటీలో మరో 37 గ్రామాలు...



**హైదరాబాద్, జూన్ 12:**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ఫ్యూచర్‌సిటీ దిశగా అడుగులుపడుతున్నాయి. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు రేవంత్ హాజరయ్యారు. ఈ సభ జరుగుతున్న సమయంలో కొంతమంది ఫ్యూచర్‌సిటీలో తమ గ్రామాలను కలపాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఈ అంశాన్ని రేవంత్ దృష్టికి తీసుకెళ్లి సభావేదికపై నిర్ణయం ప్రకటించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనపై సానుకూలంగా స్పందించారు. ప్రజలు రిక్వెస్ట్ చేస్తూ తీసుకొచ్చిన పత్రాలపై సంతకం చేసి 37 గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో కలపాలని అధికారుల్ని ఆదేశించారు. మహేశ్వరం మండలంలో ఉన్న 28 గ్రామాలు, కందుకూరులోని 9 గ్రామాలు కలిపి 37 గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో భాగం కానున్నాయి.అంతకముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.20 కోట్లతో నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం చైర్మన్ హోదాలో తన ఛాంబర్‌లో ఫైల్‌పై సంతకం చేశారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పోర్టల్‌ను ప్రారంభించారు. సీఎం రేవంత్‌కు ప్రధాన కార్యకలాపాలను, విభాగాలను ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక వివరించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానికుల కోరిక మేరకు తాజాగా కొన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలిపామని.. భవిష్యత్‌లో గ్రామాల వారీగా చర్చించి ఫ్యూచర్‌సిటీలో కలుపుతామని హామీ ఇచ్చారు. కొంతమంది అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్న?న్నారని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో వాళ్లను ప్రజలు తిరస్కరించారని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే వారికి వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా రాదన్నారు. ఫ్యూచర్ సిటీకి అడ్డుపడిన వారి సంగతి ప్రజలు చూసుకుంటారని.. వారే ఈ నగరాన్ని నిర్మించుకుంటారన్నారు.హైదరాబాద్‌లో భూముల ధరలు బాగా పెరిగాయని.. సైబరాబాద్ ఒక సాంకేతిక విప్లవంగా తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చిందన్నారు రేవంత్ రెడ్డి. ఇప్పుడు భూమి ధర ఎకరా రూ.200 కోట్లకు పైగా పలుకుతోందన్నారు. రంగారెడ్డి జిల్లా భూములకు బంగారం కంటే ఎక్కువ విలువ ఉందన్నారు. గతంలో హైటెక్ సిటీ అంటే నవ్వారని.. ఔటర్ రింగ్ రోడ్డును అడ్డుకున్నారన్నారు. గతంలోనూ నగర అభివృద్ధిని అడ్డుకోవాలని కుట్రలు, కుతంత్రాలు చేశారని ఆరోపించారు. గత పాలకులు హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, జీనోమ్ వ్యాలీ వంటివి తీసుకురాకపోతే యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వచ్చేవా అన్నారు. ప్రజలు ఈ విషయాలను ఆలోచించాలని సూచించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

# టైటిల్ ఫైట్....

## కవిత వర్సెస్ కేటీఆర్



**హైదరాబాద్, జూన్ 12:**తెలంగాణ రాజకీయాల్లో టీఆర్ఎస్ అనే మూడు అక్షరాలు ఇప్పటికీ భావోద్వేగాన్ని, చారిత్రక వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. ఆ పేరును తమకు కేటాయించాలని అనేక పార్టీలు ఎన్నికల సంఘం (ఈసీ) ముందు పోటీ పడుతుండగా, బీఆర్ఎస్ నేతలు ఆ పేరు ఎవరికీ ఇవ్వకూడదని ఫిర్యాదు చేశారు. ఇది కేవలం పేరు వివాదం కాదు. ఇది తెలంగాణ ఉద్యమ వారసత్వం ఎవరి చేతుల్లో ఉండాలి, ఓటర్ల ముందు గుర్తింపు ఎలా ఉండాలి అనే ప్రశ్నను లేవనెత్తుతోంది. 2022లో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చుకున్నారు. దీంతో టీఆర్ఎస్ ఖాళీగా ఉంది. ఆ పేరు కోసం కొత్త పార్టీలు పోటీ పడుతున్నాయి. ఇందులో కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని 'తెలంగాణ రక్షణ సేన' ప్రముఖంగా ఉంది. ఆ పార్టీ పేరు ప్రకటనపై 600కి పైగా అభ్యంతరాలు వచ్చాయి.బీఆర్ఎస్ మద్దతుదారులు, తెలంగాణ ఉద్యమకారులు, సామాన్య ప్రజల నుంచి ఈసీకి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో కవిత పార్టీ నేతలు త్వరలో ఎన్నికల సంఘాన్ని నేరుగా కలిసి తమ వాదనను వినిపించనున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' కూడా టీఆర్ఎస్ పేరును తమకు కేటాయించాలని ఈసీని ఆశ్రయించింది. తెలంగాణ బయటి నుంచి వచ్చిన ఈ ప్రయత్నం, టీఆర్ఎస్ పేరు కేవలం తెలంగాణలోనే కాకుండా, సరిహద్దు ప్రాంతాల్లోని తెలుగు మాట్లాడే ప్రజల్లో కూడా గుర్తింపు కలిగి ఉందని చెబుతోందిభారతీయ రాజకీయాల్లో పార్టీ పేరు కేవలం ఒక లేబుల్ కాదు. అది ఓటర్ల మనసుల్లో నిలిచిపోయిన బ్రాండ్. టీఆర్ఎస్ పేరు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంతో ముడిపడి ఉంది. ఆ ఉద్యమంలో పాల్గొన్న లక్షలాది మంది ప్రజలకు ఇది గౌరవం, గుర్తు. కొత్త పార్టీ ఆ పేరును ఉపయోగించుకుంటే, ఓటర్లు సులభంగా ఆకర్షితులవుతారు. అదే సమయంలో, బీఆర్ఎస్ తన పాత పేరును రక్షించుకోవాలనుకుంటోంది. పేరు మార్చుకున్న తర్వాత కూడా, ప్రజలు ఇంకా బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గానే గుర్తిస్తున్నారు.ఎన్నికల సంఘం ఈ వివాదంలో కీలక పాత్ర పోషించాలి. పార్టీల నమోదు నిబంధనల ప్రకారం, ఇప్పటికే ఉన్న పార్టీ పేరుకు సమీపంలో ఉన్న పేర్లను అనుమతించకూడదు. ఆఖ ఫిర్యాదు, కవిత పార్టీపై వచ్చిన వందలాది అభ్యంతరాలు, మహారాష్ట్ర పార్టీ కోరిక ఇవన్నీ ఈసీ ముందు ఉన్నాయి. ఈసీ ఒకవేళ కవిత పార్టీకి టీఆర్ఎస్ పేరు ఇస్తే, బీఆర్ఎస్ మద్దతుదారుల్లో అసంతృప్తి పెరగవచ్చు. ఒకవేళ నిరాకరిస్తే, కొత్త పార్టీలు "వారసత్వం అడ్డుకుంటున్నారు" అనే ఆరోపణలు చేయవచ్చు. రెండు వైపులా రాజకీయ లాభనష్టాలు ఉన్నాయి. అందుకే ఈసీ త్వరగా, పారదర్శకంగా నిర్ణయం తీసుకోవాలి. అన్ని పార్టీలను పిలిచి విన్నపాలు విని, స్పష్టమైన కారణాలతో తీర్పు ఇవ్వాలి.ఎన్నికల సంఘం న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే, ఈ వివాదం తెలంగాణ రాజకీయాల్లో మరింత పరిపక్వతను తీసుకురావచ్చు. లేకపోతే, ఇది మరిన్ని గందరగోళాలకు దారితీసే ప్రమాదం ఉంది. టీఆర్ఎస్ పేరు ఎవరిది అనేది న్యాయస్థానాలు లేదా ఎన్నికల సంఘం నిర్ణయించాలి. కానీ ఆ పేరు వెనుక ఉన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశలు ఎవరూ దోచుకోకూడదు. అది మాత్రం తెలంగాణ ప్రజలే నిర్ణయించాలి.

# వానొస్తే...ఇంతేనా

## హైడ్రా, గ్రేటర్ మధ్య సమన్వయ లోపం...

**హైదరాబాద్. జూన్ 12:**భాగ్యనగరంలో వానాకాలం ముంచుకొస్తున్న తరుణంలో బల్దియా యంత్రాంగం, హైడ్రా చేసిన ముందస్తు ఏర్పాట్లలోని లోపాలు తొలి వర్షానికే పూర్తిగా బయటపడ్డాయి. వర్షాలొస్తున్నాయంటూ వివిధ ప్రభుత శాఖలతో వరుస సమన్వయ సమావేశాలు నిర్వహించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. క్షేత్రస్థాయిలో జరగాల్సిన సన్నద్ధతపై మాత్రం దృష్టి సారించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం మొదలయ్యాక అత్యవసర బృందాలు, ఇతర యంత్రాంగం ఏర్పాటుకు టెండర్లు పిలవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మరోవైపు, హైడ్రా హడావుడి చూసి అంతా ఆ సంస్థే చూసుకుంటుందనే భావనతో నగరంలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు చేతులెత్తేయడంతో సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. దీని ఫలితంగా మంగళవారం కురిసిన వర్షానికి నగరవ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది వాహనదారులు అర్ధరాత్రి వరకు రోడ్లపైనే నరకయాతన అనుభవించారు.నగరంలో రోడ్లపై వరద నీరు నిలవకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన వరద నాలాల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం, నాలాల పూడికతీత పనులు సరిగా జరగకపోవడం ఈ ముంపునకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. దీనికి తోడు ముంపు సమస్యను తక్షణమే సరిదిద్దే అత్యవసర బృందాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. మే నెల ప్రారంభం నుండే హైడ్రా ఆధ్వర్యంలో వర్షకాల సన్నద్ధతపై సమావేశాలు నిర్వహించి, అధికారులకు సూచనలు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఆశించినట్లుగా లేదని ఈ ఒక్క వర్షంతో తేలిపోయింది.హైటెక్స్ సమీపంలోని జూబ్లీగార్డెన్ రోడ్డు నంబర్ 8 లో గతంలో భారీ వర్షం కురిస్తే 20 నిమిషాల పాటు వరద నీరు నిలిచేది. కానీ జూన్ 9న కురిసిన వర్షానికి ఇక్కడి కాలనీలు ఏకంగా నాలుగు గంటల పాటు వరద నీటిలో చిక్కుకుపోయాయి. రోడ్లపై నడుముల్లోతు నీరు చేరడంతో కార్లు, ఇతర వాహనాలు పూర్తిగా మునిగిపోయాయి. ఈ ప్రాంతంలో మీనాక్షి టవర్స్, వాసవి టవర్స్ వంటి భారీ బహుళ అంతస్తుల ప్రాజెక్టులు నిర్మించడంతో సహజ వరద నీటి ప్రవాహ మార్గాలన్నీ మూసుకుపోయాయి. వరద నాలాల సామర్థ్యం ప్రవాహ మార్గాల గురించి ఆలోచించకుండా ఉన్నతాధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, ఇంజనీరింగ్ లోపాలతో రోడ్లు వేయడమే ఈ దుస్థితికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు. అర్ధరాత్రి వరకు రోడ్లపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయినా, సహాయం చేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు ఎవరూ కనిపించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రోజంతా కరెంట్ కట్...**


కొన్ని గంటల క్రితం కురిసిన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బల్దియా పరిధిలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను దెబ్బతీసింది. విద్యుత్ ప్రధాన కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న కాలనీలు సైతం 24 గంటలకు పైగా కరెంట్ లేక నరకయాతన పడ్డాయి. విపత్తులు తలెత్తినప్పుడు అన్ని విభాగాలు కలిసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లోని సైఫాబాద్, ఆజామాబాద్ డివిజన్లలో అధికారుల తీవ్ర జాప్యం వల్ల వినియోగదారులు కరెంట్ లేక నానాపాట్లు పడ్డారు. ముషీరాబాద్, హిమాయత్‌నగర్, నారాయణగూడ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వానకు పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. చెట్లు విరిగిపడటంతో ఇనుప విద్యుత్ స్తంభాలు వంగిపోయి, లైన్లు తెగిపడటంతో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. హైడ్రా, జీహెచ్ఎంసీ అత్యవసర సిబ్బంది రోడ్లపై పడిన చెట్లను వెంటనే తొలగించినప్పటికీ, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గాంధీనగర్, హెబ్రోన్ చర్చి వీధి, వై జంక్షన్, విద్యానగర్, ఎస్‌బీఐ బ్యాంక్ వీధి, సీపీఎం మార్క్స్ భవన్ రాష్ట్ర కార్యాలయం వీధి, అడిక్‌మెట్ డివిజన్ ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్ వీధి ప్రాంతాల్లో 24 గంటలు గడిచినా సరఫరా పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## గంజాయి విక్రయిస్తూ ఇద్దరు యువకులు అరెస్ట్...

### 1.70 కిలోల గంజాయి స్వాధీనం, రిమాండ్ కి తరలింపు

**మేడ్చల్:**గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఖమ్మం పట్టణానికి చెందిన ధనుష్, లోకేష్ అనే ఇద్దరు యువకులు గంజాయికి అలవాటు పడి, ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి తీసుకువచ్చి ఘట్కేసర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద నుంచి 1 కిలో 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్కు తరలించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఘట్ కేసర్ ఇన్స్పెక్టర్ బాలస్వామి తెలిపారు.

## నేనిప్పటికీ కాంగ్రెస్ లోనే వున్నారు



**హైదరాబాద్:**శుక్రవారం నాడు నాంపల్లి కోర్టు లో కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ కేసు సంచలం సృష్టించింది. కేసులో పిర్యాదుదారు మహిళ తన వివరాలు లీక్ చేయడంపై కోర్టు ఆవరణలో ఆవేదన వ్యక్తం చేసింది. అయితే తన సమాచారాన్ని ఎవరు బయటపెట్టారో తెలియదని వాపోయింది. కొందరి వల్ల తనకు ప్రాణహాని ఉందని కోర్టు ఆవరణలో మీడియాకు వెల్లడించింది. కోర్టుకు రాకుండా అడ్డుకున్నారు.. ఆటోను వెంబడించారని సంచలన వ్యాఖ్యలు చేసింది. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపను. ఇప్పటికీ తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నానని వెల్లడించింది.

# చెరువు భూమిపై వెంచర్ పంజా..!

**నక్షబాట మాయం.. చెరువు కబ్జా..!**

**ఎఫ్‌టీఎల్ ఆక్రమణలపై అధికారుల మౌనం**

**చెరువును ప్లాట్లుగా మార్చేస్తున్నారా..?**

**పాటు కాలువ ధ్వంసం.. వర్షపు నీటికి దారి ఎటు..?**

**ప్రభుత్వ భూములపై రియల్ దందా..? గ్రామస్తుల ఆందోళన**



**రంగారెడ్డి జిల్లా జూన్ 12 (స్కై న్యూస్):** కేశంపేట మండలం వేములనర్వ గ్రామంలో ప్రభుత్వ భూములు, చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి, నక్షబాటలు, పాటు కాలువలను ఆక్రమించి అక్రమ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారంటూ గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ కొందరు వెంచర్ నిర్వాహకులు చెరువు భూములు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ప్లాట్లుగా మార్చుతున్నారని ఆరోపిస్తున్నారు గ్రామస్తుల కథనం ప్రకారం సర్వే నంబర్లు 273, 274, 275, 285తో పాటు ప్రభుత్వ భూమికి సంబంధించిన సర్వే నంబర్ 232, చెరువుకు సంబంధించిన 311, 313, 314, 315, 317, 376 సర్వే నంబర్ల పరిధిలోని భూములను అక్రమంగా ఆక్రమించి వెంచర్‌లో కలిపినట్లు ఆరోపణలు ఉన్నాయి నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు ప్రభుత్వ రికార్డుల ప్రకారం సుమారు 9 ఎకరాల 7 గుంటల విస్తీర్ణం కలిగిన చెరువులో నాలుగు ఎకరాలకు పైగా భూమిని ఆక్రమించి వెంచర్‌గా మార్చినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు చెరువుకు నీరు చేరే పాటు కాలువలను మట్టితో పూడ్చివేయడంతో వర్షపు నీరు చెరువులోకి చేరే మార్గం మూసుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అంతేకాకుండా బీటీ రోడ్డు నుంచి తండాకు వెళ్లే నక్షబాటను తొలగించడంతో పాటు, వెంచర్‌కు అడ్డుగా ఉన్న సుమారు రెండు ఎకరాల గౌటాన్ భూమిని కూడా ఆక్రమణలో కలిపినట్లు ఆరోపిస్తున్నారు దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు ఈ అంశంపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు అధికారులు సర్వే నిర్వహిస్తామని హామీలు ఇస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదని మండిపడుతున్నారు వర్షాకాలం ప్రారంభమైన సమయంలో చెరువులకు నీరు చేరే మార్గాలు ధ్వంసం కావడం ఆందోళనకరమని గ్రామస్తులు పేర్కొంటున్నారు అధికార పార్టీ నాయకుల అండదండలతోనే ఈ ఆక్రమణలు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ, ప్రభుత్వ భూములు, చెరువు ఎఫ్‌టీఎల్, నక్షబాటలు, పాటు కాలువలను ఆక్రమించిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు లేదంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## ఫరూక్‌నగర్ ఎంపీడీవోపై విమర్శలు..

# కారు శుభ్రం చేసిన అటెండర్లు

**కిందిస్థాయి సిబ్బంది అంటే అంత చులకనా? అంటూ ప్రశ్నలు**

**ప్రభుత్వ ఉద్యోగులను వ్యక్తిగత పనులకు వినియోగించడంపై ఆగ్రహం**










**రంగారెడ్డి జిల్లా జూన్ 12: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంపీడీవో శ్రీకాంత్‌కు సంబంధించిన ఓ ఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆయన వ్యక్తిగత వాహనాన్ని ఇద్దరు అటెండర్లు శుభ్రం చేస్తుండగా ఆ దృశ్యాలు మీడియా కెమెరాకు చిక్కాయి అందులో ఒక మహిళా అటెండర్‌తో పాటు మరో అటెండర్ కూడా వాహనాన్ని నీటితో శుభ్రం చేస్తుండటం కనిపించింది. దీనిపై ప్రశ్నించగా, "ఇది మా సార్ వాహనం" అని వారు సమాధానం ఇచ్చినట్లు సమాచారం ప్రభుత్వ సిబ్బందిని ప్రజా సేవల కోసం నియమిస్తారని, వ్యక్తిగత పనుల కోసం వినియోగించడం సమంజసం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు ముఖ్యంగా మహిళా సిబ్బందితో వ్యక్తిగత వాహనాన్ని శుభ్రం చేయించడం సరైన విధానమా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో ఈ ఘటన జరగడంతో అక్కడికి వచ్చిన ప్రజలు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ప్రభుత్వ పనులకే సిబ్బందిని వినియోగించేవారని, ప్రస్తుతం చోటుచేసుకున్న ఘటన వివాదాస్పదంగా మారిందని కొందరు పేర్కొంటున్నారు అయితే ఈ అంశంపై ఎంపీడీవో శ్రీకాంత్ స్పందన ఇంకా వెలువడలేదు ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, అధికారుల వివరణ వెలువడాల్సి ఉంది ప్రభుత్వ ఉద్యోగులను వ్యక్తిగత పనులకు వినియోగించారనే ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ చేపడతారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

## తెల్కపల్లి రైతులకు స్ప్రింక్లర్ పైపుల పంపిణీ

**తెల్కపల్లి 12 జూన్ (స్కై న్యూస్):** రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తెల్కపల్లి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా మండలానికి చెందిన అర్హులైన రైతులకు స్ప్రింక్లర్ పైపుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించేందుకు స్ప్రింక్లర్ విధానం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను అందించేందుకు కట్టుబడి ఉందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్ర శేఖర్ , ఉప సర్పంచ్ శ్రీనివాసులు ,మండల అధ్యక్షుడు బండ పర్వతాలు , మాజీ సింగల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య ,స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ నియోజకవర్గంలో

# సమృద్ధిగా ఎరువుల నిల్వలు

**రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి:ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**1.26 లక్షల ఎకరాల సాగుకు 13 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం**



**రంగారెడ్డి జిల్లా జూన్ 12: ( స్కై న్యూస్ )** వర్షాకాల వ్యవసాయ సీజన్‌ను ) దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాటిని క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేయడంలో అధికారులు చొరవ చూపాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని తన నివాసంలో వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు రైతులు ఎక్కువగా నిరక్షరాస్యులుగా ఉండటం వల్ల యాప్ ద్వారా సబ్సిడీ ఎరువులు, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువుల కోసం దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు గ్రామాల్లోకి వెళ్లి రైతులకు యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు యాప్ విధానం వల్ల ఎదురవుతున్న సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి రైతులకు అనుకూలమైన పరిష్కారం తీసుకురావడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు షాద్‌నగర్ నియోజకవర్గంలో సుమారు 1 లక్షా 26 వేల ఎకరాల్లో వ్యవసాయం సాగుతోందని, వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను రైతులు విస్తృతంగా సాగు చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు ప్రస్తుతం రైతుల అవసరాల కోసం 13,000 మెట్రిక్ టన్నుల ఎరువులు 6,000 మెట్రిక్ టన్నుల డీఏపీ, 9,000 మెట్రిక్ టన్నుల పొటాష్, 1,000 మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు మండలాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు, ఎరువుల పంపిణీ, సాగు సూచనలను చేరవేస్తారని తెలిపారు వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఉపయోగపడే ప్రతి అంశాన్ని మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు రైతులకు సమయానుకూల సమాచారం అందితే సాగు మరింత సులభమవుతుందని పేర్కొన్నారు ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీ రమాదేవి, మాజీ జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, సురేష్ రెడ్డి, కేకే కృష్ణ, చందు నాయక్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్‌తో పాటు వివిధ మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# పరిహారంపై బాధితుల మండిపాటు...

**నాగర్ కర్నూల్ జూన్ 12 (స్కైన్యూస్)** 167 జాతీయ రహదారి నిర్మాణంలో జిల్లా కేంద్ర సమీపంలో ప్లాట్లు కోల్పోయిన బాధితులకు గజానికి 2744 రూపాయల పరిహారం చెల్లించడం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణం శిరవేగంగా అభివృద్ధి చెందుతున్న కొల్లాపూర్ చౌరస్తాలో తాము గజం 20వేల రూపాయల పైగా విలువచేసే ప్లాట్లను కోల్పోవడం జరిగిందని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చి తమ ఖాతాలో గజానికి అతిచౌక పరిహారం చెల్లించడం విస్మయానికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు జిల్లా ఉన్నత అధికారులు స్పందించి గజానికి 15 వేల రూపాయల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో జిల్లా అధికారులకు వినతి పత్రం అందించిన సందర్భంలో మెరుగైన పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని వివరించారు

## షాబాద్ మండలం మన్మారి గ్రామంలో విషాదం...

**అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి**

**మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు**



**రంగారెడ్డి జిల్లా, జూన్ 12: స్కై న్యూస్** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మన్మారి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది స్నేహితులతో కలిసి వెళ్లిన ఓ యువకుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది మృతుడు షాద్‌నగర్ పట్టణానికి చెందిన మధుగా గుర్తించారు కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం గురువారం రాత్రి మధు తన స్నేహితులతో కలిసి మన్మారి గ్రామానికి వెళ్లాడు అనంతరం శుక్రవారం తెల్లవారుజామున ఐదుగురు యువకులు కలిసి ఈత కొట్టేందుకు ఓ బావి వద్దకు వెళ్లినట్లు సమాచారం ఈ సందర్భంగా మధు బావిలో ఈత కొట్టగా, కొద్దిసేపటికే ఏం జరిగిందో తెలియని పరిస్థితుల్లో అతడు మృతదేహంగా బావిలో తేలినట్లు తెలుస్తోంది ఘటన గురించి సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు తమ కుమారుడు మధుకు ఈత బాగా వచ్చేదని, అతని మృతి వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని వారు పోలీసులను కోరుతున్నారు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది మధు మృతికి గల అసలు కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

## ఆధునిక పద్ధతులతో చెరకు సాగులో అద్భుతాలు సృష్టిస్తున్న రైతు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఫీఖ్ అహ్మద్ పటేల్



**రంగారెడ్డి జిల్లా జూన్ 12 : ( స్కై న్యూస్ )** భూమిని నమ్ముకుని జీవిస్తూ, అన్నదాత కష్టాలను స్వయంగా అనుభవించి, ఆ తర్వాత ప్రజా సంక్షేమం కోసం రాజకీయ నాయకుడిగా ఎదుగుతున్న ఆదర్శ రైతు కథనం ఇది, రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం సంతాపూర్ గ్రామానికి చెందిన రైతు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఫీఖ్ అహ్మద్ పటేల్ చెరకు సాగులో వినూత్న పద్ధతులను అనుసరిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు సాంప్రదాయ వ్యవసాయ విధానాలకు భిన్నంగా ఆధునిక యాజమాన్య పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్, అంతర పంటల సాగుతో అధిక దిగుబడులు సాధిస్తూ విజయవంతమైన రైతుగా గుర్తింపు పొందుతున్నారు రఫీఖ్ అహ్మద్ పటేల్ తన 6.5 ఎకరాల వ్యవసాయ భూమిలో కో 13007 హై షుగర్ రకం చెరకు పంటను సాగు చేశారు నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని అమలు చేశారు నాణ్యమైన విత్తనాలు, సేంద్రీయ ఎరువులు, సమయానుకూల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని రఫీఖ్ అహ్మద్ పటేల్ తెలిపారు ఈ పద్ధతుల ద్వారా ఎకరాకు లక్షల రూపాయల ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు చెరకు పంట కేవలం రెండు నెలల 20 రోజుల వ్యవధిలోనే అద్భుతంగా పెరగడంతో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కిషన్ రెడ్డి ప్రత్యేకంగా పొలాన్ని సందర్శించి పంటను పరిశీలించారు పంట అభివృద్ధి పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఆయన రైతు రఫీఖ్ అహ్మద్ పటేల్‌ను అభినందించారు ఈ సందర్భంగా డాక్టర్ కిషన్ రెడ్డి మాట్లాడుతూ చెరకు సాగులో ఎక్సాలి, అడ్సాలి, కంసాలి వంటి వివిధ కాలానుగుణ పద్ధతులు ఉన్నాయని వివరించారు చెరకు పంటకు సూక్ష్మ పోషకాలతో పాటు నత్రజని, భాస్వరం, పొటాషియం, డీఏపీ వంటి ఎరువులను సమతుల్య నిష్పత్తిలో అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు భవిష్యత్తులో కూడా చెరకు సాగు అభివృద్ధికి అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు అందిస్తానని రైతుకు హామీ ఇచ్చారు అలాగే కావేరి మైక్రోటెక్ సీడ్స్ కంపెనీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఘనబాబు కూడా పంటను పరిశీలించి రైతును అభినందించారు ఈ సందర్భంగా కంపెనీకి సంబంధించిన విత్తనాలు, క్రిమిసంహారక మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు రైతుగా ఉండి రాజకీయ నాయకుడిగా ఎదిగిన రఫీఖ్ అహ్మద్ పటేల్ ఎప్పుడూ ప్రజలకు, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు అందుబాటులో ఉంటూ వారి జీవన విధానంలో మమేకమై సాదాసీదా జీవనం గడుపుతున్నారు "రైతే రాజు" అనే భావనను ఆచరణలో చూపిస్తూ సంతాపూర్ గ్రామ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నారు ఈ కార్యక్రమంలో కావేరి మైక్రోటెక్ సీడ్స్ కంపెనీ సిబ్బంది వరప్రసాద్, సయ్యద్ సిరాజ్ ఉల్ హక్, బషీర్ పటేల్, నజుముద్దీన్, కరీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం...

**చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్....**



**హైద్రాబాద్ జూన్ 12:** అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హై స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న అంశం డిప్యూటీ డీఈఓ నిర్వహించిన పరిశీలనలో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. అదేవిధంగా అ యొక్క పుస్తకాలను డిప్యూటీవో సీజ్ చేయడం జరిగింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యం పుస్తకాల విక్రయం చేపట్టడం పట్ల అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) బషీర్బాగ్ నగర శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడేలా ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదని ఏబీవీపీ నాయకులు అన్నారు. ప్రభుత్వ విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాల యాజమాన్యంపై వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఏ విద్యాసంస్థ కూడా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం చేపట్టకుండా విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ విక్రమాదిత్య, నగర కార్యదర్శి సురేందర్, విభాగ్ నాఖీూ కన్వీనర్ సుప్రజ్, నగర నాఖీూ కన్వీనర్ రాహుల్ పాల్గొన్నారు.

వార్తాతరంగాలు

శనివారం 13 జూన్ 2026

## పేరిపేరల్ యాంజియో ప్లాస్టి తో రక్తప్రసరణ పునరుద్ధరణ...

**కాళ్ల పుండ్లను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం**

**వాస్కులర్ సర్జన్ డాక్టర్ వినయ్ కుమార్**




**నాగర్ కర్నూల్ జూన్ 12 (స్కై న్యూస్)** షుగర్ వ్యాధి కారణంగా నరాలు దెబ్బతినడం కాళ్ళలో రక్తప్రసరణ సరిగా జరగకపోవడం వల్ల దీర్ఘకాలిక పుండు ఏర్పడతాయని పెరిఫెరల్ యాంజియో ప్లాస్టి చికిత్స ద్వారా కాళ్లలోని రక్తనాళాల అడ్డంకులను తొలగించి రక్త సరఫరాను పునరుద్ధరించడం జరుగుతుందని సికింద్రాబాద్ లోని యశోద హాస్పిటల్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ వినయ్ కుమార్ వివరించారు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారికోస్ వెయిన్స్ సమస్యలపై అవగాహన కల్పించారు. కాళ్ల పుండ్లను నిర్లక్ష్యం చేస్తే పరిస్థితి విషమించి కాళ్లు తొలగించే పరిస్థితి ఏర్పడుతుందని ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్స ద్వారా ఆపరేషన్ లేకుండా సమర్థవంతంగా పరిష్కారం లభిస్తుందని వివరించారు. షుగర్ వ్యాధిగ్రస్తులు కాళ్ల ఉండను వెంటనే గమనించి వాస్కులర్ సర్జన్ ను సంప్రదించాలని కోరారు. చికిత్స ద్వారా రక్త ప్రసరణ మెరుగు కావడం వల్ల కాళ్లపై ఉన్న పుండ్లు త్వరగా మానిపోతాయని వివరించాడు ఈ సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ సుదర్శన్ రెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిందాం

**యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి.**

**మాదకద్రవ్యాల నిర్మూలన మన అందరి బాధ్యత.**

**ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**



**దేవరకద్ర, కొత్తకోట 12 (స్కై న్యూస్);** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో డ్రగ్స్ కు (మాదక ద్రవ్యాలకు) వ్యతిరేకంగా వనపర్తి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2 కె రన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా వనపర్తి జిల్లా కలెక్టర్, ఎస్పీ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు విదేశాలకు పరిమితమైన డ్రగ్ సంస్కృతి, మన ప్రాంతాలకు వ్యాపించింది అన్నారు.డ్రగ్స్ బారిన పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు అన్నారు.డ్రగ్స్ కు బానిసలై కొంతమంది యువత ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు.గతంలో డ్రగ్స్ వ్యాప్తి ఉధృతంగా ఉండేది, దానిని కంట్రోల్ చేసేందుకు, డ్రగ్స్ ను అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఉన్న నార్కోటిక్ బ్యూరోను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి, పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి ఈగల్ ఫోర్సును ఏర్పాటు చేశారు.డ్రగ్స్ పై ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో పౌరులుగా మనమందరం డ్రగ్స్ నిర్మూలనలో భాగమై, డ్రగ్స్ తీసుకుంటున్న వారి వివరాలను, డ్రగ్స్ విక్రయిస్తున్నారని సమాచారం తెలిసిన వెంటనే 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం తెలియజేయాలి అన్నారు.డ్రగ్స్ పై సమాచారం ఇచ్చిన పౌరుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతాం అన్నారు.మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించిన పోలీస్ శాఖకు ధన్యవాదాలు చెప్పారు.మాదకద్రవ్యాల వినియోగం సమాజాన్ని మానసికంగా, ఆర్థికంగా నాశనం చేస్తుంది, మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత, డ్రగ్ ఫ్రీ సొసైటీ కోసం అందరం కృషి చేద్దాం అన్నారు.తదనంతరం ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవేర్నెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బీడీ యజమాన్యం ప్యాకింగ్ వర్కర్స్ పై నిర్లక్ష్య వైఖరి వీడి వేతనాలు పెంచాలి

**: రాష్ట్ర సహాయ కార్యదర్శి జె ఎన్ దేవదానం, సి వెంకటేష్ గౌడ్**




**చిన్నచింతకుంట జూన్ 12 (స్కై న్యూస్);** బీడీ ప్యాకింగ్ వర్కర్స్ వేతనాల పెంపుదలకై సమ్మె రెండవ రోజు కొన సాగింది. బీడీ యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడి కార్మికులకు ధరలకు అనుగుణమైన వేతనాలు పెంచాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె ఎన్ దేవదానం, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ సహకార దర్శి సి వెంకటేష్ గౌడ్ కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ బీడీ ప్యాకింగ్ వర్కర్స్ శుక్రవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో సమ్మెలో కూర్చున్నారు. సమ్మెకు మద్దతుగా సి వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సమ్మెకు టి యు సి ఐ మద్దతుగా ఉంటుందని ప్రకటించింది. తక్షణమే యజమానులు స్పందించి చర్చలు జరపాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల బీడీ ప్యాకింగ్ వర్కర్స్ పాల్గొన్నారు.

## వర్షాకాలానికి ముందస్తు చర్యలు

**షాద్‌నగర్‌లో నీరు నిల్వకుండా ప్రత్యేక ఏర్పాట్లు**

**మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**





**రంగారెడ్డి జిల్లా జోన్ 12 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని షాద్‌నగర్ పట్టణంలోని పలు వార్డుల్లో వర్షపు నీరు రోడ్లపై నిల్వకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ తెలిపారు శుక్రవారం పట్టణంలోని 18వ భాగ్యనగర్ కాలనీలో పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లపై నీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో తక్షణ పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పెంటయ్య,కో ఆప్షన్ సభ్యుడు సుజీవన్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి,చందు లాల్, కత్తి చంద్రశేఖరప్ప, తంగడపల్లి శంకర్ తది తరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ నియోజకవర్గంలో గుడిసెలు కనిపించొద్దు

**అవసరమైతే నేనే వస్తా.. ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తా**

**ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇల్లు అందాలి**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**





**రంగారెడ్డి జిల్లా జూన్ 12: ( స్కై న్యూస్ )** పేదలను ఇంటి యజమానులుగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, షాద్‌నగర్ నియోజకవర్గంలో ఒక్క గుడిసె కూడా కనిపించకుండా ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అధికారులను ఆదేశించారు తన నివాసంలో హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు నియోజకవర్గంలో తొలి విడతగా 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా, వాటిలో 2,200 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు మరో 750 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉండగా, మరో 750 ఇళ్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదని వెల్లడించారు అదనంగా మరో 2,000 ఇళ్లు నియోజకవర్గానికి మంజూరైనట్లు పేర్కొన్న ఎమ్మెల్యే, పార్టీలకు అతీతంగా అర్హులైన వారికే ఇళ్లను అందజేస్తామని స్పష్టం చేశారు గతంలో ఇల్లు పొందిన వారు, కుటుంబ సభ్యుల పేరిట ఇళ్లు ఉన్నవారు, కొన్ని ఇతర సాంకేతిక కారణాల వల్ల అర్హులైనా కొందరికి మంజూరు ప్రక్రియ నిలిచిపోయిందని, కేంద్ర ప్రభుత్వ నిబంధనల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు త్వరలోనే ఈ సమస్యలను పరిష్కరించే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను సకాలంలో విడుదల చేస్తోందని, అయితే కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన గ్రాంట్లలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.70 వేల చొప్పున, పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల చొప్పున కేంద్ర ప్రభుత్వం అందించాల్సిన నిధులు ఆలస్యమవుతున్నాయని తెలిపారు ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభించని లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ అధికారులు నోటీసులు జారీ చేస్తారని ఎమ్మెల్యే హెచ్చరించారు నోటీసుల తర్వాత కూడా పనులు ప్రారంభించకపోతే, ఆ గృహాన్ని అదే గ్రామంలోని మరో అర్హ లబ్ధిదారుడికి కేటాయించే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ పథకం, రేషన్ కార్డుల పంపిణీ ఇప్పటికే కొనసాగుతున్నాయని తెలిపారు ప్రస్తుతం గ్రామసభల ద్వారా పెన్షన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు గ్రామీణ ప్రాంతాల్లో నిజమైన అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులకు సూచించిన ఎమ్మెల్యే, నియోజకవర్గంలో ఎక్కడా గుడిసెలు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో హౌసింగ్ డిప్యూటీ ఈఈ సురేష్, ఏఈలు అన్వేష్, మౌనిక, సాయినాథ్, కిషన్, శంకర్, ఏఈఈ శివతేజ, మాజీ జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, సురేష్ రెడ్డి, సర్పంచ్ చందు నాయక్, కేకే కృష్ణ, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# వారాంతపు మార్కెట్ యార్డ్ ను సద్వినియోగం చేసుకోవాలి...

**పేట లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను పునః ప్రారంభించిన కలెక్టర్.**





**నారాయణపేట జూన్ 12 (స్కైన్యూస్)** వారాంతపు మార్కెట్ యార్డ్ ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక కోరారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ (సమీకృత మార్కెట్) యార్డును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం సమీకృత మార్కెట్ యార్డులో వివిధ రకాల సేంద్రీయ కూరగాయలు పండ్లు పూల ఉత్పత్తులు ఆహార ధాన్యాలు మహిళా సంఘాల ఉత్పత్తులు రాగి లడ్డూలు జనపనార సంచులు మట్టి కుండలు మట్టి ఆభరణాలు పచ్చళ్ళు వెదురు ఉత్పత్తులు చేనేత చీరలు హస్తకళ ఉత్పత్తులు కళాకారుల కుమ్మరి ఉత్పత్తులు జనపనార తదితర వస్తువుల స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ప్రారంభించటానికి ముఖ్య ఉద్దేశ్యం నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయాన్ని వినియోగంలోకి తీసుకు రావడంతో పాటు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండించిన పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి అని తెలిపారు. సేంద్రీయ ఎరువులు తయారీ వాటి ప్రదర్శన అమ్మకాలు స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడంతో పాటు ఆన్ లైన్ ద్వారా అమ్మకాలు జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారు చేసే ఉత్పత్తులు వాటిని ప్రజలు ఆదరించేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారం లో ఒక శుక్రవారం ఇక్కడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయంలో ఆయా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని, జిల్లా ప్రజలు వారంతపు మార్కెట్ ను ఉపయోగించుకుని రసాయనాలు లేని ఆహార ఉత్పత్తులు కొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీ కమిషనర్, డిఆర్డిఏ , హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు సమన్వయంతో ప్రతి శుక్రవారం ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేయించి మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీడీఏ వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, హార్టికల్చర్ అధికారి సాయిబాబా, పుర కమీషనర్ శంకర్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పుర వైస్ చైర్ పర్సన్ మంజుల, బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, వార్డు కౌన్సిలర్ కందేన్ పల్లి సత్యమ్మ, కౌన్సిలర్ భరత్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షు రాలు అరుంధతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ బండి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ గలీజ్ రాజకీయాలు చేస్తోంది: జగ్గా రెడ్డి




**హైదరాబాద్, జూన్ 12 :** ప్రధానమంత్రి 12 ఏండ్లుగా ప్రభుత్వం లో ఉంటూ గలీజ్ రాజకీయాలు చేస్తోంది. మీనాక్షి నటరాజన్ ను ఉద్దేశపూర్వకంగా బీజేపీ అట్టుకుందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి విమర్శించారు.గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ మధ్యప్రదేశ్ లో మూడో రాజ్యసభ సీట్ కోసం దిగజారుడు రాజకీయాలు చేసింది. సదా సీదా మహిళ నేత మీనాక్షి నటరాజన్. మీనాక్షి లాంటి హిళలను బిజెపి అడ్డుకోవడం దౌర్భాగ్యం. ఎన్నికల కమిషన్ను వాడుకొని కాంగ్రెస్ రాజ్యసభ ను అడ్డుకుంది. ప్రధాని మోదికి నటరాజన్ ను అడ్డుకోవడంతో ఏం అవసారం. ప్రైవేట్ ఫిర్యాదు లో ఎం ఉందొ లేదో తెలీదు. చిన్న కేస్ సాకుతో రిజక్టు చేస్తారా.. కామ ఫుల్ స్టాప్ లు కూడా చూసి ఎలెక్షన్ కమిషన్ చూసి ఆపేస్తుందా. గాంధీ ఐడియాలజీ లో పని చేసే వ్యక్తి మీనాక్షి నటరాజన్, రాహుల్ గాంధీ చెప్తూనే ఉన్నారు ఓటు చోరీ చేసే గెలుస్తున్నారు. వెస్ట్ బెంగాల్లో అన్ని స్థానాల గెలుపు మీతో సాధ్యమా! అధికారం తో ఎన్నికల కమిషన్ అడ్డుపెట్టుకొని రాష్ట్రాలను కబ్జా చేస్తోంది. ఎన్నికల కమీషన్ సిస్టం ను బీజేపీకి బ్రేక్ చేస్తోంది. గలీజ్ రాజకీయాలు కాంగ్రెస్ కి ఎం అవసరం. 12 ఏండ్లు ప్రధాని గా మోడీ అధికారంలో ఉన్నారు. కుట్రలు.. కుతంత్రాల పాలనే. పరిపాలన లో నీతి లేదు. పనికి మాలిన ఇష్యును అడ్డం పెట్టుకుని మీనాక్షి నామినేషన్ తిరస్కరణ చేశారు.మోడీ కార్యాలయం ఇంత దుర్మార్గంగా వ్యవహరించింది. ఒక్క సీటు కోసం ఇంత దిగజారుడు అవసరమా..? సిగ్గు పడాలా..? సిగ్గుపడ్వాల్సిన అంశమా అనేది బీజేపీ నేతలు ఆలోచించుకోండి. అధికారం ఇచ్చింది పరిపాలన చేయండి అని మిమ్మల్ని నమ్మి మూడో సారి అధికారం ఇచ్చారు. మూడు కోట్ల ఉద్యోగం అన్నారు... నల్లదనం తెచ్చి అకౌంట్ లో వేస్తా అన్నారు అదీ లేదు. 12 ఏండ్లల్లో 24 కోట్ల ఉద్యోగాలు ఇస్తా అన్నారు ఏమైంది .. జవాబు ఉందా..?బీజేపీ నాయకుల మగతనం... ఇచ్చిన మాట నిలబెట్టుకుని నిరూపించుకోండి. అంతే కానీ... షార్ట్ కట్ లో రాజ్య సభ సభ్యత్వం లాక్కోవడం లో లేదు మీ మగతనం. దొంగతనం చేసింది బీజేపీ వాళ్ళు.. బురద జల్లేది దీ=వా. నటరాజన్ ఎంపీ కాకుండా నీతి మాలిన దొంగ వ్యవస్థ బీజేపీ. ఆ బురద తెలంగాణ కాంగ్రెస్ నేతల మీద బురద జల్లుతుంది. మీరు చేసిన పని కూడా మీరు చెప్పుకోలేని పరిస్థితి. హరీష్ రావు.. ప్రతిపక్ష నాయకుడు కాబట్టి ఏదో ఒకటి మాట్లాడుతున్నాడు. హరీష్ మా మీద బురద జల్లడం కాదు.. నీతిమాలిన చర్య చేసిన బీజేపీ నీ ఎందుకు ప్రశ్నించడం లేదు. మా దగ్గర నాయకులు బయటకు మాట్లాడతారు. బీజేపీ లో మాట్లాడమని చెప్పండి. ప్రాంతీయ పార్టీల్లో ఒక్కడే హీరో. బీజేపీ లో ఎవరు మాట్లాడినా అప్పుడే ఖతం అవుతారు. స్వేచ్ఛ ఎక్కువ కాంగ్రెస్ లో.. అందుకే కాంగ్రెస్ అంటారు. ఊహాగానాలకు సమాధానాలు ఉండవు. అనుమానాల మీద రాజకీయం నడవదు. బీజేపీ తాను చేసిన దొంగతనం పై చర్చ లేకుండా మా పై బురద జల్లాడు. బాధితుల మైన మేము సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. హరీష్ మాటలకు తాడు బొంగరం లేదు. ప్రభుత్వం ఉన్నప్పుడు మామ సంకలో ఉన్నాడు. ఇప్పుడు రోడ్ల మీద పడ్డాడు. కాంగ్రెస్ లో కోవర్ట్ లున్నారనే ఆరోపణలపై జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు. కోవర్టులు ఉన్నారని బీజేపీ బురద జల్లి.... తాను చేసిన దొంగతనం పై పై చర్చ జరగకుండా చూస్తుంది. ఇక్కడ ఎవరైనా కోవర్టులు ఉంటే తొడ్కలు తీస్తాం. నమోదు కానీ కేసును... ఆధారంగా తీసుకుని నామినేషన్ తిరస్కరించారు.

# మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ జీతాలు పెంచాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా



**దేవరకద్ర జూన్ 12 (స్కై న్యూస్);** ధర్నాను ఉద్దేశించి తెలంగాణ ప్రగతిశీల మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వెంకటేష్ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ కి గౌరవ వేతనంగా 3000 మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ డబ్బులతో వారి జీవనోపాధి ఎట్లా గడపాలి గౌరవ వేతనాల పేరుతో మన ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులు రాజ్యసభ సభ్యులు లక్షల్లో జీతాలు తీసుకుంటున్నారు,అనేక వసతులను పొందుతున్నారు. కష్టించి పనిచేసే కార్మికులకు జీతాలు అగౌరవంగా ఉన్నాయి, సౌకర్యాలు అసలు లేవు పని భద్రత అసలు లేదు, మధ్యాహ్న భోజన కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో పదివేల జీతం పెంచుతానని హామీ ఇవ్వడం జరిగింది అన్నారు. అది నేటికీ నోచుకోలేదు. కనీస వేతన చట్టం 26,000 వేలు ఇవ్వాలని ఉన్నప్పటికీ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నాయి అన్నారు. ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం వాటా 16000 రాష్ట్ర ప్రభుత్వం వాటా 10000 మొత్తం ఈ వర్కర్స్ కి 26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ బీమా సౌకర్యం కల్పించాలి. ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలి. నెల నెల చెల్లించాలి. కోడిగుడ్డును ప్రభుత్వమే సరఫరా చేయాలి. గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే చేయాలి. అక్షయపాత్ర ను రద్దు చేయాలి. విద్యార్థుల మెనూ బిల్లులను పెంచాలి.సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఈవో సూపర్డెంట్ కి వినతినివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్కర్స్ నీలకంఠం సరోజా భారతమ్మ లక్ష్మమ్మ లక్ష్మి రాములమ్మ అరుణమ్మ నరసమ్మ ఆయమ్మ సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# “బాల కార్మిక రహిత సమాజం నిర్మిద్దాం

**జడ్జి సాయి మనోజ్**

**నారాయణపేట జూన్ 12: ( స్కై న్యూస్ )** బాలకార్మికులు లేని సమాజాన్ని నిర్మించాలని నారాయణపేట జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ కోరారు. శుక్రవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినో త్సవం సందర్భంగా నారా యణపేటలోని శ్రీ వేద సరస్వతి జూనియర్ కాలేజీ లో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన న్యాయమూర్తి మరియు లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ అధ్య క్షతన న్యాయ విజ్ఞాన సద స్సు నిర్వహించారు. దానిలో భాగంగా ప్రిన్సిపాల్ జూని యర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ, లైంగిక వేధిం పులు, బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా తదితర వాటిపై అవగాహన కల్పించారు. బాలలను పని లో పెట్టుకోవడం బాల్య వివాహాలను చేయడం నేర మన్నారు. బాల కార్మిక వ్యవ స్థను నిర్మిలించేందుకు తల్లి



దండ్రుల బాధ్యత ఎంతో ఉందని అన్నారు. తమ పిల్లలను పనికి పంపించి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దని సూచిం చారు. మన చుట్టుపక్కల ఎక్కడైనా బాల కార్మికులను గుర్తిస్తే, వెంటనే చైల్డ్ లైన్ (1098) లేదా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలనీ కోరారు. లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం పోక్సో 2012 , ఇది 18 సంవత్సరాల లోపు పిల్లలకు లైంగిక వేధింపుల నుండి రక్షణ కల్పించడానికి ఉద్దేశిం చబడింది అని అవగాహన కల్పించారు. ఈనాటి యువ తరం రేపటి దేశ భవిష్యత్తు. కానీ దురదృష్టవశాత్తు కొన్ని దురలవాట్లు మన యువత ను దారి మళ్లిస్తున్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. వాటి లో మాదక ద్రవ్యాల వినియో గం అత్యంత తీవ్రమైనదనీ ప్రమాదకరమైనదనీ యువత మత్తుకు దూరంగా ఉండి జీవితంలో ఒక లక్ష్యం ఏర్పరచుకొని దానికి కోసం కృషి చేయాలి అని తెలిపా రు. ఈ సందర్భంలో జిల్లా కోర్టు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మిపతి గౌడ్ మాట్లాడుతూ న్యాయ సలహాల కోసము జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ 15100 మీద అవగాహన కల్పించారు. ఈ సమా వేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ శేషమ్మ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు దాతల విశేష స్పందన..





**నారాయణపేట జూన్ 12: (స్కైన్యూస్)**నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రతిష్టించనిన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు పట్టణ ప్రము ఖులు, దాతలు ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ సందర్భంగా శక్తిపీఠం వ్యవస్థాపకులు స్వామి శాంతానంద పురోహిత్ గారు రూ. 1,16,000,డాక్టర్ ప్రసాద్ శెట్టి, రూ. 2,16,000, ప్రముఖ న్యాయవాది నందు నామాజీ గారు రూ. 1,16,000 విరాళంగా అందజేశారు. అలాగే డాక్టర్ గావినోళ్ల మధుసూదన్ రెడ్డి తమ వంతు సహాయాన్ని అందించగా, మున్సిపల్ వైస్ చైర్మన్ భర్త జి ఆర్ రెడ్డి నిర్మాణానికి అవసరమైన సంపూర్ణ మెటీరియల్‌తో పాటు రూ. 1,00,000 నగదు సహాయాన్ని ప్రకటించారు. అదేవిధంగా సీనియర్ నాయ కులు నాగరావు నామాజీ ని కలిసి నిర్మాణ కార్యక్రమ పురోగతిపై చర్చించి వారి అమూల్యమైన సూచనలు, సలహాలను కమిటీ సభ్యులు స్వీకరించారు. నారాయణపేటకు గర్వకారణమైన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని అత్యంత త్వరలో ప్రతిష్ఠించేందుకు కృషి చేస్తున్నట్లు కమిటీ సభ్యులు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాతలను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# పాట సమాజపు అంతరంగాన్ని రగల్చే అగ్ని కణం....

**ఎమ్మెల్సీ డాక్టర్ గోరేటి వెంకన్న**

**నాగర్ కర్నూల్ జూన్ 13( స్కైన్యూస్)** పాట అనేది కేవలం అక్షరాల కూర్పు కాదని పాట సమాజ అంతరంగాన్ని రగల్చే అగ్ని కణం అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఎమ్మెల్సీ డాక్టర్ గోరేటి వెంకన్న అన్నారు జిల్లాకు చెందిన కల్వకోలు మద్దిలేటి రచించిన వనమంచు పల్లె పాటల పుస్తకాన్ని సాంస్కృతిక వేదిక రవీంద్రభారతి మినీ సమావేశ మందిరం లో ఆయన ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెటూరి స్వచ్ఛమైన వాతావరణాన్ని మట్టితో ముడిపడిన మనుషుల జీవితాలను శ్రమజీవుల కష్టసుఖాలను కవి రచయిత కల్వకోలు మద్దిలేటి తన పాటల రూపంలో అద్భుతంగా ఆవిష్కరించారని కొనియాడారు. ప్రతి పాటలో సామాజిక దృక్పథం పల్లె సంస్కృతి స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు సమావేశంలో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సమాజ మార్పుకు పాటలే ఆయుధాలని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నుండి నేటి ఆధునిక కాలం వరకు ప్రజలను చైతన్యం చేయడంలో ఉద్యమాలను కాపాడడంలో పాటలే కీలక పాత్ర



పోషించాలని గుర్తు చేశారు. అభ్యుదయ రచయితల సంఘం ఎల్లప్పుడూ పీడిత తాడిత ప్రజల పక్షాన నిలిచి సాహిత్యాన్ని అందిస్తుందని అదే బాటలో మద్దిలేటి పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు సమావేశంలో పలువురు మేధావులు విశిష్ట అతిథులు మాట్లాడుతూ సాహిత్య విలువలను వివిధ కోణాలలో విశ్లేషించారు అరసం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి మాట్లాడుతూ ప్రజాపక్షపాత సాహిత్యాన్ని అర్సం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. సమాజంలో ఆలోచన రేకెత్తిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు ప్రముఖ చలనచిత్ర దర్శకులు బాబ్జి మాట్లాడుతూ పాటలలో దృశ్యమానత భావోద్వేగాలు చలనచిత్ర గీతాలకు ఏమాత్రం తీసుకొని విధంగా ఉన్నాయని అభినందించారు. ప్రజా ధర్నా పొందే అన్ని లక్షణాలు గ్రంథంలో ఉన్నాయని సమాజంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు సామాజిక సమానత్వానికి ఇలాంటి ప్రగతిశీల సాహిత్యం ఎంతో కీలకమన్నారు కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల నరసింహ రాజ్యాంగ రక్షణ రాష్ట్ర అధ్యక్షులు షాన్ రేంజర్ల రాజేష్ పుస్తక సమీక్షకులు ఎదురెపల్లి కాశన్న ప్రజానాట్యమండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శీను రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ ప్రజానాట్యమండలి అధ్యక్షులు పెబ్బేటి విధేయుడు విశ్రాంత ప్రిన్సిపాల్ చింతలపల్లి భాస్కరరావు తెలంగాణ వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య నిలపాడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక గౌరవ అధ్యక్షులు కందికొండ మోహన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి తిరుపాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజారావు విశ్రాంత ఇండస్ట్రియల్ జెడి వెంకయ్య న్యాయవాది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం ప్రిన్సిపాల్

**ఆత్మకూర్ జూన్ 12( స్కై న్యూస్)** ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు మరియు దోస్త్ మూడో విడత నమోదు ప్రక్రియ కొనసాగుతోంది ఆసక్తిగల విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని విద్యార్థులకు సూచన ప్రతి ఒక్కరూ నిరుపేద కుటుంబాలకు డిగ్రీ కళాశాలను ప్రధానాంశంగా ఎంచుకోవాలని ఆయన తెలిపారు ఎంపికైన విద్యార్థులు కళాశాల తరఫున ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు ప్రతి ఒక్కరు చదువుకోవాలి ప్రతి ఒక్కరు కాలేజీకి రావాల్సిందిగా విద్యార్థులను కోరడమైనద చదువు నుంచి ఎంతో ఉపయోగముంది కానీ వ్యర్థమైతే లేదు ఇది విద్యార్థులు గ్రహించవలసిందిగా కోరుతున్నాము ప్రతి ఒక్కరు ఉన్నత చదువులు చదివి అత్యుత్తమ శిఖరాలను అవరోధించడం ఎంతో కృషి చేస్తున్నాంఅన్ని విద్యార్థులకు మున్సిపల్ తెలియజేయడమైనది

## ఘనంగా పిఎసిఎస్ చైర్మన్ కదిరే అశోక్ రెడ్డి జన్మదిన వేడుకలో హైకోర్టు అడ్వకేట్ సరోజ్ రెడ్డి...

**దేవరకద్ర, భూత్పూర్ 12 (స్కై న్యూస్);** భూత్పూర్ మండల పి ఏ సి ఎస్ చైర్మెన్ కదిరె అశోక్ రెడ్డి, మదిగెట్ల గ్రామ బి ఆర్ ఎస్ అధ్యక్షులు కుప్పిరెడ్డి నర్సింహ రెడ్డి,సింగల్ విండో డైరెక్టర్ గడ్డం రాములు, భీమ స్వామి గార్ల జన్మదిన వేడుకలు శుక్రవారం బి ఆర్ ఎస్ భూత్పూర్ కార్యాలయం లో కేకులు కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం శాల్వాలతో హైకోర్టు అడ్వకేట్ మందాడి సరోజ్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ మాట్లాడుతూ జన్మ దిన వేడుకలు బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో జరుపుకోవడం సంతోషంగా ఉంది అన్నారు. వారిని దేవుడు ఆయురారోగ్యాలతో ధన సంపదలతో పిల్లాపాపలతో 100 ఏండ్లు





ఆయురారోగ్యాలతో ఉండాలని దేవాది దేవుని వేడుకుంటున్నాను అన్నారు. వేడుకలకి బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొని మాట్లాడుతూ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు.

## పోలీస్ వాహనాలను ఎల్లప్పుడూ కండిషన్ లో ఉంచుకోవాలి

**ఏం టి ఓ ఆర్ఐ విజయ్ భాస్కర్**



**నారాయణపేట జూన్ 12:( స్కైన్యూస్)** నారాయణపేట సర్కిల్ పరిధిలోని నారాయణపేట టౌన్, నారాయణపేట రూరల్, దామరగిద్ద పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ పెట్రో కార్లు, బ్లూ కోల్ట్స్ వాహనాలను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) విజయ్ భాస్కర్ శుక్రవారం జిల్లా పోలీసు హెడ్ క్వాటర్స్ లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్లలో ఉన్న వాహనాల నిర్వహణ, ఇంజిన్ పనితీరు, బ్రేకులు, టైర్లు, లైట్లు, సైరన్లు, ఇతర భద్రతా పరికరాలను పరిశీలించారు. వాహనాలు ఎల్లప్పుడూ అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండేలా సక్రమంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆర్ఐ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ పోలీస్ వాహనాలు ప్రజల భద్రతకు, శాంతిభద్రతల పరిరక్షణకు కీలకమని తెలిపారు. వాహనాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచడంతో పాటు సాంకేతిక లోపాలు తలెత్తకుండా నిరంతరం తనిఖీలు నిర్వహించాల న్నారు. చిన్నపాటి మరమ్మతులు అవసరమైనా వెంటనే చేయించుకోవాలని, వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. పోలీస్ సిబ్బంది వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఇంధన వినియోగం, వాహనాల పనితీరు, భద్రతా ప్రమాణాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని పేర్కొన్నారు. వాహనాలు ఎల్లప్పుడూ మంచి కండిషన్‌లో ఉంటేనే అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమన్నారు. ఈ తనిఖీలలో సంబంధిత పోలీస్ స్టేషన్ల వాహనాల డ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలతోనే ఉజ్వల భవిష్యత్తు

**కాలనీలలో ఇంటింటి ప్రచారం**

**పాఠశాలప్రధానోపాధ్యాయురాలు జి. లత**

**నాగర్ కర్నూల్ జోన్ 13 (స్కై న్యూస్):**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడం, వంద శాతం ప్రవేశాలు కల్పించడమే లక్ష్యంగా, జిల్లా కేంద్రంలోని పి ఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట ఆఖరి రోజు కార్యక్రమంలో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత నేతృత్వంలో, ఉపాధ్యాయ బృందం స్థానిక కాలనీల్లో విస్తృతంగా పర్యటించి 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఉపాధ్యాయులు కరపత్రాలు, బానర్లతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న అత్యాధునిక వసతులను తల్లిదండ్రులకు వివరించారు. ఘనమైన ఫలితాలే మా ప్రత్యేకత. గడచిన విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని ఉపాధ్యాయులు కాలనీలలోని ప్రజలకు తెలియజేశారు. గత సంవత్సరం మా విద్యార్థులు గరిష్టంగా



549 మార్కులు సాధించారని , అనేకమంది విద్యార్థులు 500 పైచిలుకు మార్కులతో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన ప్రగతి నివేదిక లోని వివరాల ప్రకారం కరపత్రాన్ని ప్రజలకు చూపిస్తూ ప్రవేశాల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన, సుశిక్షితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులచే బోధన. డిజిటల్ క్లాస్ రూములు, కంప్యూటర్ ల్యాబ్, అత్యాధునిక సైన్స్ ల్యాబ్ వసతి. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్ అందజేస్తున్నామని నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనంతో పాటు రాగిజావ, కోడిగుడ్ల అందజేస్తున్నామని. ఎన్.సి.సి (చీజజ), స్కౌట్ ౘ గైడ్, కరాటే, యోగా మరియు క్రీడల్లో ప్రత్యేక శిక్షణను ఇస్తున్నామని **NTSE, NMMS** వంటి ప్రతిభా పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుల బృందంతో పాటు 17. వార్డ్ కౌన్సిలర్ రాజేశ్వరి పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ విద్యార్థుల తల్లిదండ్రులతో కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లత తో పాటు ఉపాధ్యాయులు, తిరుపతయ్య, భాగ్య లక్ష్మి, సత్యనారాయణ రెడ్డి, జహీర్, వెంకటయ్య, సంగీత, సుదర్శన్, శ్రీనివాసులు, పుష్పలత, దేదీప్యశ్రీ, హరుణ్ అహ్మద్, శివకుమార్ మరియు 17 వార్డ్ కౌన్సిలర్ రాజేశ్వరి పాల్గొనీ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# హామీలు అమలు చేయకపోతే నిరవధిక సమ్మె

**సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు**

**నాగర్ కర్నూల్ జూన్12 (స్కై న్యూస్)** ఎన్నికల సమయంలో గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు డిమాండ్ చేశారు శుక్రవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని పెండింగ్ వేతనాలను వెంటనే చేదురించాలని కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 51 సవరించి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు కార్మికుల ఖాతాలో జమ చేయాలని కోరారు. రాష్ట్రంలో 12790 గ్రామపంచాయతీలలో సుమారు 60 వేల మంది కార్మికులు ఉద్యోగులు పనిచేస్తున్నారని గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతూ ప్రజలకు ఎలాంటి అనారోగ్యాలు ఏర్పడకుండా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వం మాత్రం గ్రామపంచాయతీ కార్మికులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పారిశుద్ధ కార్మికులు సంవత్సరాల తరబడి పని





చేసిన వారికి ఉద్యోగ భద్రత లేదని కనీస వేతనాలు చట్టం మమ్ములు కావడం లేదని ఈఎస్ఐ పీఎఫ్ ప్రమాద బీమా లాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా పాలకులు వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు మాత్రం జీవితకాలం పెన్షన్ తీసుకుంటూ ప్రజల ధనాన్ని వేతనం రూపంలో పొందుతున్నారన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్రికేయుల సమావేశంలో రాష్ట్రంలో పనిచేస్తున్న 53,000 మంది గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతినెల 50 కోట్ల రూపాయల వేతనాలు ఒకటో తేదీన చెల్లిస్తున్నామని ప్రకటించారని కానీ వాస్తవంలో కార్మికుల ఖాతాలో జమ కావడం లేదన్నారు. కార్మికులను నిర్లక్ష్యం చేస్తే హాయ్ మొదటి వారం నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి పొదిల రామయ్య జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ నాయక్ కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగరాజు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి లింగస్వామి సహాయ కార్యదర్శి పరిసరాములు నాయకులు రామకృష్ణ బాలస్వామి లింగస్వామి బిక్షపతి యాదయ్య కురుమయ్య వెంకటయ్య కృష్ణయ్య కృష్ణమ్మ వెంకటమ్మ లింగమ్మ లక్ష్మి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు

# అథ్లెటిక్స్ లో పేటకు పతకాల పంట

**నారాయణపేట జూన్ 12: (స్కై న్యూస్)** హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్,జూనియర్ ఉస్మానియా అథ్లెట్స్ మీట్ లో నారాయణపేట క్రీడాకారులు అసమాన ప్రతిభ చూపించి గోల్డు,సిల్వర్,బ్రౌన్ పథకాలను సాధించారు. మెన్స్ విభాగం హార్డిల్స్ లో జనార్ధన్ గోల్డ్ మెడల్ సాధించారని,అండర్ 16 లో పూజ సిల్వర్



మెడల్,బాలరాజు 4వందల హార్డిల్స్ లో బ్రౌన్ పథకాలను సాధించారనీ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమణ తెలిపారు. పథకాలు సాధించిన అథ్లెట్లను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్టాలిన్ సారంగ పాణి,శరద్ కుమార్, వెంకటే శ్వర రెడ్డి,కోచ్ లు జగదీష్, హారికదేవి,మహేష్ తదిత రులు అభినందించారు.

## మైనర్ హిందూ బాలికపై హత్యాచారం దారుణం...



**నాగర్ కర్నూల్ జూన్ 12( స్కై న్యూస్)** ఖమ్మం జిల్లాలో ఈనెల 6న 12 సంవత్సరాల హిందూ బాలికపై మహమ్మద్ గౌస్ జరిపిన హత్యాచార హత్యాయత్నం అత్యంత దారుణమని విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు శివయ్య గౌడ్ కార్యదర్శి బాలస్వామి కోశాధికారి మిడిదొడ్డి చంద్రశేఖర్ మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందువులపై దాడులు జరుగుతున్న కఠిన శిక్షలు వేయడంలో విఫలం చెందడం వల్ల ఇటువంటి దారుణాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ప్రభుత్వం వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలపై బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు ఇతర నేరాల విషయంలో బాధితులకు త్వరితగతిన శిక్షపడేలా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళల భద్రతా విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మత తీవ్రవాదులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి 10 లక్షల పరిహారం చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని మహమ్మద్ గౌస్ ను ఉరితీయాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర శర్మ ప్రభాకర్ రెడ్డి బుచ్చన్న కండే సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు

## సెర్ప్ మెగ్నరెగ్స్ సిబ్బందికి హెల్త్ క్యాంప్ వైద్య పరీక్షలు

**పాల్గొన్న హెల్త్ క్యాంపును జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీమతి ఎమ్ .విద్యాచందన**



**కొత్తగూడెం జూన్ 12( స్కై న్యూస్):**గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య దేవరాజన్ ఐఏఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఐ డి ఓ సి సమావేశ మందిరంలో జిల్లాలో పనిచేస్తున్న సెర్ప్ , మెగ్నరెగ్స్ సిబ్బందికి ఎరిక్సన్ ఇన్సూరెన్స్ టి ఏ పి ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారు సౌజన్యంతో హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ హెల్త్ క్యాంపును జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీమతి ఎమ్ .విద్యాచందన పరిశీలించి, సెర్ప్ , మెగ్నరెగ్స్ లలో పనిచేస్తున్న సిబ్బంది అందరూ 40 సంవత్సరాలు పైబడిన వారే కావడం వలన ఇటువంటి హెల్త్ క్యాంపులు వారికి ఎంతగానో ఉపయోగపడతాయని, దైనందిన పని ఒత్తిడిలో సిబ్బందికి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి సంవత్సరం ఇటువంటి హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. ఈ యొక్క హెల్త్ క్యాంపు నందు 106 మంది సెర్ప్ సిబ్బంది 96 మంది ఈజీఎస్డ ఇతర శాఖల సిబ్బంది మొత్తం 202 మందికి ఈ క్రింది వైద్య పరీక్షలు నిర్వహించారు. 1) బిపి,2) షుగర్, 3) క్యాల్షియం టెస్ట్, 4) కొలెస్ట్రాల్ టెస్ట్, 5) లిపిడ్ (ప్రొఫైల్7) 2 డీ ఎకో కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించారు. 6) ఈసీజీ ,ఈ హెల్త్ క్యాంపులను యశోద హాస్పిటల్, మలక్ పేట్, హైదరాబాద్ పాత్ కైండ్ (పాథకైండ్ లాబోరేటరీస్ హైదరబాద్ శరత్ మాక్స్ విజన్ వరంగల్ వారి సహకారంతో ఎరిక్సన్ ఇన్సూరెన్స్ టీపీఏ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారు నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపు నందు మొత్తం 202 మంది ఉద్యోగులు హాజరై పరీక్షలు చేయించుకోవడమైనది.

## ఐక్యత సేవా రంగంలో కృషి చేస్తా...

**తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి ఆకుతోట బంగారయ్య**




**నాగర్ కర్నూల్ జూన్ 12 (స్కై న్యూస్)** ఆర్యవైశ్యుల ఐక్యతకు పేద ఆర్యవైశ్యులకు న్యాయ సలహాలు అందించడంతోపాటు సేవా రంగంలో నిరంతరం కృషి చేస్తూ తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ పటిష్టానికి తన వంతు కృషి చేస్తానని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి ఆకుతోట బంగారయ్య అన్నారు. హైదరాబాదులోని కార్యాలయంలో కార్యదర్శిగా నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ఆయనకు అందించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పేద ఆర్యవైశ్యులకు ఆర్థిక సహాయం అందించడంతోపాటు న్యాయవాదిగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో పనిచేస్తూ వివిధ సేవా కార్యక్రమంలో పాల్గొంటూ వాసవి కన్యకా పరమేశ్వరి కరుణాకటాక్షాలతో పనిచేస్తున్నానని వివరించారు. మహాసభ తనపై ఎంతో బాధ్యతతో కార్యదర్శిగా నియామకం చేయడం జరిగిందని తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్యుల సమస్యలపై పని చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు

## అధిక మాసమును పురస్కరించుకుని శక్తి పీఠంలో విశేష భజన కార్యక్రమము



**నారాయణపేట జూన్ 12 (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని స్థానిక సంత్ మఠ మూల మహా సంస్థానము , శక్తి పీఠంలో అధిక మాసమును పురస్కరించుకుని శుక్రవారము విశేష భజన కార్యక్రమమును నిర్వహించారు. శక్తి పీఠం ఆవరణలోని



స్వామి శాంతానంద సభా మండపంలో లక్ష్మీ శోభానా భజన మండళి మహిళల దాస సంకీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అధిక మాస విశేష భజనలో పాల్గొన్న మహిళామూర్తులందరికీ కాళ్ళకు పసుపు పారాణి రాసి , పసుపు కుంకుమలను సమర్పించారు. తదనంతరం శక్తి పీఠం అమ్మవారి చిత్రపటమును మరియు శక్తి పీఠం డైరీని మహిళందరికీ అందించి సత్కరించారు. సనాతన ధర్మ పరిరక్షణ కొరకు , హిందూ సంస్కృతీ సాంప్రదాయాలను భావి తరాలకు అందించుటకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయని శక్తి పీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డాక్టర్ స్వామి శాంతానంద గారు అభిప్రాయపడ్డారు. ఇట్టి కార్యక్రమములో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అతి త్వరలో యథావిధిగా
# సింగరేణి మెడికల్ బోర్డు

**మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలి**

**అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు చేపట్టాలి**

**సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశం**

**శనివారం (రేపు) మంచిర్యాలలో 335 మంది వారసులకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడి**

**సింగరేణి జూన్ 12( స్కై న్యూస్):**కార్మికులకు శుభవార్త. సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు. ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో శనివారం (ఈ నెల 13వ తేదీ) జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు.. ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా




తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి...అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్సటర్నల్ పోస్టులు ఉండగా... 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు. కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ. 1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదే కాకుండా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ. 10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామన్నారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా కార్మికులకు లాభాల వాటాను చెల్లించామని తెలియజేశారు. గత రెండేళ్లలో రూ. 1500 కోట్లను లాభాల వాటా రూపేనా చెల్లించినట్లు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా



సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్ను చెల్లిస్తున్నామని, 2023-24లో ఒక్కొక్కరికీ రూ. 5,000 చొప్పున, 2024-25లో రూ. 5,500 చొప్పున లాభాల బోనస్ను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణిలో ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ చేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా గోదావరిఖని లో క్యాథ్ ల్యాబ్ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ. 300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత మరియు వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాక్లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తుచేశారు. రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే పోటీ మార్కెట్లో సింగరేణి నిల దొక్కుకోవాలంటే ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జోగులాంబ గద్వాల, జూన్ 12(స్కై న్యూస్):**లిబెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు డిప్ విధానంలో విద్యార్థుల ఎంపిక అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పిస్తుందని, ఎంపికైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకునేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను లక్కీ డిప్ విధానంలో కలెక్టర్ ఎంపిక చేశారు. నాన్ రెసిడెన్షియల్ ఒకటవ తరగతిలో ప్రవేశాలకు మొత్తం 57 సీట్లు ఉండగా, మొత్తం 265 మంది దరఖాస్తు చేసుకోగా గ్రూప్ 1, 2, 3లకు




సంబంధించి మహిళా రిజర్వేషన్స్, జనరల్ కోటాలో నిబంధనల ప్రకారం డిప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. రెసిడెన్షియల్ ఐదవ తరగతిలో ప్రవేశాలకు మొత్తం 59 సీట్లు ఉండగా గ్రూప్ 1, 2, 3లకు సంబంధించి మొత్తం 310 మంది దరఖాస్తు చేసుకోవడంతో అర్హులైన వారిలో నుంచి డిప్ విధానంలో విద్యార్థులను ఎంపిక చేశారు. వివిధ గ్రూపులకు సంబంధించి వెయిటింగ్ లిస్టు ప్రాతిపదికన కొంతమంది విద్యార్థులను కూడా డిప్ విధానంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంపికైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, ఏఎస్డబ్ల్యూఓ నాగరాజు, సెక్టోరియల్ అధికారి కర్రెప్ప, బీచుపల్లి గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ రామాంజనేయులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన బీఎస్పీని బలోపేతం చేయాలి

**ఎస్ ఐ ఆర్ పై ప్రజలను అప్రమత్తం చేయాలి**

**4వ జోన్ ఇంచార్జ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామకృష్ణ**

**వనపర్తి జూన్ 12 (స్కై న్యూస్)** నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ దళిత బడుగు బలహీన వర్గాల చైతన్యం కోసం కృషి చేస్తున్న బహుజన సమాజ్ పార్టీని గ్రామ గ్రామాన గడపగడపలో బలోపేతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాలుగవ జోన్ ముఖ్య ఇంచార్జ్ శ్రీరామ్ కృష్ణ కోరారు శుక్రవారం నాగర్ కర్నూల్ పార్లమెంటు స్థాయి సమావేశానికి జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో బలంగా పనిచేస్తూ అన్ని కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. మండల అసెంబ్లీ కమిటీలు పటిష్టమైన నిర్మాణం కలిగి ఉండాలని పార్టీకి కమిటీలే పట్టుకొమ్మలని స్పష్టం చేశారు కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఓటర్ లిస్ట్ లను ఎస్ ఐ ఆర్ పేరుతో ఇక



ఒక పెడుతున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విరోచిత పోరాటం చేసి దేశ ప్రజలకు రాజ్యాంగంలో ఓటు హక్కును ఆయుధంగా ఇచ్చారని అలాంటి ఓటు హక్కును పేదల నుండి లాక్కునేందుకు ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా పార్లమెంటు ఇన్చార్జులు యోసఫ్ బండి పృథ్వీరాజ్ పార్లమెంటు ఇన్చార్జులు ఎల్ల స్వామి కళ్యాణ్



మాస్ అన్న వివిధ జిల్లాల అధ్యక్షులు బోనాశ్రీ రామచందర్ మణికుమార్ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్ అసెంబ్లీ అధ్యక్షులు రాజు ప్రధాన కార్యదర్శి రాంబాబు నాయకులు అంజి యాదవ్ అశోక్ శ్రీను కార్తీక్ హుస్సేన్ యాదగిరి లతోపాటు పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల అధ్యక్షులు కార్యవర్గ నాయకులు పాల్గొన్నారు

## ఐ డి ఓ సి నీ పరిశీలించిన మంత్రి శ్రీహరి


**నారాయణపేట జూన్ 12:** నారాయణ పేట జిల్లా కేంద్రం లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐ డి ఓ సి ) పనులను రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవ ర్ధక ,మత్స్య, యువ జన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ ప్రియాంక తో కలిసి భవనం మొత్తం తిరిగి నిర్మాణ వివరాలను అడిగి తెలుసు కున్నారు. బిల్డింగ్ లోని మీటింగ్ హాల్, మంత్రి ఛాంబర్, కలెక్టర్ ఛాంబర్ ను పరిశీలించి తగు సూచనలు



చేశారు. కలెక్టరేట్ బిల్డింగ్ ప్రాంగణంలోనే హెలిపాడ్ ను ఏర్పాటు చేయవలసిందిగా అధికారులకు సూచన చేశా రు. ఈ ఏడాది పంద్రాగస్టు వరకు భవన నిర్మాణం పూర్తి అయ్యి ఐ డి ఓ సి ని అందు బాటులోకి తేవాలని అధికా రులను ఆదేశించారు. చివ రగా నూతన కలెక్టరేట్ సమీపంలోనే జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఇచ్చిన 7 ఎకరాల ప్రభుత్వ స్థలం గురించి డీఎస్పీ లింగయ్య తో మంత్రి ఆరా తీశారు. అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణపై కరువు పంజా తప్పదా?

భూతాపం కారణంగా రుతుపవనాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఎప్పుడు వస్తాయో, ఎలా మారుతాయో చెప్పలేని అస్థిరతలను కలిగి ఉంటున్నాయి. పదేండ్లపాటు సాగిన ఇండో-జర్మన్ నిపుణుల అధ్యయనం ఇదే విషయాన్ని స్పష్టంచేసింది. రుతుపవనాల రాక, ప్రభావం గురించి అంచనా వేయగలిగితే తగిన జాగ్రత్తలు పాటించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు, అధికారులు, ప్రజలు, రైతులు సన్నద్ధంగా ఉంటారు. కానీ ఎప్పుడు ఎలా వస్తాయో తెలియకుండా ముందస్తుగా అంచనా వేయడానికి వీలు లేకుండా రుతుపవనాలు ముంచుకొస్తున్నాయి. ఇదంతటికీ కారణం భూతాపం అని అధ్యయనంలో నిపుణులు స్పష్టంచేశారు. కాబట్టి రుతుపవనాల ఆరంభం, ముగింపు పట్ల ఉన్న అభిప్రాయాలను మార్చుకోవాల్సిన అవసరమున్నది. ప్రస్తుతం ఎల్ నినో కరువు పరిస్థితులు పొంచి ఉన్న నేపథ్యంలో అప్రమత్తత చాలా అవసరం. వాతావరణ అధ్యయనంలో సాధారణంగా రెండు ప్రధానమైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఒకటి అధిక వర్షాలు కురిసిన రోజుల సంఖ్య, రెండోది అధిక ఎండలు ఉన్న రోజుల సంఖ్య. ఇవే రెండు అంశాల ప్రాతిపదికన జరిగిన ఇండో-జర్మన్ అధ్యయనంలో నిపుణులు ఆసక్తికరమైన అంశాలను గుర్తించారు. రోజుకు 80 మిల్లీ మీటర్లకు పైగా కురిసే అత్యంత భారీ వర్షాలు ప్రస్తుతం రెండేండ్లకు ఓసారి కురుస్తున్నాయని అధ్యయనంలో తేలింది. కర్బన ఉద్గారాలు ఎలా ఉన్నప్పటికీ ఇలాంటి భారీ వర్షాలు 2050 నాటికి 60 శాతం వరకు పెరిగే అవకాశం ఉన్నదని వెల్లడయింది. ఇలాంటిది భారీ వర్షాలే వరదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అదే విధంగా అత్యంత ఉష్ణోగ్రతలు కలిగిన రోజుల సంఖ్య కూడా గణనీయంగా పెరగనున్నది. ప్రజల ఆరోగ్యాలపై ఎండలు ప్రతికూల ప్రభావం చూపుతా యి. ప్రమాదాలు జరగడం, కార్మికుల పనితీరు తగ్గిపోవడం కూడా కనిపిస్తుంది. ప్రస్తుతం ఉన్న సగటు తో పోల్చితే కర్బన ఉద్గారాల పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ 2050 నాటికి ఏడాదిలో 20 రోజులు, 2100 నాటికి 40 రోజులు తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నదని అధ్యయనం హెచ్చరిస్తున్నది.



మరోవైపు ఈ ఏడాది ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడుతున్నట్టు ఇప్పటికే స్పష్టమవుతున్నది. భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్రం వేగంగా వేడెక్కడం వల్ల రుతుపవనాల వ్యవస్థ బలహీనపడుతున్నది. మరోవైపు హిందూ మహాసముద్రంలోని తూర్పు, పడమర ఉష్ణధ్రువాలు తటస్థ దశలో ఉండటంతో రుతుపవనాలకు అదనపు తేమ అందించే పరిస్థితి కనిపించడంలేదు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రుతుపవనాల ప్రవేశం ఆలస్యమైంది. దీంతో ఎల్ నినో ఏర్పడనున్నట్టు తెలుస్తున్నది. తెలంగాణపై ఎల్ నినో తీవ్రమైన ప్రభావాలను చూపే అవకాశం ఉన్నది. ఇది కరువు పరిస్థితులను తీవ్రం చేయడంతోపాటు వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇండో-జర్మన్ అధ్యయనంతోపాటు, భారత వాతావరణ విభాగం అంచనాలను గమనిస్తే ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత స్థాయిలో అత్యంత సవాళ్లు ఎదురుకానున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు నాలుగు రోజులు ఆలస్యంగా జూన్ 8, 9 తేదీలలో జోగుళాంబ గద్వాల జిల్లా మీదుగా తెలంగాణలోకి ప్రవేశించాయి. కానీ ఇవి బలహీనంగానే ఉన్నాయి. జూన్, జూలైలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎల్‌నినో ప్రభావం బలపడి, వర్షపాతం భారీగా తగ్గిపోతుందని తెలుస్తున్నది.

ఎల్ నినో ప్రభావం తెలంగాణలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలపై అధికంగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. హైదరాబాద్ సహా మధ్య తెలంగాణ ప్రాంతంలో మాత్రమే సగటు వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. అలాగే, వర్షాలు స్థిరంగా పడకుండా తక్కువ సమయంలో భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసి, ఆ తర్వాత వారాల తరబడి ఎండలు కొనసాగే పరిస్థితి ఏర్పడవచ్చు.

సాధారణంగా రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత ఎండలు తగ్గుతాయి. కానీ ఈ సారి ఎల్ నినో ప్రభావం వల్ల రుతుపవనాల ప్రవేశం తర్వాత కూడా చాలా ప్రాంతాల్లో వడగాలులు, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ఇది ప్రజారోగ్యంతోపాటు వ్యవసాయ కార్యకలాపాలపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉన్నది. సాధారణంగా ఎగువ రాష్ట్రాల నుంచి కృష్ణా, గోదావరి నదుల్లోకి వచ్చే వరదపై తెలంగాణ నీటి అవసరాలు ఆధారపడి ఉంటాయి. కానీ కర్నాటక, మహారాష్ట్రల్లో కూడా కరువు పరిస్థితులే నెలకొనడంతో జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహాలు నిలిచిపోవడం, తగ్గిపోవడం వంటివి జరుగుతాయి. ఫలితంగా తెలంగాణలో నీటి ఎద్దడి సమస్య ఎదురవుతుంది. పట్టణాలు, నగరాలకు తాగునీటి సరఫరాకు కూడా కటకట తప్పదు. మరోవైపు ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం కరువు హెచ్చరికలను జారీ చేసింది.

అధిక నీరు అవసరమయ్యే వరి సాగును తగ్గించుకోవాలని రైతులకు సూచించింది. కాలువల ద్వారా సాగు నీరు అందే ప్రాంతాల్లో మాత్రమే వరి వేయాలని చెప్పింది. తక్కువ కాలంలో, తక్కువ నీరు అవసరమయ్యే, కరువును తట్టుకొనే పప్పు ధాన్యాలు, నూనె గింజలు, సోయాబీన్, పత్తి వంటి పంటల సాగు వైపు రైతులు మళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం వానకాలం పంటలపైనే కాదు, యాసంగి సాగుపై కూడా ప్రభావం చూపే అవకాశమున్నది. వర్షాకాలం ముగిసే సమయానికి జలాశయాల్లో నీటిని నిల్వలు తగ్గిపోతే చలికాలం నాటికి పంటలకు అవసరమయ్యే నీటి సమకూర్చడం కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో కరువును ఎదుర్కోవడంలో కాళేశ్వరం ప్రాజెక్టు కీలక పాత్ర పోషించగలదని నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. గోదావరి జలాలను జలాశయాలు, చెరువుల్లోకి తరలించడం ద్వారా వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన సంవత్సరాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చేలా కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించారు. కానీ మరమ్మతుల ఆలస్యం కారణంగా ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యాన్ని ప్రభుత్వం వినియోగించలేకపోతున్నది. ప్రస్తుతం తెలంగాణపై ఎల్ నినో కరువు కోరలు చాచిన నేపథ్యంలో కాళేశ్వరం మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, వ్యవసాయరంగానికి భరోసా కల్పించాల్సిన అవసరమున్నది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా భవిష్యత్తులో వర్షాలను అంచనా వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ముందస్తుగా తీసుకోవాల్సిన సరైన జాగ్రత్తలపై కూడా స్పష్టత ఉండదు. గ్రామాల్లో రైతులు ఎలాంటి ఏర్పాట్లు చేసుకోవాలి, పట్టణ ప్రాంతాల్లోని పరిశ్రమలు, సంస్థలు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనేది అంతుపట్టదు. అంతుపట్టని వాతావరణం, కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. రైతులకు సరైన సమయంలో సూచనలు అందించాలి. సాగునీటి నిర్వహణ, పెట్టుబడి సాయం పథకాలను సక్రమంగా అమలు చేయాలి. పంట కొనుగోలు విధానాలు, ఆహారభద్రత పథకాలను మెరుగుపర్చాలి. ఇవే వ్యవసాయరంగ భవిష్యత్తును నిర్ణయించే కీలక అంశాలుగా మారనున్నాయి.

# అస్తిత్వ భావన బలపడితే కుట్రలకు చెక్!

మాకియవెల్లి అనే ప్రముఖ ఇటాలియన్ రచయిత దుర్మార్గపు సిద్ధాంతం ప్రకారం-'చెరువులో నిశ్శబ్దంగా ఉన్న నీటిని పైకి, కిందికి కదిలిస్తే, అందులో ఉన్న చేపలు భయంతో దిక్కుతోచక ఉపరితలానికి వస్తాయి. అప్పుడు జాలరి ఎలాంటి శ్రమ లేకుండా వాటిని తన వలలో వేసుకోవచ్చు'. ప్రస్తుత తెలంగాణ రాజకీయ దృశ్యాన్ని ఈ కోణం నుంచి చూసే..ఇక్కడ చెరువు-తెలంగాణ సమాజం అయితే, నీటిని కల్లోలపరుస్తున్నది-చంద్రబాబు, పవన్ కల్యాణ్, వారికి లోపాయికారిగా సహకరిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. చేపలు-తెలంగాణ ప్రజలు, అస్తిత్వం, రాజకీయ చైతన్యం. తెలంగాణ ప్రభుత్వ అప్పులు మాకియవెల్లి తన 'ది ప్రిన్స్' గ్రంథంలో చెప్పిన అత్యంత దుర్మార్గపు నియమం ఏంటంటే, ఒక సామ్రాజ్యాన్ని శాశ్వతంగా లొంగదీసుకోవాలంటే అక్కడి ప్రజల ఉమ్మడి చైతన్యాన్ని, సంస్కృతిని ముందుగా విచ్ఛిన్నం చేయాలి. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ద్వయం సరిగ్గా ఇదే సూత్రాన్ని అమలు చేస్తున్నది. హైదరాబాద్‌లో తాము అక్రమంగా సంపాదించిన వేల కోట్ల రూపాయల విలువైన ల్యాండ్ బ్యాంకులు, రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాలను కాపాడుకోవటం, రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాకుండా చూడటం. అదేవిధంగా తెలంగాణ ప్రాంతంలో శాంతిని విచ్ఛిన్నం చేసి అస్థిరపరచటం లాంటి లక్ష్యం కావచ్చు. కేసీఆర్ వస్తే తమ అక్రమాస్తుల పునాదులు కదులుతాయని భయపడే ఈ ఆంధ్రా శక్తులు, తెలంగాణ రాజకీయ క్షేత్రంలో రెచ్చగొట్టే సన్నివేశాలను సృష్టిస్తూ, కుల, వర్గ విభేదాల పేరిట, విగ్రహాల పేరిట, పదం లేదని..ఇలా ఎన్నో రూపాల్లో సాంస్కృతిక దాడులు.. నిరంతరం అలజడి సృష్టిస్తూనే ఉన్నారు.హైదరాబాద్ వార్తలు మాకియవెల్లి సిద్ధాంతం ప్రకారం..ఒక బలహీనమైన పాలకుడు తన ఉనికిని కాపాడుకోవటానికి శత్రువులతోనైనా చేతులు కలుపుతాడు. ఇపుడు గుంపు మేస్త్రీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవటానికి, ప్రజల దృష్టిని మళ్లించటానికి ఈ ఆంధ్రా శక్తులు సృష్టిస్తున్న కృత్రిమ అలజడిని ఒక సాధనంగా వాడుకుంటున్నాడు. కానీ ఆయన గమనించని విషయం ఏమిటంటే..ఈ చెరువు పూర్తిగా కల్లోలమైతే నష్టపోయేది తెలంగాణ సమాజమే. బహుశా తెలిసే ఆయన చేస్తూ ఉండవచ్చు.



ఈ శక్తుల అంతిమ వ్యూహం కేవలం రాజకీయ లబ్ధి మాత్రమే కాదు; హైదరాబాద్‌ను ఒక కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలనే వ్యూహం కూడా ఉండవచ్చని పలువురు తెలంగాణవాదుల వాదన. ఒకవేళ హైదరాబాద్ కేంద్ర పరిధిలోకి వెళ్తే, ఇక్కడి చట్టాలు మారిపోతాయి, స్థానిక ప్రభుత్వాల అధికారం పోతుంది. అప్పుడు తాము చేసిన భూదందాలు శాశ్వతంగా సురక్షితంగా ఉంటాయని ఈ జాలర్లు లెక్కలు వేసుకుంటున్నారు. వారు విసురుతున్న వల కేవలం హైదరాబాద్ మీదనే కాదు, తెలంగాణ ప్రజా చైతన్యంపై, దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణ అస్తిత్వం మీద. ఇక్కడి ప్రజల రాజకీయ అవగాహనను గందరగోళంలో ముంచి, వారిని మానసికంగా బలహీనపరచటమే ఈ ఆటలోని పెద్ద చేప దురుద్దేశం. ఎప్పుడైతే ప్రజలు తమ హక్కులను మరిచి ఈ కృత్రిమ వివాదాల వలలో చిక్కుకుపోతారో, అప్పుడు ఈ శక్తులు అనుకున్న కుట్రలు సులభమ వుతాయి. తెలంగాణ ప్రజలు ఈ మాకియవెల్లి కుతంత్రాలను గుర్తించి, ఆ వలలో చిక్కకుండా తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన తరుణమిది. మొదటిది: ఎరను చూసి లొంగిపోవద్దుడజాలరి విజయం చేపల ఆవేశం మీదనే ఆధారపడి ఉంటుంది. ఈ శక్తులు కల్పిస్తున్న తీవ్ర వివాదాలు తెరపైకి వచ్చినపుడల్లా ప్రజలు ఎమోషనల్ కాకుండా ప్రశాంతంగా ఉండాలి. ఆ వివాదాలన్నీ హైదరాబాద్ మీద కుట్ర నుంచి, వారి అక్రమ భూసామ్రాజ్యాల రక్షణ నుంచి ప్రజల దృష్టిని మళ్లించటానికి వేసిన కృత్రిమ ఎరలు అని గుర్తించటమే మొదటి విజయం. ప్రజలు స్పందించటం మానేస్తే, జాలరి ఆట సాగదు.

రెండవది: బురద నీటిని నిజాలతో శుభ్రం చేయటండ నీటిని కల్లోలపరిచినప్పుడు అపోహలు, అబద్ధాలు తొందరగా వ్యాపిస్తాయి. దీనికి విరుగుడు 'నిజాల వెల్లడి'. తెలంగాణలోని అపారమైన రాజకీయ చైతన్యం ఉన్న యువత, సామాజిక మాధ్యమాలు, మేధావులు ప్రతి ఒక వివాదం వెనుక ఉన్న ఆర్థిక, భూసంబంధిత ప్రయోజనాలను విశ్లేషించి ప్రజల ముందు పెడుతూనే ఉండాలి. సంయమనం కోల్పోకుండా రాజకీయ డ్రామాలను, హైదరాబాద్‌లోని ల్యాండ్ బ్యాంకుల రక్షణ ప్రణాళికలను ఆధారాలతో సహా బట్టబయలు చేయటం ద్వారా ఆ బురద నీటిని మళ్లీ స్వచ్ఛంగా మార్చవచ్చు.

మూడవది: 'తెలంగాణ అస్తిత్వాన్ని' రక్షణ కవచంగా మార్చుకోవటం... మాకియవెల్లి సిద్ధాంతం ప్రకారం చేపలను విడివిడి గుంపులుగా విడగొడితేనే వల వేయటం సులువవుతుంది. ఇక్కడి ప్రజలను కూడా కులాలు, పార్టీల పేరుతో విడగొట్టాలని చూస్తున్నారు. దీనికి విరుగుడు- మనమంతా ఒక్కటే అనే 'తెలంగాణ అస్తిత్వ' భావనను బలంగా పట్టుకుని ఉండటం. ఏ సమస్య ఎదురైనా 'దీనివల్ల తెలంగాణ సార్వభౌమత్వానికి, ఇక్కడి ప్రజలకు లాభమా? నష్టమా?' అనే ఒక్క కోణం నుంచి ఆలోచిస్తే, శత్రువులు విసిరే విభజిత వలలు ముక్కలైపోతాయి.

చివరిగా: అసలైన సమస్యలపై పాలకులను నిలదీయాలి. ప్రభుత్వం ఆంధ్రా శక్తుల నాటకాలకు సహకరిస్తే.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తామనే హెచ్చరికను పంపాలి. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ మళ్లీ రావటం ఖాయమనే ఆ శక్తులకు తెలిసిందే. చెరువులో చేపలన్నీ ఆందోళన, భయం లేకుండా, ఏకతాటిపై ఉండి, వలను స్పష్టంగా చూడగలిగితే..ఆ జాలరి ఎంత ప్రయత్నించినా ఒక్క చేపను కూడా పట్టలేడు. తెలంగాణ సమాజం తన చారిత్రక చైతన్యంతో నిశ్శబ్దంగా ఉంటూనే ఈ కుట్రను గమనిస్తే, ఆ జాలర్లు తమ వలలను సర్దుకుని ఖాళీ చేతులతో వెనుతిరగక తప్పదు.

# కూలీల సమస్యలను పరిష్కరిస్తా.....

## గ్రామ దేవతలకు పూజలతో సుఖ సంతోషాలు

## ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ జూన్ 12 (స్కైన్యూస్)** జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తెలిపారు శుక్రవారం నియోజకవర్గంలోని సల్కర్ పేట గ్రామంలో పనిచేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు భద్రతా కార్డులు అందడం లేదని చెల్లింపులు జాప్యం జరుగుతున్నాయని అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేయడం జరుగుతుందని కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జాబ్ కార్డులలో పేర్ల నమోదు డబ్బుల చెల్లింపు తో పాటు పని ప్రదేశంలో కూలీలకు కల్పించవలసిన మౌలిక వసతులను కల్పించేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన శ్రీ వీరనాగమ్మ . ఎల్లమ్మ దేవతల వార్షిక పండగ పూజలకు ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలకు పూజలతో ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించడంతోపాటు గ్రామ సుభిక్షంగా ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయాలు ఆచారాలు మరియు సంస్కృతిని పరిరక్షించడంలో జాతరలు వార్షిక పూజలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు కూలీలు పాల్గొన్నారు



# షాద్‌నగర్‌లో నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం

## లాల్‌సింగ్ తండాలో 22 కిలోల పట్టివేత

## ప్రధాన సూత్రధారి పరారీలో



**రంగారెడ్డి జిల్లా, జూన్ 12 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూక్‌నగర్ మండలం లాల్‌సింగ్ తండాలో పోలీసులు, ఎస్‌వోటీ బృందం, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో 22 కిలోల నిషేధిత పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు విశ్వసనీయ సమాచారం మేరకు లాల్‌సింగ్ తండాకు చెందిన పాత్లావత్ కవిత ఇంట్లో అధికారులు తనిఖీలు నిర్వహించగా నిషేధిత పత్తి విత్తనాలు లభించాయి సమాచారం అందుకున్న చౌదరిగూడ వ్యవసాయ శాఖ అధికారి రాజేందర్ రెడ్డి, షాద్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు ప్రాథమిక విచారణలో కొందుర్గు మండలం పాత ఆగిర్యాల గ్రామానికి చెందిన రాజేశ్వరి ఈ విత్తనాలను కవిత వద్ద నిల్వ ఉంచినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం ఘటనకు సంబంధించి ప్రధాన సూత్రధారి పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు షాద్‌నగర్ సీఐ సీతారాం వెల్లడించారు నిషేధిత విత్తనాల విక్రయం, నిల్వలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు హెచ్చరించారు.



# సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్..

# 24 నెలలు 24 మోసాలు..

## అప్పులు ఫుల్ అభివృద్ధి నిల్.. ప్రచారం పీక్స్ పరిపాలన వీక్

## రెండేళ్లలో కూటమి ప్రభుత్వం సాధించిన ఘనత ఇదే.

## వైఎస్ షర్మిల

**విజయవాడ:**కూటమి పాలనంతా మాయాబజార్.. మోసాలమయం. విజన్ లేదు విజ్ఞం అంతకన్నా లేదు. బాబు షూరిటీ లేదు.. భవిష్యత్ కి గ్యారెంటి లేదు. పునర్ నిర్మాణం జరగలేదు..పునరంకితానికి దిక్కులేదని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. ఎదే ఉద్ధరిస్తారని అధికారమిస్తే రాష్ట్ర ప్రజలకు పెట్టినవి పెద్ద పంగనామాలు. కూటమి ఇచ్చిన హామీలు గంపెడు.. అమలు చేసింది చిటికెడు. అబద్ధపు మాటలు చెప్పి, మ్యానిఫెస్టోపై మాట తప్పి, స్వర్ణాంధ్ర సాధన జరిగిందని, సుపరిపాలన సాగుతోందని, అభివృద్ధి, సంక్షేమం పేరిట ..విజయోత్సవ సభలు పెట్టడానికి కూటమి పార్టీలకు సిగ్గుండాలి. నిజాలు దాచి అబద్ధాలు ప్రచారం చేయడమంటే నైతికతకు నీళ్లు వదిలేయడమేనని అన్నారు.రెండేళ్లుగా ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదు. నెలకు 15 వందలు ఇస్తామని చెప్పిన మహిళాశక్తి పథకానికి దిక్కులేదు. 20 లక్షల ఉద్యోగాల జాడలేదు.. లేకుంటే ఇస్తామని చెప్పిన 3 వేల నిరుద్యోగ భృతికి గతి లేదు. మూడు సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి అంతా సగం సగమే. సూపర్ సిక్స్ ను సూపర్ ఫ్లాప్ చేసి, సూపర్ హిట్ అని చెప్పుకోవడం చంద్రబాబు గారికే సాధ్యం. చేసిన వాగ్దానాలను విలువలేదు . మ్యానిఫెస్టో 143 హామీల అమలుకు అతి గతి లేదు. మెగా డీఎస్సీ దగా డీఎస్సీ చేసి, జాబ్ క్యాలెండర్ ను జాబులు లేని క్యాలెండర్ గా మార్చారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఉన్న పెన్షన్లనే ఊడపీకారు. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామని మోసం చేశారు. పేదలకు రెండు లేదా మూడు సెంట్ల భూమి ఇస్తామని మాట తప్పారు. పక్కా ఇండ్లు కట్టిస్తామన్న హామీని తుంగలో తొక్కారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమాన్ని అటకెక్కించారు. కౌలురైతులకు కౌలు కార్డులు దిక్కులేదు. ధరల స్థిరీకరణ అమలు జరగలేదు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, పరికరాలు అందలేదు. చివరికి రైతు పండించిన పంట నేలపాలైతే పరిహారం ఇవ్వ చేతకాలేదని విమర్శించారు. జీవనాడి పోలవరం పూర్తికాలేదు.

## బిజినెస్

# చివరి గంటలో కొనుగోళ్ల జోరు..



గడిచిన రెండు సెషన్లుగా ఇన్వెస్టర్లను కలవరపెట్టిన నష్టాల పరంపరకు మంగళవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో పాటు దేశీయంగా బ్యాంకింగ్ రంగంలో వ్యూహాత్మక కొనుగోళ్లు మార్కెట్లకు ఊరటనిచ్చాయి. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ (దీూజు నావఅంవఞ) 394 పాయింట్లు పుంజుకొని 73,918.76 మార్కు వద్ద స్థిరపడింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ (చీూజు చీఱట్ఎ 50) కూడా 119 పాయింట్లు లాభపడి 23,242.10 వద్ద ముగిసింది. మధ్యాహ్నం సమయంలో కొంత లాభాల స్వీకరణ జరిగినప్పటికీ చివరి గంటలో కొనుగోలుదారులు ఆసక్తి చూపడంతో సూచీలు తిరిగి పుంజుకున్నాయి.

**మార్కెట్ జోష్‌కు దారితీసిన కారణాలు**

నేటి మార్కెట్ గమనాన్ని విశ్లేషిస్తే ఈ రికవరీకి ప్రధానంగా కొన్ని అంశాలు దోహదపడ్డాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అందులో..

**ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల తగ్గింపు**

పశ్చిమాసియాలో కొన్ని రోజులుగా తీవ్ర రూపం దాల్చిన ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణలు సద్దుమణుగుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఇరు దేశాలు పరస్పర దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లలో భయాలను తొలగించింది.

క్రూడాయిల్ ధరలు

అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర సుమారు 0.71% తగ్గి బ్యారెల్‌కు 92.75 డాలర్ల వద్దకు చేరింది. భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడే ఆర్థిక వ్యవస్థకు చమురు ధరలు తగ్గడం ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించి మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది.

**ఆర్‌బీఐ బూస్టర్ డోస్.. బ్యాంకింగ్ రంగం హవా**

నేటి మార్కెట్ ర్యాలీకి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం బూస్ట్‌గా మారింది. విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు గాను బ్యాంకులు సేకరించే తాజా ఎఫ్‌సీఎన్ఆర్-బీ డిపాజిట్ల కోసం యూఎస్ డాలర్-రూపాయి ఫారెక్స్ స్వాప్ సదుపాయాన్ని ఆర్‌బీఐ ప్రవేశపెట్టింది. కనీసం 3 సంవత్సరాల నుంచి గరిష్టంగా 5 సంవత్సరాల కాలపరిమితి గల డిపాజిట్లకు ఇది వర్తిస్తుంది. ఈ నిర్ణయంతో నిఫ్టీ బ్యాంక్ ఏకంగా 1,255 పాయింట్లు దూసుకెళ్లింది. ఏప్రిల్ 10 తర్వాత బ్యాంక్ నిఫ్టీ సాధించిన అత్యుత్తమ సింగిల్-డే లాభం ఇదే కావడం గమనార్హం. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ వంటి హెవీవెయిట్ షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి.

**అంతర్జాతీయ మార్కెట్ల మద్దతు**

గత వారం అమెరికా వాల్ స్ట్రీట్‌లో చోటుచేసుకున్న అమ్మకాల ఒత్తిడి నుంచి అంతర్జాతీయ మార్కెట్లు వేగంగా కోలుకున్నాయి. ఆసియా మార్కెట్లలో సెమికండక్టర్, టెక్నాలజీ షేర్లు రాణించాయి

# విమానయానం భారం.. ప్రయాణికులపై చార్జీల ప్రభావం

**రియో డీ జనిరో :** పెరిగిన ఇంధన ధరలతో విమానయాన సంస్థలు.. టికెట్ చార్జీలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయి. అయితే చార్జీలు పెరిగితే ప్రయాణి కులు తగ్గిపోయే వీలున్నదని అంతర్జాతీయ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) ప్రధాన ఆర్థికవేత్త మ్యారీ ఓవెన్స్ థామ్సన్ అభిప్రాయపడ్డారు. ధరల వ్యత్యాసాలు ప్రయాణికుల ప్రత్యామ్నాయాల అన్వేషణకు దారితీస్తాయన్నారు. అమెరికా, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలను ప్రభావితం చేస్తున్న విషయం తెలిసిందే. ఇది సహజంగానే భారత్ వంటి క్రూడాయిల్ దిగుమతి దేశాలను అన్ని రకాలుగా దెబ్బతీస్తున్నది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది విమాన ఇంధనం రేటు 70 శాతం వరకు పెరుగవచ్చన్న అంచనాలున్నాయి. ఈ క్రమంలోనే ఐఏటీఏ పైవిధంగా స్పందించింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 370కిపైగా ఎయిర్‌లైన్స్‌కు ఐఏటీఏ ప్రాతినిధ్యం వహిస్తున్నది.



**పెంపు అనివార్యం**

విమాన టికెట్ ధరల పెంపు అనివార్యంగానే కనిపిస్తున్నదని ఐఏటీఏ చీఫ్ ఎకనామిస్ట్ థామ్సన్ అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో చార్జీలను పెంచకపోతే నష్టాలపాలయ్యే వీలున్నదని, చివరకు దివాలా తీసే ప్రమాదం కూడా లేకపోలేదని వ్యాఖ్యానించారు. అయితే టికెట్ ధరలు పెరిగితే ప్రయాణికులు ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యానికి చేరుకోవాలని చూస్తారని, ఇది కంపెనీల ఆదాయంపై ప్రభావం చూపగలదని కూడా పేర్కొన్నారు. ఇక 2025తో పోల్చితే 2026లో విమానయాన సంస్థల ఇంధన ఖర్చులు 252 బిలియన్ డాలర్ల నుంచి 350 బిలియన్ డాలర్లకు పెరిగిపోవచ్చని చెప్పారు. కేవలం గల్ఫ్ యుద్ధం దెబ్బకు దాదాపు 40 శాతం అధికమయ్యే అవకాశాలున్నాయన్నారు. గత ఏడాది బ్యారెల్ విమానయాన ఇంధనం ధర సగటున 90 డాలర్లుగా ఉంటే.. ఈ ఏడాది అది 152 డాలర్ల స్థాయిలో ఉన్నదని వివరించారు.

**దేశీయ విమానయానంపై దెబ్బ**

పెరుగుతున్న ముడి చమురు ధరలతో ఇప్పటికే దేశీయ విమానయాన రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. ఎయిర్ ఇండియా మరికొన్ని సంస్థలు ఆయా మార్గాల్లో విమానాల సంఖ్యను తగ్గించేశాయి. ఈ క్రమంలో ఇంధన ధరలు ఇంకా పెరిగితే ప్రధాన మార్గాల్లో తప్ప మిగతా రూట్లలో విమానాల రాకపోకలు నిలిచిపోయే అవకాశాలూ లేకపోలేదన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. కాగా, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ సంస్థలు ఐఏటీఏలో భాగంగానే ఉన్నాయి.

# అమెరికా వీసా ఇంటర్వ్యూకు అదనపు బాదుడు..

**హైదరాబాద్ :** ప్రస్తుత వీసా విధానంలో సాధారణ అపాయింట్‌మెంట్ కోసం ఆరు నెలల నుంచి ఏడాదికి పైగా వేచి చూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పది రోజుల్లోనే ఇంటర్వ్యూ స్లాట్ దక్కించుకోవడానికి ఈ అదనపు రుసుము చెల్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. అమెరికా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఈ 750 డాలర్ల రుసుము కేవలం ఇంటర్వ్యూ తేదీని మాత్రమే ఖరారు చేస్తుంది. దీనివల్ల వీసా వస్తుందనే గ్యారెంటీ ఏమాత్రం ఉండదని అధికారులు స్పష్టం చేశారు. ఒకవేళ ఇంటర్వ్యూకు హాజరు కాకపోయినా లేదా వీసా తిరస్కరణకు గురైనా ఈ డబ్బును తిరిగి ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికే ఉన్న సాధారణ వీసా ఫీజు 185 డాలర్లతో పాటు జనవరి నుంచి అమల్లోకి వచ్చిన వీసా ఇంటెగ్రిటీ ఫీజు 250 డాలర్లు అదనం. వీటన్నింటికీ తోడు ఇతర ఛార్జీలు కూడా కలిపితే విమానం ఎక్కకముందే ఒక్కో దరఖాస్తుదారుడికి లక్షా 16 వేల రూపాయలకు పైగా




ఖర్చవుతుంది. హైదరాబాద్ లేదా ముంబై నుంచి విమాన టికెట్ల ఖర్చు కూడా కలిపితే మొత్తం రెండు లక్షల రూపాయలు దాటుతుంది. అమెరికా ఎంబసీకి చెందిన అధికారిక వీసా పోర్టల్ మే నెలలో సాంకేతిక లోపాలతో ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయింది. దీనివల్ల భారతదేశంతో పాటు మెక్సికో, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో వేలాది మంది దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వ్యవస్థలోని లోపాల వల్ల పెరిగిన రద్దీని తగ్గించేందుకు వాషింగ్టన్ ఈ అదనపు వసూళ్ల మార్గాన్ని ఎంచుకుంది. ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీసా ఖర్చులు గడిచిన ఏడాదిలో రెండున్నర రెట్లు పెరిగాయి. దీనివల్ల ముఖ్యంగా అమెరికాలో స్థిరపడిన పిల్లలను చూసేందుకు వెళ్లే భారతీయ వృద్ధులకు పెద్ద సమస్యగా మారింది. పదవీ విరమణ చేసి పరిమిత ఆదాయంతో జీవించే వృద్ధ తల్లిదండ్రులకు ఈ అదనపు భారం మోయలేనిదిగా తయారైంది. ఒకవేళ వీసా రాకపోతే ఈ భారీ మొత్తం పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. జూలై ఒకటిన ఏయే నగరాల్లోని కాన్సులేట్లలో ఈ సదుపాయం అందుబాటులోకి వస్తుందో అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించనున్నారు. నిబంధనలు కఠినతరం కావడంతో పాటు ఖర్చులు విపరీతంగా పెరగడం మధ్యతరగతి ప్రయాణికులకు పెద్ద శరాఘాతంగా మారింది.

# ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్ సంచలన విజయం

ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియాకు పసికూన బంగ్లాదేశ్ ఊహించని షాకిచ్చింది. స్వదేశంలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా ఇవాళ (జూన్ 9) జరిగిన తొలి మ్యాచ్‌లో 86 పరుగుల తేడాతో సంచలన విజయం (డక్‌వర్త్ లూయిస్) సాధించింది. తద్వారా సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. 36 ఏళ్ల చరిత్రలో బంగ్లాదేశ్ ఆస్ట్రేలియాపై వన్డేల్లో విజయం సాధించడం ఇది రెండోసారి మాత్రమే. 2005లో కార్డిఫ్‌లో జరిగిన మ్యాచ్‌లో తొలిసారి బంగ్లా జట్టు ఆసీస్‌కు షాకిచ్చింది. ఢాకాలోని షేర్-ఏ-బంగ్లా స్టేడియం వేదికగా జరిగిన తాజా మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. ఆరో నంబర్ ఆటగాడు మొసద్దెక్ హొస్సేన్ (86 నాటౌట్) సంచలన ఇన్నింగ్స్ ఆడటంతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. బంగ్లా ఇన్నింగ్స్‌లో తంజిద్ హసన్ తమీమ్ (54), నజ్ముల్ హొస్సేన్ షాంటో (67) కూడా అర్ధ సెంచరీలతో రాణించారు. తౌహిద్ హృదోయ్ (31), తస్కిన్ అహ్మద్ (20) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఇల్లిస్ (10-1-38-3) అద్భుతంగా బౌలింగ్ చేయగా.. లియామ్ స్కాట్, మ్యాట్ రెన్షా తలో 2 వికెట్లతో పర్వాలేదనిపించారు. బార్ట్‌లెట్‌కు ఓ వికెట్ దక్కింది. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. కామెరూన్ గ్రీన్ (52) ఒక్కడే అర్ధశతకంతో పోరాడగా.. మిగతా బ్యాటర్లు నిరాశపరిచారు. బంగ్లాదేశ్ పేసర్ నహీద్ రాణా (10-1-



41-4) దెబ్బకు కంగారూలు కంగారు పడిపోయారు. బ్యాటింగ్‌లో సత్తా చాటిన మొసద్దెక్ (10-1-37-2) బౌలింగ్‌లోనూ చెలరేగడంతో ఆస్ట్రేలియా 42.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. ఈ దశలో వర్షం? అంతరాయం కలిగించడంతో డీఎల్ఎస్ పద్ధతిలో బంగ్లాదేశ్‌ను విజేతగా ప్రకటించారు. బంగ్లా బౌలర్లలో ముస్తాఫిజుర్ (5.2-0-24-2), తస్కిన్ (5-0-28-1) కూడా రాణించారు.

# నైట్‌క్లబ్ వివాదం.. స్టోక్స్ కెరీర్‌కు ఎండ్ కార్డ్..?

ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ భవిష్యత్తుపై సంచలన ప్రచారం జరుగుతోంది. తాజాగా న్యూజిలాండ్‌పై లార్డ్స్ టెస్టులో ఘన విజయం సాధించిన తర్వాత స్టోక్స్, సహచర ఆటగాడు గస్ అట్కిన్సన్ జట్టు నిబంధనలను ఉల్లంఘించి అర్ధరాత్రి కర్ఫ్యూ సమయంలో ఓ నైట్‌క్లబ్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ వారు ఫుల్లుగా తాగి ఓ రగ్బీ ఆటగాడిపై దాడి చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ వివాదం తర్వాత స్టోక్స్ తన కెరీర్‌కు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. 'ది క్రికెటర్' సీనియర్ జర్నలిస్ట్ జార్జ్ దోబెల్ ప్రకారం.. అతడు స్వచ్ఛందంగా కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో పాటు రిటైర్మెంట్ కూడా ప్రకటించవచ్చు. అయితే దీనిపై అధికారిక ప్రకటన లేదు. ఇదిలా ఉంటే, నైట్‌క్లబ్ ఘటనలో స్టోక్స్, అట్కిన్సన్ ఎవరిపై దాడికి పాల్పడలేదని జుజదీ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ కర్ఫ్యూ నిబంధనలు ఉల్లంఘించినందుకు వారిపై చర్యలు తప్పకపోవచ్చు. స్టోక్స్‌కు ఇలాంటి సంఘటనలు కొత్తేమీ కాదు. గతంలోనూ పీకల దాకా తాగి రచ్చ చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. గతేడాది నవంబర్‌లో ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా ఇలాగే నైట్‌క్లబ్ వివాదంలో చిక్కుకున్నాడు. న్యూజిలాండ్‌తో వన్డే మ్యాచ్‌కు ముందు వెల్లింగ్టన్‌లోని ఓ నైట్‌క్లబ్‌కు వెళ్లిన బ్రూక్, అక్కడ బౌన్సర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఇంగ్లండ్



భవిష్యత్తు ఆశాకిరణం జేకబ్ బెథెల్‌తో కలిసి సదరు బౌన్సర్‌పై దాడి చేశాడు. అయితే దాడి పెద్దది కాకపోవడంతో ఈసీబీ వారిద్దరిని మందలింపుతో సరిపెట్టింది.

## స్పోర్ట్స్

# గైక్వాడ్ సూపర్ సెంచరీ.. ఉత్కంఠ పోరులో టీమిండియా గెలుపు




శ్రీలంకలో జరుగుతున్న ఏ-జట్ల ముక్కోణపు టోర్నీలో టీమిండియా బోణీ కొట్టింది. డంబుల్లా వేదికగా శ్రీలంక-ఏతో ఇవాళ (జూన్ 9) జరిగిన మ్యాచ్‌లో 8 పరుగుల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. రుతురాజ్ గైక్వాడ్ (101) సూపర్ సెంచరీతో, కెప్టెన్ తిలక్ వర్మ (60) బాధ్యతాయుతమైన అర్ధ సెంచరీతో రాణించడంతో నిర్ణీత 50 ఓ?వర్లలో 6 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఆఖర్లో ఆయుశ్ బదోని (24), సూర్యాంశ్ షేడ్గే (26 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లతో అలరించారు. మిగతా ఆటగాళ్లలో ప్రియాంశ్ ఆర్య 32, ప్రభ్‌సిమ్రన్ సింగ్ 2, అనుకూల్ రాయ్ 1 (నాటౌట్) పరుగు చేయగా.. ఐపీఎల్ 2026 తర్వాత భారీ అంచనాల నడుమ బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ 14 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు.


లంక బౌలర్లలో మొహమ్మద్ షిరాజ్ 2 వికెట్లు తీయగా.. కరుణరత్నే, సంకేత్, వనుజ సహాన్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 278 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక, సాహన్ అరచ్చిగే (74), నిరోషన్ డిక్వెల్లా (47), సమరవిక్రమ (46) రాణించడంతో ఓ దశలో (262/6) గెలుపు దిశగా దూసుకెళ్లింది. అయితే చివరి రెండు ఓవర్లలో (7 పరుగుల వ్యవధిలో) కేవలం 10 పరుగులు అవసరమైన సమయంలో శ్రీలంక వరుసగా నాలుగు వికెట్లు కోల్పోయి 269 పరుగులకే ఆలౌటై, ఓటమిపాలైంది. అర్షద్ ఖాన్, ఆయుష్ బదోని, అనుకూల్ రాయ్, విప్రాజ్ నిగమ్ తలో రెండు వికెట్లు తీయగా, అన్షుల్ కంబోజ్ ఓ వికెట్ పడగొట్టింది. జూన్ 11న జరిగే తదుపరి మ్యాచ్‌లో భారత్-ఏ, ఆఫ్ఘనిస్తాన్-ఏ తలపడనున్నాయి.




## నాని ‘ది పారడైజ్’ మళ్లీ వాయిదా? రవితేజ ‘ఇరుముడి’ కోసమేనా!

నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘ది పారడైజ్’ మరోసారి వాయిదా పడే దిశగా కనిపిస్తోంది. మొదట మార్చి 26న విడుదల కావాల్సిన ఈ చిత్రం, ఆ తర్వాత ఆగస్టు 21కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆ ఆగస్టు 21వ తేదీని మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న ‘ఇరుముడి’ సినిమా లాక్ చేసుకోవడంతో నాని సినిమా పోస్ట్‌పోన్ కాక తప్పని పరిస్థితి ఏర్పడింది. సినిమాకు సంబంధించిన కొంత వర్క్ ఇంకా పెండింగ్‌లో ఉండటమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. సోషల్ మీడియాలో వినిపిస్తున్న తాజా సమాచారం ప్రకారం.. ‘ది పారడైజ్’ చిత్రం సెప్టెంబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఇది కేవలం ప్రచారం మాత్రమేనని, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని ఇండస్ట్రీ టాక్. బ్లాక్‌బస్టర్ ‘దసరా’ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ‘ది పారడైజ్’ పై భారీ అంచనాలు ఉన్నాయి. ఎస్‌ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాయాదు లోహర్ హీరోయిన్ గా నటిస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నాడు.

# ‘పెద్ది’కి మళ్లీ రిపేర్లు.. సెకండాఫ్‌లో కీలక మార్పులు, కొత్త వెర్షన్ సిద్ధం!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ, సినిమా కంటెంట్ విషయంలో వచ్చిన విమర్శలను మేకర్స్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చిన నేపథ్యంలో దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని మరింత మెరుగుపరచే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు గురయ్యాయి. హీరోయిన్‌ను చూపించిన తీరు, కొన్ని షాట్లపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో దర్శకుడు బుచ్చిబాబు క్షమాపణలు చెబుతూ ఆ సన్నివేశాలను తొలగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం థియేటర్లలో ఆ మార్పులతో కూడిన వెర్షన్ ప్రదర్శితమవుతోంది. అయితే తాజా సమాచారం ప్రకారం, ‘పెద్ది’లో మార్పులు అక్కడితో ఆగలేదని తెలుస్తోంది. ముఖ్యంగా సెకండాఫ్ నిడివి, కథనం వేగంపై ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను దృష్టిలో పెట్టుకుని మరిన్ని ఎడిటింగ్ మార్పులు చేయాలని చిత్రబృందం నిర్ణయించినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో సెకండాఫ్‌లో వచ్చే కొన్ని ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌ను తగ్గించి, వాటి స్థానంలో రామ్ చరణ్ మరియు జగపతి బాబు పాత్రల మధ్య భావోద్వేగపూరిత సన్నివేశాలను జోడించే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని సమాచారం. ఈ మార్పులతో కథ మరింత బలంగా, భావోద్వేగంగా కనెక్ట్ అవుతుందని భావిస్తున్నారట. అలాగే సినిమాలోని కొన్ని నెమ్మదిగా సాగిన భాగాలను కత్తిరించి, కథనాన్ని మరింత రేసీగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రేక్షకుల దృష్టిని నిలబెట్టేలా సెకండాఫ్‌ను మరింత గ్రిప్పింగ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ మార్పులు చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఎడిటింగ్ పనులు పూర్తయిన తర్వాత చిత్రానికి మళ్లీ సెన్సార్ అనుమతి తీసుకుని, కొత్త వెర్షన్‌ను థియేటర్లలో ప్రదర్శించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వీలైనంత త్వరగా, ముఖ్యంగా వచ్చే వీకెండ్‌కు ముందే ఈ అప్‌డేటెడ్ వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, మిశ్రమ టాక్ వచ్చినప్పటికీ ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు చేస్తూ ముందుకు సాగుతోంది. ఇప్పుడు ఈ కొత్త మార్పులు సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తాయా? కలెక్షన్లపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

## దేశ విభజన నేపథ్యంలో సన్నీ డియోల్ ‘బట్వారా 1947’.. విడుదల తేదీ ఖరారు!




బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా చిత్రం నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటివరకు ‘లాహోర్ 1947’ అనే వర్కింగ్ టైటిల్‌తో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా పేరును అధికారికంగా ‘బట్వారా 1947’ గా మారుస్తూ చిత్రబృందం సరికొత్త మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే ఈ భావోద్వేగభరితమైన చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో ‘ఘాయల్’, ‘దామిని’, ‘ఘాతక్’ వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన ‘ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్’ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

# వీడి అనుమానంలో మనం విడిపోయేలా ఉన్నాం’



యంగ్ హీరో రాగ్ మయూర్ నటించిన లేటేస్ట్ సైకాలాజికల్ కామెడీ ఎంటర్‌టైనర్ అనుమాన పక్షి. ఈ సినిమాకు విమల్ కృష్ణ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని రాజీవ్ చిలకా, రాజేశ్ జగ్తియాని, హిరాచంద్ దండ్ నిర్మించారు. ఈ చిత్రంలో మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటించింది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. తాజాగా రిలీజైన టీజర్ చూస్తుంటే ప్రతి విషయానికి అనుమానపడే వ్యక్తిగా హీరో రాగ్ మయూర్ కనిపించారు. ప్రతిదాన్ని అనుమానించే హీరో పెళ్లి విషయంలో ఏం చేశారనే నేపథ్యంలోనే ఈ మూవీని తెరకెక్కించినట్లు అర్థమవుతోంది. ఈ మూవీలో ప్రిన్స్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, రాశి, ?అజయ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూలై 10న థియేటర్లలో సందడి చేయనుంది.



## నాగ చైతన్య సూపర్ హిట్ థ్రిల్లర్ సిరీస్‌పై క్రేజీ బజ్ ..

### ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ జత కట్టిన క్రేజీ కాంబో

అక్కినేని యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఒకవైపు భారీ థ్రిల్లర్ మూవీ ‘వృష కర్మ’లో నటిస్తూనే, మరోవైపు తన కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఓటీటీ సిరీస్ ‘దూత’ రెండో సీజన్ కోసం కూడా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికారికంగా ప్రారంభమైన ‘దూత 2’పై రోజురోజుకు ఆసక్తికరమైన వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. దర్శకుడు విక్రమ్ కె కుమార్ తెరకెక్కించిన ‘దూత’ తొలి సీజన్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణను సొంతం చేసుకుంది. హారర్, మిస్టరీ, థ్రిల్లర్ అంశాల కలయికతో రూపొందిన ఈ సిరీస్ ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా, నాగ చైతన్యకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పుడు రెండో సీజన్ మరింత భారీ స్థాయిలో తెరకెక్కనున్నట్లు సమాచారం. తాజాగా సినీ వర్గాల్లో వినిపిస్తున్న వార్తల ప్రకారం, ప్రముఖ నటి భూమిక చావ్లా ‘దూత 2’లో కీలక పాత్ర పోషించనున్నారట. ఈ విషయంపై అధికారిక ప్రకటన రానప్పటికీ, భూమిక పాత్ర కథలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, నాగ చైతన్య-భూమిక కాంబినేషన్ మరోసారి ప్రేక్షకులను అలరించనుంది. ఇప్పటికే 2018లో వచ్చిన ‘సవ్యసాచి’ చిత్రంలో నాగ చైతన్యతో కలిసి నటించిన భూమిక, ఇప్పుడు ‘దూత 2’లో మరో ఆసక్తికరమైన పాత్రలో కనిపించబోతున్నారని టాక్. ఆమె పాత్ర కథనంలో కీలక మలుపులకు కారణమవుతుందని కూడా సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి సీజన్‌లో ప్రింట్ మీడియా, వార్తాపత్రికల నేపథ్యంలో సాగే భయానక మిస్టరీని దర్శకుడు విక్రమ్ కె కుమార్ అద్భుతంగా చూపించారు. జరగబోయే ఘటనలను ముందుగానే చెప్పే వార్తాపత్రికల కాన్సెప్ట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు రెండో సీజన్‌లో పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి దర్శకుడు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అత్యాధునిక టెక్నాలజీ, డిజిటల్ ప్రపంచం లేదా మరొక వినూత్నమైన అంశాన్ని కథలో భాగం చేయనున్నారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే మేకర్స్ మాత్రం కథకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. ఇక ఈ సిరీస్ మరో ప్రత్యేకత ఏమిటంటే, నాగ చైతన్య కేవలం హీరోగానే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన కెరీర్‌లో నిర్మాతగా ప్రారంభించిన తొలి ప్రాజెక్ట్ ‘దూత 2’ కావడం విశేషం. దీంతో ఈ సిరీస్‌పై చైతన్య ప్రత్యేక శ్రద్ధ పెట్టుతున్నట్లు సమాచారం.

## ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి, అస్థిరత ఉన్నా

# అభివృద్ధి పథంలో భారత్

ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి, అస్థిరత ఉన్నప్పటికీ, భారత్ అభివృద్ధి పథంలో బలంగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేయడానికి కేంద్రం, రాష్ట్రాలు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు యువత, మహిళల సాధికారత ఎంతో కీలకమన్న మోదీ, దేశ ప్రగతి ప్రస్థానంలో వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని రాష్ట్రాలకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం దిల్లీలో జరిగింది. రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశానికి పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్రమంత్రులు హాజరయ్యారు. నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్, ఇతర సభ్యులు కూడా పాల్గొన్నారు. వికసిత్ భారత్ 2047 విజన్‌లో భాగంగా ప్రతి పౌరుడికి ప్రయోజనం చేకూరేలా సమగ్ర మానవాభివృద్ధిని సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసుకునే దిశలో కేంద్ర, రాష్ట్రాల సమష్టి బాధ్యత మరింత పెరుగుతుందని తెలిపారు. వృద్ధి, ఎగుమతులకు కొత్త అవకాశాలను సృష్టించేందుకు వీలుగా భారత్ అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసిందని ప్రధాని గుర్తుచేశారు. ఈ ఒప్పందాలు దేశంలోని మీవీజులకు మంచి



అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పోటీతత్వాన్ని పెంచుకుంటూ గ్లోబల్ మార్కెట్లకు సిద్ధం కావడానికి తోడ్పడతాయని వివరించారు. మహిళలు తమ పూర్తి సామర్థ్యాన్ని వెలికితీసి, భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని ముందుకు నడిపించేలా రాష్ట్రాలు వారి విద్య, నైపుణ్యాభివృద్ధి, భద్రత, సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని మోదీ కోరారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో దేశ అభివృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి మనమంతా కలిసి పని చేస్తున్నామని, వికసిత్ భారత్ అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేయడంలో కేంద్రం, రాష్ట్రాల సమష్టి కృషి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రాష్ట్రాలు తమ ఆలోచనలను పంచుకోవడానికి, వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో కలిసి పనిచేయడానికి నీతి ఆయోగ్ కీలక పాత్ర పోషించగలదని ఆయన తెలిపారు. ఈ మేరకు ప్రధాని ప్రసంగానికి సంబంధించిన వివరాలను నీతి ఆయోగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

వికసిత్ భారత్ దార్శనికత దిశగా రాష్ట్రాలు తమ ఆలోచనలను పంచుకోవడానికి, కలిసి పనిచేయడానికి వీలుగా, సహకారానికి ఒక వేదికగా నీతి ఆయోగ్ కీలక పాత్ర పోషించగలదు. రాష్ట్రాల మధ్య పరస్పర చర్యలకు సహకారం, చర్చలు, పంచుకోవడం మార్గదర్శకంగా ఉండాలి. సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో, భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి మేమంతా కలిసి పనిచేస్తున్నాము.

దేశంలో యువత ఒక చారిత్రక అవకాశం అన్న మోదీ, వారిని ఎంతమాత్రం కోల్పోకూడదని అన్నారు. నాణ్యమైన విద్య, డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల ద్వారా భారతీయ యువతకు సరైన వాతావరణాన్ని సృష్టించడం మన ప్రాధాన్యంగా ఉండాలని ఆయన ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ వైపు ప్రయాణంలో సాధికారత సాధించిన యువతే ప్రధాన చోదక శక్తిగా ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మహిళా నేతృత్వంలోని అభివృద్ధే వికసిత్ భారత్ దార్శనికతకు మూలస్తంభం అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. వ్యవసాయం, స్టార్టప్‌లు, సైన్స్, ఇన్నోవేషన్ సహా అన్ని రంగాల్లో నారీ శక్తి తన వంతు కృషి చేస్తోందని ఆయన గుర్తు చేశారు.

# మధ్యవర్తిత్వం నాకు చాలా ఇష్టమైన విషయం

భారత న్యాయవ్యవస్థ మధ్యవర్తిత్వాన్ని కేవలం ఒక ప్రత్యామ్నాయంగానే కాకుండా, ఒక పటిష్టమైన వివాద పరిష్కార యంత్రాంగంగా ప్రోత్సహిస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. మధ్యవర్తిత్వం తనకు చాలా ఇష్టమైన విషయమని పేర్కొన్నారు. అందుకే సుప్రీంకోర్టు లీగల్ సర్వీస్ కమిటీ (ఎస్‌సీఎల్ఎస్‌సీ) శిక్షణ పొందిన మధ్యవర్తులతో ఒక పెద్ద బృందాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. లండన్‌లోని భారత హైకమిషన్ నిర్వహించిన ఒక ప్యానెల్ చర్చ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

**'దేశంలోని అందరికీ మధ్యవర్తిత్వం అంటే ఏంటో తెలుసు'**

భారతదేశంలోని ప్రతి పట్టణంలో, ప్రతి వీధిలోని ప్రజలకు మధ్యవర్తిత్వం అంటే ఏమిటో తెలుసని తాను గర్వంగా చెప్పగలనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అలాగే భారత్‌లో మధ్యవర్తిత్వం పరిణామ క్రమాన్ని, దాన్ని ప్రోత్సహించడంలో న్యాయవ్యవస్థ పాత్రను వివరించారు. మధ్యవర్తిత్వ చట్టం- 2023 అమల్లోకి రాకముందు న్యాయస్థానాలు మధ్యవర్తిత్వాన్ని ఒక పటిష్టమైన వివాద పరిష్కార యంత్రాంగంగా చురుకుగా ప్రోత్సహించాయని చెప్పారు. 2004లో హైకోర్టు న్యాయమూర్తిగా తన తొలి అనుభవాలను పంచుకున్నారు. ట్రయల్ కోర్టు, హైకోర్టు, సుప్రీం కోర్టు స్థాయిలలో మధ్యవర్తిత్వ కేంద్రాలు ఏర్పాటు చేయడాన్ని ఆయన ప్రముఖంగా గుర్తు చేశారు.

మధ్యవర్తిత్వ చట్టం- 2023 అనేది దశాబ్దాలుగా పరిణామం చెందిన చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా సృష్టించిన ఒక వ్యవస్థకు పరాకాష్టగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అభివర్ణించారు. ఈ క్రమంలో మధ్యవర్తిత్వ సామర్థ్యాన్ని



పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన న్యాయపరమైన కార్యక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించారు. రాష్ట్ర న్యాయ అకాడమీల ద్వారా మధ్యవర్తులకు తప్పనిసరి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, అలాగే పరస్పర అంగీకారంతో కూడిన వివాద పరిష్కార యంత్రాంగాలపై పౌరులకు అవగాహన కల్పించడంలో జాతీయ న్యాయ సేవల అథారిటీ, లోక్ అదాలత్‌ల పాత్రను ఆయన నొక్కి చెప్పారు. ఆర్బిట్రేషన్ కంటే మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలా అనే ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ రెండు యంత్రాంగాలకు న్యాయవ్యవస్థలో ముఖ్యమైన పాత్ర ఉందన్నారు.

**'మధ్యవర్తిత్వం మంచిది, వేగవంతమైనది'**

"నేను ఆర్బిట్రేషన్‌ను నిరుత్సాహపరచను. దేశాల మధ్య పెరుగుతున్న వాణిజ్య సంబంధాలు అనివార్యంగా వివాదాలను సృష్టిస్తాయి. అయితే మధ్యవర్తిత్వం మంచిది, వేగవంతమైనది. వాణిజ్య సంబంధాలను కాపాడగల సామర్థ్యం ఉన్నందున అన్ని పక్షాలు మొదట మధ్యవర్తిత్వం ద్వారానే విభేదాలను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలి. ఆర్బిట్రేషన్‌లో ఒక తీర్పు వెలువడిన వెంటనే తరచుగా తదుపరి వ్యాజ్యానికి నాంది పలుకుతుంది. మధ్యవర్తిత్వంలో ఒకసారి ప్రక్రియ విజయవంతంగా ముగిసిన తర్వాత అది వివాదానికి ముగింపు పలుకుతుంది. మధ్యవర్తిత్వానికి, ఆర్బిట్రేషన్‌కు మధ్య ఉన్న వ్యత్యాసం ఇదే." అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

**భారత హైకమిషన్‌లో చర్చ**

లండన్‌లోని భారత హైకమిషన్ బుధవారం 'టెక్నాలజీ అండ్ ది ఫ్యూచర్ ఆఫ్ మీడియేషన్' అనే అంశంపై ఒక ఉన్నత స్థాయి ప్యానెల్ చర్చను నిర్వహించింది. ఈ చర్చలో భారత్, యూకేలకు చెందిన ప్రముఖ న్యాయమూర్తులు, న్యాయ రంగ ప్రముఖులు హాజరయ్యారు. ఈ ప్యానెల్ చర్చలో భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తో పాటు యూకే సుప్రీంకోర్టు న్యాయమూర్తి లార్డ్ హ్యాంబ్లెన్ ఆఫ్ కెర్సీ కూడా పాల్గొన్నారు. ఇంగ్లాండ్ అండ్ వేల్స్ బార్ కౌన్సిల్ అధ్యక్షురాలు కిర్స్టీ బ్రిమెలో కేసీ, ఇంగ్లాండ్ అండ్ వేల్స్ లా సొసైటీ ఉపాధ్యక్షుడు బ్రెట్ డిక్సన్ సైతం ఈ చర్చకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లండన్‌లో భారత్ హై కమిషనర్ కుమారన్ పీ ప్రారంభోపన్యాసం చేశారు. సుప్రీంకోర్టు అడ్వకేట్ తన్వి దుబే ఈ చర్చకు మధ్యవర్తిత్వం వహించారు. గతంలోనూ ఓ కార్యక్రమంలో మధ్యవర్తిత్వం గురించి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. మధ్యవర్తిత్వ చట్టం బలహీనతకు సంకేతం కాదని, దాని అత్యున్నత పరిణామమని స్పష్టం చేశారు. కోర్టులు కేవలం విచారణకు మాత్రమే కాకుండా వివాద పరిష్కారాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్ కేసులు తగ్గడంలో మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను తెలియజేశారు, సుప్రీంకోర్టు స్థాయిలో మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.

# ఇది యుద్ధాల కాలం కాదు

ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్రిక్తతల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే సరైన మార్గమని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పునరుద్ఘాటించారు. 'ఇది యుద్ధాల యుగం కాదు' అని ఆయన స్పష్టం చేశారు. యుద్ధాలు, ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. బల్గేరియా పర్యటనలో భాగంగా ఆ దేశ విదేశాంగ మంత్రి వెలిస్లావా పెట్రోవా-చమోవాతో సమావేశం అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచం అత్యంత అస్థిర, అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆయన పేర్కొన్నారు.

ఒకవైపు యుద్ధాలు, మరోవైపు ఆర్థిక భద్రతపై పెరుగుతున్న ఆందోళనలు, మహమ్మారి ప్రభావాలు, ఉగ్రవాద ముప్పులు ప్రపంచ వ్యవస్థను సవాలు చేస్తున్నాయని తెలిపారు. ప్రపంచ ఆర్థిక భద్రత, సముద్ర వాణిజ్య రక్షణ, గ్లోబల్ సౌత్ ప్రయోజనాలు, ఉగ్రవాద నిర్మూలనపై భారత్ స్పష్టమైన, దృఢమైన వైఖరిని ఆయన వెల్లడించారు.

**అధ్యక్షుడు, నాయకులతో సమావేశం**

ఈ సందర్భంగా బల్గేరియా అధ్యక్షుడు రూమెన్ రాదేవ్?తో సహా పలువురు ఉన్నత నాయకులతో జైశంకర్ సమావేశమయ్యారు?. ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం, వాణిజ్య, పెట్టుబడి అవకాశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. భారత్ ఎల్లప్పుడూ గ్లోబల్ సౌత్ దేశాల సంక్షేమాన్ని కాంక్షిస్తోందని, ఆయా దేశాల ఇబ్బందులను అంతర్జాతీయ వేదికలపై నిరంతరం లేవనెత్తుతుందని చెప్పారు. ఇంధనం, ఆహారం, ఎరువుల సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడటం ప్రపంచ దేశాల కనీస బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

"ఈ అంశాలన్నింటిపై భారతదేశానికి స్పష్టమైన వైఖరి ఉంది. ఇది యుద్ధాల యుగం కాదని మేము విశ్వసిస్తున్నాం.



వివాదాలు, సంఘర్షణలకు చర్చలు, దౌత్యం మాత్రమే ఏకైక పరిష్కారం. ఆర్థికపరమైన నష్టాలను తగ్గించాలంటే వాణిజ్య సరఫరా మరింత స్థిరంగా, వైవిధ్యభరితంగా మార్చుకోవాలి. సముద్ర వాణిజ్యానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడటం అత్యంత ముఖ్యం."

**మరింత బలోపేతంగా భాగస్వామ్యం**

కాగా భారత్?-బల్గేరియా సంబంధాలపై పూర్తి స్థాయిలో చర్చించినట్లు జైశంకర్ తెలిపారు. ముఖ్యంగా భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) చర్చలు, వ్యూహాత్మక, రక్షణ భాగస్వామ్యం, సమగ్ర మొబిలిటీ సహకార వ్యవస్థ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కొత్త సహకార అవకాశాలను అన్వేషించినట్లు వెల్లడించారు. భారత్-యూరోపియన్ యూనియన్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పలు కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించేందుకు ఇరుదేశాలు అంగీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉగ్రవాదంపై జైశంకర్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనైనా, ఏ కారణంతోనైనా సమర్థించలేమని చెప్పారు. ఉగ్రవాద నిర్మూలన విషయంలో ప్రపంచ దేశాలన్నీ ఎటువంటి మినహాయింపులు లేకుండా 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబించాలన్నారు. ఈ విషయంలో భారత్, బల్గేరియా దేశాల మధ్య సంపూర్ణమైన ఒకే రకమైన దృక్పథం ఉందన్నారు.

ఇదిలా ఉండగా బల్గేరియా పర్యటన అనంతరం జైశంకర్ ఫిన్లాండ్‌కు వెళ్లనున్నారు. జూన్ 11న అక్కడ జరిగే 14 కుల్తారంటా చర్చల్లో ఆయన పాల్గొంటారు. ఈ ఏడాది 'పరివర్తనలో ఉన్న ప్రపంచం - ప్రాంతీయ, స్థానిక దృక్పథాలు' అనే అంశంపై ఈ చర్చలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఫిన్లాండ్ విదేశాంగ మంత్రితో పాటు పలువురు ఉన్నత నాయకులతో కూడా ఆయన సమావేశం కానున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

**ఇండోనేసియా విదేశాంగ మంత్రితో చర్చలు**

ఇటీవల రక్షణ, భద్రత, సముద్రయానం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆరోగ్యం, ఔషధాలు, ఆహార భద్రత, పర్యాటకం, విద్య సాంస్కృతిక సహకారం వంటి అంశాలపై ఇండోనేసియా విదేశాంగ మంత్రి సుగియోనోతో విస్తృతమైన చర్చలు జరపనున్నానని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ వ్యాఖ్యానించారు. గతంలో తాను ఇండోనేసియా అధ్యక్షుడు అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోను కలిసినప్పుడు బహుముఖ ద్వైపాక్షిక సంబంధాలను మరింత అభివృద్ధి చేయడంపై ఆయన అందించిన మార్గదర్శకత్వాన్ని ఎంతో విలువైనదిగా భావించానని చెప్పారు. ఆ పర్యటనలో ప్రధాని మోదీ, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో మధ్య చాలా ఫలప్రదమైన చర్చలు జరిగాయని వెల్లడించారు.

## కాంగ్రెస్‌లో టీఎంసీ విలీన వార్తలు పూర్తిగా అవాస్తవం

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు చేపట్టనున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ గురువారం ప్రకటించారు. ఇవి జూన్ నెలాఖరులో ప్రారంభమై, 2-3 నెలల పాటు దేశవ్యాప్తంగా కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. అలాగే, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కానుందని వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను తిరస్కరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇతర పార్టీల ఎంపీలతో రాజీనామా చేయించి బీజేపీలో చేర్చుకోవడం 'సీటు దొంగతనం' లాంటిదని విమర్శించారు. కాంగ్రెస్ కమిటీ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేణుగోపాల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "ఈ రోజు జరిగిన సమావేశంలో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ ఎన్నికల నామినేషన్ అంశంపై కూలంకషంగా చర్చించాం. రాజ్యసభలో మెజారిటీని సాధించడానికి వారు అనుసరిస్తున్న విధానం ఇది. ఇతర పార్టీల ఎంపీలతో రాజీనామా చేయించి, వారిని బీజేపీ ఎంపీలుగా మార్చుకుంటున్నారు. ఇది కేవలం ఓట్ల చోరీ మాత్రమే కాదు, ఏకంగా సీట్ల చోరీ. దీనిపై మేం న్యాయపరంగానూ, రాజకీయంగానూ పోరాడుతాం. అలాగే, దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై, ముఖ్యంగా ఆర్థిక సంక్షోభంపై కూడా మా సమావేశంలో చర్చించాం. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ గ్యాస్ ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు, కానీ ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. అలాగే, దేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. ఎంఎస్ఎంఈ రంగం పూర్తిగా దెబ్బతింది. యువత తమ భవిష్యత్తు గురించి తీవ్ర ఆందోళన చెందుతున్నారు."

మరోవైపు ఝార్ఖండ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాత్రం బీజేపీ కార్పొరేట్ అభ్యర్థి నామినేషన్ పత్రాల్లో ఆయన పేరును సరిగా ప్రస్తావించకపోయినా రిటర్నింగ్? అధికారి ఆమోదించారని కె.సి.వేణుగోపాల్? గుర్తు చేశారు. అంతేకాదు, రెండు కాలమ్‌లు నింపకపోయినా, అది తప్పుల తడకగా ఉన్నా దాన్ని ఆమోదించారని ఆరోపించారు. ఎలాంటి కారణాలు లేకుండానే మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఏకపక్షంగా తిరస్కరించారని మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్యం ఎంత దయనీయ స్థితిలో ఉందో ఇది చూస్తే అర్థమవుతుందని పేర్కొన్నారు. అయితే, ఈ అంశంపై సమావేశంలో లోతుగా చర్చించామన్నారు.

## ఓటు చోరీ.. ఇప్పుడు సీటు చోరీ



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. దేశాన్ని మోదీ సర్వనాశనం చేశారని చెప్పారు. ఆయన పాలనలో అన్ని వర్గాలకు కష్టాలే మిగులుతున్నాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని మోదీ సర్కార్ ఖూనీ చేస్తోందని చెప్పారు. అలాగే, కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షీ నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురైన విషయంపై రాహుల్ స్పందిస్తూ.. "ఓటు చోరీ, సర్కార్ చోరీ తర్వాత బీజేపీ-ఈసీ జుగల్‌బందీ, సీటు చోరీతో పోటీ మొదలుకాకముందే ముగించేసింది. ఇటీవలి రాజ్యసభ ఎన్నికల్లో ఏం జరిగిందో చూడండి. కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ ప్రతి పత్రాన్ని సమర్పించారు. పెండింగ్ కేసులు లేవు. బీజేపీ చేసిన చిన్న అభ్యంతరం ఆధారంగా ఈసీ ఆమె నామినేషన్‌ను రద్దు చేసింది. బీజేపీ మద్దతు ఉన్న స్వతంత్ర అభ్యర్థి పరిమల్ నత్వానీ దరఖాస్తు పత్రంలో తన పేరునే తప్పుగా రాశారు. తప్పనిసరిగా వెల్లడించాల్సిన ఎన్నో వివరాలు ఇవ్వలేదు. వాటన్నింటినీ సరిచేసుకునేందుకు ఈసీ ఆయనకు గడువు పొడిగించింది. ఒకరిని కనీసం విచారణ కూడా లేకుండానే అనర్హురాలిగా ప్రకటించారు. మరొకరికి మాత్రం నిబంధనలు పాటించకపోయినా ప్రోత్సాహం లభించింది. కాంగ్రెస్ నేతలు కలుస్తామని చెప్పినప్పుడు ఈసీ మొదట మమ్మల్ని తప్పించుకునే ప్రయత్నం చేసింది. చివరకు సమావేశం జరిగినప్పుడు, వారు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఇలాంటివి ఇంకా ఎక్కువగా కనిపిస్తాయి. ఎందుకంటే బీజేపీకి ఎన్నికల్లో గెలవడం కంటే, ఎన్నికల ప్రక్రియను తమకు అనుకూలంగా మార్చుకోవడం చాలా సులభం" అని అన్నారు.

## 'భారత్, అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలు'

భారత రాజకీయ చరిత్రలో వరుసగా ఎన్నికై అత్యధిక కాలం ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నాయకుడిగా రికార్డు సృష్టించిన ప్రధాని నరేంద్ర మోదీకి ప్రపంచవ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్? పంపిన అభినందన సందేశానికి మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్-అమెరికా మధ్య ఉన్న సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కలిసి పనిచేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

**ట్రంప్‌నకు మోదీ ధన్యవాదాలు**

సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన ప్రధాని మోదీ, ట్రంప్ పంపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు తెలిపారు. భారత్-అమెరికా సంబంధాలు ఇరు దేశాలకు మాత్రమే కాకుండా ప్రపంచ శ్రేయస్సుకు కూడా కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించి, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లేందుకు కలిసి పనిచేయాలని మోదీ ఆకాంక్షించారు.

**ఇథియోపియా ప్రధానికి మోదీ కృతజ్ఞతలు**

ఇథియోపియా ప్రధానమంత్రి అబియ్ అహ్మద్ అలీ పంపిన శుభాకాంక్షలకూ మోదీ స్పందించారు. గత ఏడాది ఇథియోపియాలో జరిగిన సమావేశాన్ని గుర్తు చేసుకుంటూ, రెండు దేశాల మధ్య సన్నిహిత సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. భారత్, ఇథియోపియా ప్రజలతో పాటు గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని మోదీ పేర్కొన్నారు. అబియ్ అహ్మద్ అలీ తన సందేశంలో మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, మూడు వరుస ప్రజాస్వామ్య ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని పొందిన నాయకుడిగా ఆయన ప్రత్యేక స్థానం సంపాదించారని అన్నారు. పేదరిక నిర్మూలన, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల విస్తరణ, భారీ స్థాయి మౌలిక వసతుల అభివృద్ధిలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను కొనియాడారు.

**టిమ్ కుక్ ప్రత్యేక సందేశం**

యాపిల్ సంస్థ సీఈఓ టిమ్? కుక్? కూడా ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. భారత చరిత్రలో ఎన్నికైన ప్రధానిగా అత్యధిక కాలం కొనసాగుతున్న నాయకుడిగా నిలవడం విశేషమని పేర్కొన్నారు. అలాగే ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధికి మోదీ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రశంసించారు. ప్రజల జీవితాలను మెరుగుపరిచే కొత్త ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడంలో భారత ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని టిమ్ కుక్ అభిప్రాయపడ్డారు.

**మాల్దీవుల అధ్యక్షుడి శుభాకాంక్షలు**

మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు కూడా ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మోదీ ఆయనకు ధన్యవాదాలు తెలుపుతూ, భారత్-మాల్దీవుల సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137